

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 20 + 16



గురువారం | 22-2-2018 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 223 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 2.29 తదుపరి అష్టమి; నక్షత్రం: భరణి మ. 1.34 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా. 1.08-2.41; దుర్ముహూర్తం: ఉ. 10.34-11.20 వరకు మ. 3.11-3.58; అమృతఘడియలు: ఉ. 8.52-10.26; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.16 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



కుంగుబాటు.. అసమర్థత కాదు

బాధితుల పట్ల సానుభూతి చూపాలి

వారిని ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదు

కార్పొరేట్ కంపెనీలకు

దీపికా పదుకోన్ సలహా

8

పీఎన్‌బీ జీఎం జిందాల్ అరెస్టు

నీరవ్‌కు ఎల్‌వోయూలు

ఆయన హయాంలోనే

14

ఈపీఎఫ్ వడ్డీలో కోత

8.65 నుంచి 8.55 శాతానికి తగ్గింపు

కరెంటు కేక

గిరగిరా తిరుగుతున్న గ్రిడ్ మీటర్

వాడకంలో తెలంగాణ కొత్త రికార్డు



21.02.2018 బుధవారం 7:40కి

9,894 మెగావాట్ల డిమాండ్

వారంలో 10 వేలు దాటడం ఖాయం

నిన్నటిదాకా డిమాండ్ లేక ఇబ్బంది

ఇక ఉత్పత్తి తగ్గించుకోనక్కరలేదు

కరెంట్ వినియోగం పెరుగుదల

తేదీ	వాడకం
డిసెంబరు 1	7126 మెగావాట్లు
డిసెంబరు 15	8399 మెగావాట్లు
డిసెంబరు 31	8901 మెగావాట్లు
జనవరి 1	9115 మెగావాట్లు
జనవరి 15	8458 మెగావాట్లు
జనవరి 31	9050 మెగావాట్లు
ఫిబ్రవరి 15	9596 మెగావాట్లు
ఫిబ్రవరి 21	9894 మెగావాట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, వ్యవసాయ వినియోగం అంతకంతకూ పెరుగుతుండటంతో తెలంగాణలో కరెంట్ వినియోగం ఎక్కువైపోయింది. రాష్ట్రం ఏర్పడ్డాక మునుపెన్నడూ లేనివిధంగా బుధవారం ఉదయం 7:40 గంటలకు 9,894 మెగావాట్ల డిమాండ్ రికార్డయింది. మూడున్నరేళ్ల రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధిక డిమాండ్. జనవరి నుంచి వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. రబీలో పంటలకు నీటి అవసరం అధికం కావడంతో వినియోగం పెరుగుతుందని ముందే అంచనా వేశారు. రానున్న వారం రోజుల్లో డిమాండ్ 10 వేలకు చేరుతుందని భావిస్తున్నారు. మార్చిలో

మిగతా 12వ పేజీలో...

వ్యవసాయానికి సౌర పంపుసెట్లు

'కుసుమ్' పథకం

కింద పంపుసెట్ల మార్పు

రూ.22 వేల కోట్లు

ప్రతిపాదించిన కేంద్రం

2



వనపర్తి-కొత్తకోట రహదారిపై జరిగిన ప్రమాద దృశ్యం

రహదారి రక్తదాహం

రెండు కార్లు ఢీకొని 9 మంది మృతి

టైర్ పేలి, డివైడర్‌పై నుంచి దూకి దూసుకెళ్లిన కారు

ఆరోడ్డులో వస్తున్న మరో కారుతో ఢీ

ఒక కారులో ఐదుగురు స్నేహితులు.. మరోదాంట్లో నలుగురు కుటుంబ సభ్యులు దుర్మరణం.. ఇద్దరి పరిస్థితి విషమం

వనపర్తి జిల్లా కొత్తకోటలో ఘోరం

వనపర్తి/కొత్తకోట/హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి స్నేహితుల బృందం వనపర్తి జిల్లాలో జాతరకు వెళుతోంది. కర్నూలు జిల్లాలో వివాహానికి హాజరై మరో కుటుంబం హైదరాబాద్‌కు తిరిగివస్తోంది. వారిది మహీంద్ర వెరిటో కారైతే వీరిది రేనాల్ట్ పల్స్. జాతరకు వెళుతున్న బృందం కారు మరో ఐదు నిమిషాలైతే జాతీయ రహదారిని వీడి పల్లె రోడ్డులోకి అడుగు పెట్టేది. ఇంతలో వారి కారు వెనుక టైర్ టైరు హఠాత్తుగా పేలింది. వాహనం అదుపుతప్పి డివైడర్ దాటి అమాంతం

మిగతా 2వ పేజీలో...



టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, సభ్యులు

షెడ్యూల్ మేరకే టీఆర్టీ

రాత పరీక్షల తేదీల్లో మార్పు లేదు

వెబ్‌సైట్‌లో తెలుగు సబ్జెక్టు హాల్‌టికెట్లు

మిగతావీ అందుబాటులోకి తెస్తాం

ఎస్జీటీలో 2 సబ్జెక్టులు, ఎస్ఏలో బయాలజీ, మ్యాథ్స్ మినహా మిగతావన్నీ సీబీఆర్టీలోనే

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి వెల్లడి

8

దక్షిణాదే ఎజెండా

కమల్ కొత్త పార్టీ ప్రారంభం.. పేరు 'మక్కల్ నీది మయ్యం'





ఆరు చేతులు, నక్షత్రంతో జెండా

అవి 6 దక్షిణాది రాష్ట్రాలకు సంకేతం

మదురైలో భారీ బహిరంగ సభ

అక్రమాలను మౌనంగా చూడొద్దనే ప్రజల కోసం రాజకీయ పార్టీ పెట్టా

ఉద్వేగంగా ప్రసంగించిన కమల్

సంఘీభావం ప్రకటించిన కేజ్రీవాల్

కేరళ సీఎం వీడియో సందేశం

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విలక్షణ విశ్వ నటుడు కమల్ హాసన్ రాజకీయ అరంగేట్రం చేశారు. 'మక్కల్ నీది మయ్యం' (ప్రజా న్యాయ కేంద్రం) పేరిట సొంత పార్టీని స్థాపించారు. బుధవారం రామేశ్వరంలో అబ్దుల్‌కలాం నివాసం నుంచి యాత్ర ప్రారంభించిన ఆయన... మదురైలో జరిగిన భారీ బహిరంగ సభలో, భారీగా తరలి వచ్చిన అభిమానుల సమక్షంలో తన పార్టీ పేరు, చిహ్నం, జెండా, అజెండా

మిగతా 11వ పేజీలో...

చంద్రబాబు నా హీరో

ఆయన ఆదర్శ పాలకుడు: కమల్

కమల్... నిజమైన 'నాయకన్' కావాలి: కేటీఆర్

11

ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా 4 పారిశ్రామిక పార్కులు

12



టీడీపీకి వంటేరు గుడ్‌బై?

మరో ముఖ్య నేత కూడా.. వచ్చే నెలలో కరచాలనం!

కాంగ్రెస్‌లోకి నాగం!

ఉగాది తర్వాత చేరిక.. ఉత్తమ్‌తో కలిసి రహస్యంగా ఢిల్లీకి

రాజు, ఖుంటియాలతో భేటీ.. అరుణ, దామోదర్‌రెడ్డి కుతకుత

ఆసక్తికరంగా పాలమూరు రాజకీయం.. బస్సు యాత్రపై బెంగ

12

కోదండతో రహస్య మైత్రి



అసంతృప్త టీఆర్ఎస్ నేతల డబుల్ గేమ్

టీజేఏసీ పెట్టబోయే పార్టీకి అండదండలు

ఉద్యమం నాటి సంబంధాల కొనసాగింపు

భవిష్యత్తు రాజకీయ అవసరాలే లక్ష్యం



సాయి.. సద్గురువా? దేవుడా?



పరంజ్యోతి (Paramjyothi)

షిర్డీ సాయి ఎవరు? దేవుడా? గురువా? ఎప్పుడైనా సాయి తనను తాను దేవుడిగా ప్రకటించుకున్నారా? కేవలం గురువుగా మాత్రమే మార్గదర్శకత్వం చేశారా?.. మొదలైన ప్రశ్నలు గత కొద్దికాలంగా తలెత్తుతూనే ఉన్నాయి. తరచి చూస్తే వీటికి సమాధానాలన్నీ సాయి జీవితం నుంచి మనకు లభిస్తాయి. సాయితత్వం అంటే ప్రేమతత్వం అనే విషయం అందరికీ తెలిసినదే. మరి ఆయన దేవుడా? లేక సద్గురువా అనే విషయంలోకి వెళ్లే ముందు.. ఈ రెండు పదాలకు మధ్య ఉన్న తేడాని మనం గమనించాలి. సద్గురువు తన శిష్యులకు జ్ఞానమార్గాన్ని చూపించి వారిని తనతో పాటు ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూ దైవానికి దగ్గర చేస్తాడు. శిష్యుల అజ్ఞానాన్ని పటాపంచలు చేసి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఇక దేవుడు మానవ రూపం ధరిస్తే దాన్ని అవతారం అంటారు. అవతారమూర్తికి పంచతత్వాలపై నియంత్రణ ఉంటుంది. సాయిలో ఈ రెండు లక్షణాలూ స్పష్టంగా మనకు కనపడతాయి. చాలా మంది భక్తులకు షిర్డీ సాయి సన్నిధిలో అన్ని బాధలూ తొలగిపోయినట్లు అనిపిస్తాయి. మరికొందరు భక్తులకు అవసరమైన సందర్భాల్లో సాయి మహిమలు చూపాడు తప్ప తాను దేవుడినని ప్రకటించుకుని ప్రజలను నమ్మించలేదు. అందుకే సాయి కొందరికి సద్గురువు. కొందరికి దేవుడు. సాయి బోధనలైన జీవకారుణ్యం, సర్వమత సమానత్వం, సామాజిక సౌభ్రాతృత్వం మొదలైనవన్నీ మన ఆధునిక సమాజానికి పనికొచ్చేవే! అందుకే ఆయన ప్రవచించిన ప్రేమతత్వం ఆయన మరణించిన ఇన్నేళ్ల తర్వాత కూడా ఖండఖండాంతరాల్లోనూ వ్యాప్తి చెందుతోంది. ఈ సమయంలో ఆయన దేవుడా? లేక కేవలం గురువా? అనే విషయంపై చర్చ కన్నా ఆయన చెప్పిన విలువలను పాటించడం మంచిది!

-భానుచంద్ర సత్పతి



స్వామివారి ఊరేగింపులో ప్రధానార్చకులు, ఈవో, తదితరులు

వటపత్రసాయిగా.. నారసింహుడు



వటపత్రసాయి అలంకరణలో లక్ష్మీనృసింహుడు

యాదాద్రి,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన బుధవారం లక్ష్మీనృసింహుడు వటపత్రసాయి అలంకారంలో భక్తజనులకు దర్శనమిచ్చారు. అవతార పురుషుడైన మహావిష్ణువు చిన్ని కృష్ణుడిగా చేసిన లీలలను దర్శింపజేసేందుకు వటపత్రసాయిగా అలంకరించారు. రుత్వికులు, అర్చకులు, వేదపండితుల పారాయణాలు, వేద పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి అలంకార సేవ నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారు పొన్నవాహనంపై ఊరేగుతూ భక్త జనులకు దర్శనమిచ్చారు. పొన్న వృక్షంపై వాసుదేవ స్వరూపం కనిపించింది.



మిషన్ కాకతీయపై గత ఏడాది రవీందర్ రెడ్డి రాసిన కథనం



రవీందర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి విలేకరికి మిషన్ కాకతీయ మొదటి బహుమతి

హైదరాబాద్/వనపర్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రింట్ మీడియా కేటగిరిలో మిషన్‌కాకతీయ మొదటి బహుమతి వనపర్తి జిల్లా ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ నోముల రవీందర్‌రెడ్డికి దక్కింది. ఈ అవార్డులను బుధవారం ప్రకటించారు. మిషన్ కాకతీయపై ఏటా మీడియా అవార్డులు ఇస్తున్న రాష్ట్రప్రభుత్వం 2017వ సంవత్సరానికి కూడా ప్రకటించింది.మిషన్ కాకతీయ పథకం వల్ల ఆయా రంగాల్లో వచ్చిన మార్పులు, ప్రజల జీవన విధానంలో చోటు చేసుకున్న అభివృద్ధిపై రాసిన ప్రత్యేక కథనాలకు ఈ అవార్డులను ఇచ్చారు. అవార్డుల ఎంపిక కోసం న్యాయనిర్ణేతల కమిటీ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయింది. మీడియా అకాడమీ అధ్యక్షుడు అల్లం నారాయణ అధ్యక్షతన కమిటీ సభ్యులు 'తెలంగాణ టుడే' సీనియర్ జర్నలిస్ట్ బాలకోటేశ్వరరావు, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తిలు అవార్డులకు వచ్చిన ఎంట్రీలను పరిశీలించి ఎంపిక చేశారు. గత సంవత్సరం జనవరి 13వ తేదీన ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్ మొదటి పేజీలో రవీందర్‌రెడ్డి రాసిన "పాలమూరుకు పండుగొచ్చింది" శీర్షికన ప్రచురితమైన కథనం మొదటి బహుమతికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆయనకు లక్ష రూపాయల నగదు బహుమతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

అలాగే ప్రింట్ మీడియా కేటగిరిలో రెండో బహుమతి శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ), మూడో బహుమతి కె. మల్లికార్జునరెడ్డి (సాక్షి)లకు దక్కాయి. అలాగే జ్యూరీ ప్రత్యేక బహుమతులకు పి. శ్రీనివాస్ (తెలంగాణ టుడే), చిన్నా రెడ్డి (నమస్తే తెలంగాణ), ఫొటో జర్నలిస్టుల బహుమతులకు గొట్టె వెంకన్న (నమస్తే తెలంగాణ), రజనీ కాంత్ గౌడ్ (నమస్తే తెలంగాణ)లు ఎంపిక అయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా కేటగిరిలో మొదటి బహుమతిని కె. శ్రీశైలం (ఈటీవీ), రెండో బహుమతి గురు ప్రసాద్ (టివి-1), మూడో బహుమతి విక్రంరెడ్డి (సాక్షి-టివి)లు ఎంపికయ్యారు. అలాగే వీడియో జర్నలిస్టుల బహుమతుల కేటగిరిలో సూర్యనారాయణ (ఈ-టీవీ), అంజి (టీవీ-1), జ్యూరీ ప్రత్యేక బహుమతికి శ్రీరాములు గౌడ్ ఎంపికయ్యారు. కాగా మీడియా అవార్డులకు ఎంపికైన జర్నలిస్టులకు మంత్రి హరీశ్‌రావు అభినందనలను తెలిపారు. త్వరలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఈ అవార్డులను అందజేయనున్నట్టు ప్రకటించారు.

కేసీఆర్ సోదరి కన్నుమూత

▸▸ **అంత్యక్రియల్లో పాల్గొన్న సీఎం, హరీశ్, కేటీఆర్, కవిత**

అల్వాల్/హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ సోదరి విమలాబాయి(86) కన్నుమూశారు. కొద్దిరోజులుగా సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆమె బుధవారం తుది శ్వాస విడిచారు. ఆస్పత్రి నుంచి విమలాబాయి భౌతిక కాయాన్ని అల్వాల్‌లోని స్వగృహానికి తరలించారు. 9 మంది సోదరీమణులు ఉన్న కేసీఆర్‌కు విమలాబాయి రెండో సోదరి. మధ్యాహ్నం అల్వాల్ చేరుకున్న కేసీఆర్ సోదరి మృతదేహాన్నిచూసి ఒక్కసారిగా విలపించారు. బంధువులు ఓదార్చినా జేబురుమాలు అడ్డుపెట్టుకొని ఏడవడం కనిపించింది. ఆర్టీసీ కాలనీ శ్మశాన వాటికలో నిర్వహించిన అంత్యక్రియల్లోనూ కేసీఆర్ పాల్గొన్నారు. స్వయానా పెద్దమ్మ అయిన విమలాబాయి అంత్యక్రియల ఏర్పాట్లను మంత్రి హరీశ్ దగ్గరుండి చూసుకున్నారు. ఆయనతో పాటు మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత కూడా చాలాసేపు అక్కడే ఉన్నారు. విమలాబాయి అంత్యక్రియల్లో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న, ఎమ్మెల్సీలు మైనంపల్లి హన్మంతరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ ఎం.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సోదరి మృతదేహం వద్ద విలపిస్తున్న సీఎం కేసీఆర్ (ఇన్‌సెట్‌లో) విమలాబాయి (ఫైల్)



తనకు కేటాయించిన పాక ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఆస్తి కోసం అమ్మను గెంటేశాడు!

▸▸ **తోబుట్టువులను కూడా పొమ్మన్నాడు!.. పాల్వంచ పట్టణంలో ఘటన**

పాల్వంచ టౌన్, ఫిబ్రవరి 21 : అమ్మ కంటే కొందరికి ఆస్తి ఎక్కువైపోతోంది. డబ్బు మోజులో రక్త సంబంధాలను కూడా తెంచుకునేంతగా దిగజారిపోతున్నారు కొందరు కొడుకులు! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరుగూడెంలో బుధవారం అలాంటి సంఘటనే జరిగింది. గ్రామానికి చెందిన నల్లపు పిచ్చయ్య, దేవకరుణలకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లున్నారు. వారిలో ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులకు వివాహం జరిగింది. కొంతకాలం క్రితం పిచ్చయ్య కన్నుమూశాడు. ఇటీవల చిన్న కూతురు సరితకు వివాహం నిశ్చయమైంది. ఈ తరుణంలో అన్నీతానై వ్యవహరించాల్సిన పెద్ద కొడుకు నల్లపు వెంకటేశ్వర్లు..ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటివేశాడు. ఆరు నెలలుగా కొడుకు, కోడలు పెడుతున్న చిత్రహింసలు భరించలేక బంధువుల ఇంట్లో తలదాచుకుంటూ వచ్చారు. బంధువుల సూచన మేరకు ఇటీవల సొంత ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పెద్ద కొడుకు గదులకు తాళం వేశాడు. 'మీకు లక్ష రూపాయలు ఇస్తాను.. ఇంటి నుంచి వెళ్లిపోండి.. లేకపోతే ఏమి చేసుకుంటారో చేసుకోండి' అని బెదిరింపులకు పాల్పడుతున్నాడని దేవకరుణ వాపోతోంది. విధి లేని పరిస్థితుల్లో పెద్ద కొడుకు ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. 70 ఏళ్ల క్రితం పిచ్చయ్య స్వార్జితంతో సంపాదించిన విలువైన ఆస్తిని.. పెద్ద కొడుకు నల్లపు వెంకటేశ్వర్లు 2002లోనే పథకం ప్రకారం కబ్జా చేశాడని తల్లి చెబుతోంది. లక్షల విలువచేసే ఆస్తిని ఒక గిరిజనుడికి రూ.45వేలకు అమ్మినట్లు పత్రాలు సృష్టించాడనీ.. 2009లో ఆ గిరిజనుడి నుంచి రూ.70వేలకు కొనుగోలు చేసి..తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తల్లి ఆరోపిస్తోంది.

కావాలనే రోడ్డుకీడుస్తోంది : నల్లపు వెంకటేశ్వర్లు

ఉద్యోగస్థుడినైన తనను రోడ్డుకీడ్చడానికే తన తమ్ముడు, చెల్లి, తల్లి కలిసి ప్రయత్నిస్తున్నారని వెంకటేశ్వర్లు ఆరోపిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగోలేక తన తండ్రి ఆస్తిని 2002లో ఒక గిరిజనుడికి అమ్మామని, తన తండ్రి సంపాదించిన ఆస్తిని దక్కించుకోవాలని 2009లో అతనికి రెట్టింపు పైకమిచ్చి కొనుగోలు చేశానంటున్నాడు.



వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, లోపల ఇరుక్కున్న మృతదేహాలు



మల్లేష్ (ఫైల్)



రాజు (ఫైల్)



ఆంజనేయులు (ఫైల్)



నరేష్ (ఫైల్)

రహదారి రక్త దాహం

(మొదటిపేజీ తరువాయి)

అవతలివైపు రోడ్డు మీదకు వచ్చేసింది. ఎదురుగా వస్తున్న రేనాల్ట్ కారును వేగంగా ఢీకొంది. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై రెప్పపాటులో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో ఇరు వాహనాల్లోని తొమ్మిది మంది మరణించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ఘోరం సంభవించింది. జాతరకు వెళుతున్న ఐదుగురు స్నేహితులతో పాటు, హైదరాబాద్ వస్తున్న కుటుంబంలోని నలుగురు అసువులు బాసారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని మల్లాపురం కాలనీలో నివాసముంటున్న మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాలకు చెందిన రాజు(అజ్జకొల్లు), బీరయ్య(గోపన్‌పేట), మల్లేశ్, మొగులన్న (మస్తీపురం), ఆంజనేయులు (మూలమళ్ల), నరేశ్ (నందిమల్ల) చిన్నచింతకుంట మండలంలోని నెల్లికొండి గ్రామంలో జరుగుతున్న జాతరకు పాల్గొనడానికి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరారు. మొత్తం కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నారు.



ప్రమాద స్థలంలో మృతుల సామాన్లు

వారిలో బీరయ్య(26), మల్లేష్(28), రాజు(38), ఆంజనేయులు (40), నరేశ్ (40) మృతి చెందారు. మొగులన్న మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కర్నూలు జిల్లా కల్లూరు నుంచి వస్తున్న పెళ్లిబృందం కారులోని వారి పరిస్థితి మరింత దయనీయం. వారి మానాన వారు తమ రోడ్డులో వెళుతుండగా ఉరుము లేని పిడుగులా పక్కరోడ్డు మీద నుంచి కారు వీరి మీదకు దూసుకొచ్చింది. కారులో ఐదుగురుప్రయాణిస్తుండగా సూరిబాబు(45), రాజమ్మ (65), ప్రసూనాంబ (70)లు అక్కడికక్కడే మృతిచెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సూరిబాబు భార్య సునీత(40) తుది శ్వాస విడిచింది. సూరిబాబు కూతురు కల్పన ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వీరంతా హైదరాబాద్ శివారు బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేటకు చెందిన వారిగా పోలీసులు నిర్ధారించారు. దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే ఆయా గ్రామాల్లో బంధువులంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

ఉలిక్కిపడ్డ బడంగ్‌పేట

బడంగ్‌పేటలో నివసించే సిండె సూరిబాబు సహా ఆయన కుటుంబానికి చెందిన మరో ముగ్గురు కొత్తకోట వద్ద జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వనపర్తికి చెందిన సూరిబాబు ఆరేళ్ల క్రితం బడంగ్‌పేటకు వచ్చి స్థిరపడ్డారు. బడంగ్‌పేటలోని దుర్గాహిల్స్ కాలనీలో పరుపులు, దిండ్లు తయారు చేసే ఓ చిన్న పరిశ్రమ పెట్టుకుని, పలువురుకి ఉపాధి కల్పిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులంతా స్థానికంగా అందరితో కలుపుగోలుగా ఉండేవారని స్థానికులు చెప్పారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.8	16.5
సంగారెడ్డి	33.0	19.0
ఖమ్మం	35.0	19.0
వరంగల్	33.0	19.5
హైదరాబాద్	32.3	19.9

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 6 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో గురువారం లాటరీ ద్వారా జారీచేసే టిక్కెట్లు.. సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



మార్కెట్లో బక్రాలు లేరనుకుంటున్నా!

మార్కెట్లో 'బక్రాలు' ఉన్నారని నేను అనుకోవడం లేదు. రూ.70,000 కోట్లు కూడబెట్టి, ఎయిర్ ఇండియాను కొనాలంటే ఏ ఒక్కరూ ముందకురారని అనుకుంటున్నాను.

- అశోక్ గజపతిరాజు, కేంద్ర మంత్రి



రాహుల్ ఓ బచ్చా!

ఆ బచ్చాను (రాహుల్‌గాంధీ) కర్ణాటకకు తీసుకొచ్చారు. ఇప్పుడు 150కిపైగా సీట్లలో గెలుస్తామని మాకు ఇంకా నమ్మకం కుదిరింది. 70 ఏళ్లుగా కాంగ్రెస్ 'గరీబీ హఠావో' అంటోంది గానీ పేదల బతుకులు మురికివాడల్లోనే తెల్లారిపోతున్నాయి. పేదల అభ్యున్నతి మాతోనే సాధ్యం.

-యడ్యూరప్ప, బీజేపీ నేత (పార్టీ సోషల్ మీడియా కాంక్లేవ్‌లో)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.95	పాత ధర 67.69
కొత్త ధర రూ.75.92	కొత్త ధర 67.67
తగ్గింది : 00.03 పైసలు	తగ్గింది : 00.02 పైసలు



లేజర్ కిరణాలతో స్మార్ట్‌ఫోన్లకు వైర్‌లైస్ చార్జింగ్

వాషింగ్టన్, ఫిబ్రవరి 21: ప్రస్తుతం వైర్‌లెస్ చార్జింగ్‌పై ఆసక్తి పెరుగుతోంది. అందుకే గదిలో ఎక్కడి నుంచైనా సరే లేజర్ కిరణాలతో స్మార్ట్‌ఫోన్లను చార్జ్ చేసే కొత్త వ్యవస్థను రూపొందించారు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ శాస్త్రవేత్తలు. ఇందు కోసం మొబైల్ వెనుకాల పలుచని పవర్ సెల్‌ను అమర్చుతారు. దీని ద్వారా లేజర్ బీమ్ చుట్టూ 4.3మీటర్ల పరిధిలో మొబైల్‌ను చార్జింగ్ చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా యూఎస్‌బీ కేబుల్ కంటే వేగంగా చార్జింగ్ ఎక్కుతుందని చెప్పారు.

క్షయ వ్యాప్తిని గుర్తించే కృత్రిమ మేధ

లాస్ ఏంజెలిస్, ఫిబ్రవరి 21: ఎక్కువ జనాభా ఉన్న భారత్ వంటి దేశాల్లో అంటువ్యాధుల వ్యాప్తికి అవకాశం ఎక్కువ. క్షయ వంటి అంటువ్యాధుల వ్యాప్తి తీవ్రతను గుర్తించడం చాలా కష్టం. అందుకే వాటి వ్యాప్తిని గుర్తించి, దాన్ని అడ్డుకునేందుకు దోహదపడే కొత్తరకం కృత్రిమ మేధను అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సౌతర్న్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మనుషుల ప్రవర్తన, జనాభా, అంటువ్యాధుల వ్యాప్తి సమాచారం, వాటి నమూనాల ఆధారంగా ఈ కృత్రిమ మేధను రూపొందించారు. దీని ద్వారా భారత్‌లోని క్షయ, అమెరికాలోని గనేరియా వ్యాప్తిని కచ్చితంగా గుర్తించిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అజీజ్‌నగర్ శాఖలో ఆర్థిక కుంభకోణంపై విచారణకోసం క్యాషియర్ జైపాల్‌రెడ్డిని సీబీఐ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.రూ.9కోట్లు గల్లంతైన స్కాంలో ఇతరుల వివరాలూ సేకరించనుంది.

ప్రతిభ ఉంటేనే అమెరికాలో అవకాశాలు

ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఉద్యోగాలకు పెరిగిన పోటీ.. యూనివర్సిటీ ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

- **తానా ఎలక్టెడ్ ప్రెసిడెంట్ జయశేఖర్, ఎన్ఆర్ఐ రాకేష్ సూచనలు**
- **విదేశీ విద్యపై విద్యార్థులు, తల్లిదండ్రులకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**



విదేశీ విద్యపై ఖమ్మంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తానా ఎలక్టెడ్ ప్రెసిడెంట్ జయశేఖర్ తాళ్లూరి, ఎన్ఆర్ఐ బత్తినేని రాకేష్

ఖమ్మం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక, ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రతిభ, నైపుణ్యాలు ఉంటేనే అమెరికాలో మంచి అవకాశాలు లభిస్తాయని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఎలక్టెడ్ ప్రెసిడెంట్ తాళ్లూరి జయశేఖర్, ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్త బత్తినేని రాకేష్ అన్నారు. విద్యార్థులు ఆ దిశగా సమాయత్తమైతే భవిష్యత్తు బాగుంటుందని సూచించారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యాక ఆ దేశంలోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు పోటీ అధికమైందని, ముందునుంచే విద్యార్థులు మంచి యూనివర్సిటీలను ఎంచుకుని వాటిలో మాస్టర్స్ చేయాలన్నారు. బుధవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో శ్రీ కవితా విద్యాసంస్థలు, బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో విదేశీ విద్యపై నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాళ్లూరి జయశేఖర్ మాట్లాడుతూ.. అమెరికా వెళ్లాలంటే ఇక్కడి విద్యార్థులు నైపుణ్యం కలిగిన విద్యను అభ్యసించాలని, మార్కుల ట్రెండ్ కాకుండా ఫండమెంటల్ కాన్సెప్ట్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అమెరికాలోనూ 140 వర్సిటీలను అనర్హమైనవిగా అక్కడి ప్రభుత్వం గుర్తించి మూసివేసిందని, దీంతో 40 వేల మంది విద్యార్థులు వీధులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని.. రెండు, మూడేళ్లపాటు అనుభవం వచ్చిన తర్వాత అమెరికాలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని, ఎంఎస్ చేస్తే ఆ విద్యార్థులు మరింతగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి తమ పిల్లలను అమెరికా పంపిస్తుంటే.. అక్కడ విద్యార్థులు ఒక పూట చదువుతూ, మరో పూట బంకుల్లో, సూపర్ మార్కెట్లలో పనిచేస్తున్నారని గుర్తుచేశారు.ఈ క్రమంలో తనిఖీల సమయంలో దొరికిపోయి.. భవిష్యత్తులో అమెరికా వెళ్లే అవకాశాన్నే కోల్పోవాల్సివస్తోందన్నారు.

గుర్తింపులేని యూనివర్సిటీల్లో చేరొద్దు..

అమెరికా వెళ్తున్న విద్యార్థులు పలువురు గుర్తింపులేని యూనివర్సిటీల్లో చేరి మోసపోతున్నారని ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్త బత్తినేని రాకేష్ అన్నారు. కన్సల్టెన్సీలు తమ కమీషన్ల కోసం ఏదో ఒక యూనివర్సిటీకి పంపించి చేతులు దులిపేసుకుంటున్నాయని, వాటిలో చదివిన విద్యార్థులు ఉద్యోగావకాశాలు లేక అవస్థలు పడాల్సివస్తోందని పేర్కొన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భారత యువతకు ఉద్యోగావకాశాలను కష్టతరం చేశారని తెలిపారు. మంచి నైపుణ్యాలు కలిగి, ప్రతిభ ఉన్న వారికి మాత్రమే అమెరికాలో పౌరసత్వానికి అవకాశం దక్కుతోందని, ఇందుకు కనీసం 5నుంచి 7ఏళ్ల సమయం పడుతోందని అన్నారు. భవిష్యత్తులో అమెరికాలో విద్య మరింత కష్టతరం కానుందని తెలిపారు. కాగా సాంకేతిక విద్యను పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగమా? ఉన్నత విద్యా? అన్న విషయంలో స్పష్టతకు వచ్చి.. ఆ మార్గంలో పయనించాలని శ్రీ కవితా విద్యాసంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ఇలాంటి అవగాహన సదస్సు నిర్వహించడం విద్యార్థులకు ప్రయోజనకరమన్నారు. ఈ సదస్సులో కన్సల్టెంట్ సరితారెడ్డి, శ్రీ కవిత విద్యాసంస్థల అధినేత పారుపల్లి విజయలక్ష్మి, విజయ కళాశాల కరస్పాండెంట్ బుచ్చిరామయ్య, ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, బ్యూరో ఇన్‌చార్జి నలజాల వెంకట్రావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పాత మేట్లను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని, కొత్త మేట్ల నియామకానికి జారీ చేసిన సర్క్యులర్ 1786ను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సంఘం నేతలు ప్రసాద్, ఆర్ వెంకట్రాములు, పద్మ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు నీతూ ప్రసాద్‌కు లేఖ రాశారు. 20రకాల పనులుచేస్తున్న మేట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

రాణా మెట్లెక్కిన పండుటాకులు!

- **కొడుకులు పోషించడం లేదని ఆవేదన**



శ్రీనివాస్-వెంకటమ్మ దంపతులు



భూమయ్య

జగిత్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గోరుముద్దలు తినిపించి పిల్లలను అల్లారుముద్దుగా పెంచారు ఆ తల్లిదండ్రులు! కానీ వారికి ముద్ద అన్నం పెట్టడం లేదు పిల్లలు! చెట్టంత కొడుకుల నీడలో రాలిపోవాలనుకున్న ఆ పండుటాకులకు నిలువ నీడ లేకుండా చేశారు. దీంతో ఆ వృద్ధ దంపతులు గత్యంతరంలేక రాణా మెట్లు ఎక్కారు. దయచూపి.. తమకు తిండి పెట్టేలా చూడాలంటూ జగిత్యాల జిల్లా ఎస్పీ అనంతశర్మను బుధవారం కలిసి వేడుకున్నారు. జగిత్యాల మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన మండలోజు భూమయ్య(82), నర్సవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిని పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. ఓపిక ఉన్నంతవరకూ దంపతులు తమ తంటాలు తామే పడ్డారు. వృద్ధాప్యంలో అడుగుతీసి అడుగు వేయలేక.. వంట చేసుకోలేని స్థితిలో ఉన్నారు. ముగ్గురిలో రెండో కొడుకు చనిపోయాడు. తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన పెద్ద కుమారుడు గంగాధర్, చిన్న కుమారుడు శ్రీనివాస్‌లు ఛీ కొట్టడంతో వృద్ధ దంపతులు తల్లడిల్లిపోతున్నారు. కొడుకులు తిండికూడా పెట్టడం లేదంటూ పోలీసులను ఆశ్రయించారు.

మరో వృద్ధ దంపతులు..

మల్యాల మండలం రాంపూర్‌కు చెందిన మరో వృద్ధ దంపతుల పరిస్థితి దయనీయంగా మారింది. రాంపూర్ గ్రామానికి చెందిన గాదె శ్రీనివాస్(80), వెంకటమ్మ(77) దంపతులకు ముగ్గురు కుమారులు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు ఒక్కో కుమారుడు నెలకు రూ.300 ఇవ్వాలని గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానం జరిగింది. నడిపి కొడుకు, చిన్న కొడుకులు డబ్బులు ఇస్తున్నప్పటికీ.. పెద్ద కొడుకు ఇవ్వకపోగా.. కోడలితో కలిసి తమను చిత్రహింసలు పెడుతున్నాడని శ్రీనివాస్, వెంకటమ్మ దంపతులు ఎస్పీ ఎదుట కంటతడి పెట్టుకున్నారు. గదిలో బంధించారని, బయటకు వెళ్లకుండా కరెంట్ తీగలు పెట్టారని.. తప్పించుకుని జగిత్యాలలో ఉంటున్నామని ఆవేదన చెందారు. ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం ఇచ్చిన ఇంటిని కష్టపడి కట్టుకున్నామనీ.. ఆ ఇంట్లో తమను పెద్ద కొడుకు ఉండనివ్వడం లేదని, న్యాయం చేయాలని కోరారు.

నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణం



విద్యుత్ స్తంభంపై గోపినాథ్ మృతదేహం

కోదాడ రూరల్, ఫిబ్రవరి 21: చిన్నపాటి నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. కొద్దిరోజుల్లో పెళ్లి చేసుకుని హాయిగా జీవిస్తాడనుకున్న కొడుకు ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గణపవరంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. చిలుకూరు మండలం దూదియాతండాకు చెందిన ధరవాత్ గోపీనాథ్(23) విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. బుధవారం గణపవరం-యర్రవరం గ్రామ శివారులో వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకే స్తంభంపై యర్రవరం, కందిబండకు చెందిన రెండు ఫీడర్లు ఉన్నాయి. ఈ లైన్లకు నూతన కనెక్షన్లు ఇవ్వడానికి యర్రవరం గ్రామానికి వెళ్లే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని లైన్‌మన్ కందిబండ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. కానీ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ కందిబండ ఫీడర్ ఆఫ్‌చేసి.. యర్రవరం ఫీడర్‌కు విద్యుత్ ఆన్ చేశాడు. దీంతో స్తంభంపై లైన్లు సరిచేస్తున్న గోపీనాథ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గోపీనాథ్‌కు మేనమామ కుమార్తెతో నెల కిందట నిశ్చితార్థం జరిగింది. ఉగాది తర్వాత వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ఈ ఘోరం జరగడం అందరినీ కలచివేసింది.

రోడ్డెక్కిన రైతన్న

నాలుగు జిల్లాల్లో కంది, శనగ రైతుల ఆందోళన



కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో రైతుల రాస్తారోకో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఒకేరోజు నాలుగు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కారు. పండించిన పంటను అమ్ముకునే అవకాశం, మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఆందోళనకు దిగారు. శనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటూ నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని సాటాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద స్థానిక రైతులు బుధవారం రాస్తారోకో చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో శనగకు మద్దతు ధర కల్పించడం లేదంటూ అక్కడి రైతులు రోడ్డుపై బైఠాయించారు. మరోవైపు కందుల కొనుగోలు కేంద్రాన్ని నిలిపివేయడంతో కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. రెంజల్ మండలంలో 6,400 ఎకరాలలో శనగ పంటను సాగు చేశామని, సుమారు 50 వేల క్వింటాళ్ల శనగ దిగుబడి వచ్చిందని, కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ పలువురు రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ రామ్మోహన్‌రావుకు విన్నవించారు. అయినా ఫలితం లేకపోవడంతో రాస్తారోకో చేపట్టారు. చివరికి జేసీ రవీందర్‌రెడ్డి హామీతో విరమించారు. కాగా నాగర్‌కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో శనగ ధర గత మూడు రోజులుగా తగ్గుతూ వస్తోంది. క్వింటాలు శనగ గరిష్ఠ ధర రూ.4800 ఉండగా.. కనిష్ఠ ధర రూ. 3781 మాత్రమే ఉంది. దీంతో రైతులు శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. మరోవైపు వనపర్తి జిల్లా కేంద్ర శనగ రైతులు చేపట్టిన ఆందోళనలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. జేసీ నిరంజన్‌రావు అక్కడికి చేరుకొని ఎమ్మెల్యేతో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో రైతులు కొనుగోలు కేంద్రానికి కందులను తీసుకురాగా.. అధికారులు వాటిని కొనుగోలు చేయలేదు. దీంతో వారు ఆందోళనకు దిగడంతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

భువనగిరి మార్కెట్‌లో దళారుల కందులు..

యాదాద్రి జిల్లా కేంద్రమైన భువనగిరిలోని కందుల కొనుగోలు కేంద్రానికి దళారులు 60 క్వింటాళ్ల కందులను తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నించగా రైతులు గమనించి అడ్డుకున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ఓ వ్యాపారి వీటిని తీసుకొచ్చినట్లు గుర్తించారు. జగిత్యాల జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వనపర్తిలో శనగ రైతులతో కలిసి రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి

ఘరానా దొంగలు!

తమ దొంగతనాన్ని గుర్తించినందుకు దొంగలే తిరిగి బెదిరించే పాడుకాలం దాపురించింది. విదేశాలకు పారిపోయిన నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకును ఉద్దేశించి రాసిన లేఖ ఎంతో ఆశ్చర్యం కలిగిస్తున్నది. బాకీ పడిన మొత్తాన్ని తీర్చస్తానని చెప్పినప్పటికీ, బ్యాంకు ఫిర్యాదు కారణంగానూ, మీడియా వెంటపడినందునా ఇప్పుడు తాను బాకీలు తీర్చలేని స్థితిలోకి నెట్టబడ్డానన్నది ఆ ఉత్తరం సారాంశం. ఎత్తుకుపోయిన సొత్తును ఇన్‌స్టాల్‌మెంట్లలో తిరిగిచ్చేస్తానని దొంగలు హామీ ఇచ్చిన తరువాత కూడా పోలీసులు కేసులు పెడితే ఎలా? బాకీలు చెల్లిస్తానని నీరవ్ మోదీ మాటమాత్రంగానైనా అన్నందుకు ఎగిరిగంతేయాల్సిన బ్యాంకు సీబీఐకి, ఆర్బీఐకి ఫిర్యాదు చేస్తే ఎలా? ఇలా తన బ్రాండ్‌ను, వ్యాపారాన్ని సర్వనాశనం చేశారని బ్యాంకును తిట్టిపోస్తూ, అది ఈ పాపానికి పాల్పడినందువల్ల ఇక అప్పు తీర్చేది లేదు పొమ్మంటున్నాడు నీరవ్. స్తంభింపచేయాల్సిన తన ఖాతా సొమ్మును తన ఉద్యోగుల జీతాలు చెల్లించడానికి వాడమన్న నీరవ్ ఇప్పుడు తన ఉద్యోగులను వేరే ఉద్యోగాలు చూసుకోమంటూ లేఖ రాశాడు. ఇప్పుడిక ఆయన పూర్తిగా చేతులు దులిపేసినట్టే. దేశాన్ని ముంచిపోయిన విజయ్‌మాల్యా కూడా ఆరంభంలో ఇలాంటి లేఖలే వరుసగా రాశాడు. ఒకసారి దేశం నుంచి సకుటుంబ సపరివారంగా ఎగిరిపోయిన తరువాత తమను ఎవరూ తాకలేరన్న విషయం మోదీలకు, మాల్యాలకు బాగా తెలుసు.

నీరవ్ పేరులో మోదీ ఉండటం ప్రధానికి ఎంతో ఇబ్బంది కలిగించే అంశం. చిన్న మోదీ అంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అటుంచితే, దేశ ప్రజలు కూడా ఈ మారు ఎందుకో షాక్ తిన్నారు. రెండేళ్ళక్రితం మద్యం వ్యాపారి విజయ్ మాల్యా బ్యాంకులకు ఓ పదివేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయినప్పుడు అందులో అధికంగా యూపీయే పాపమే తప్ప మోదీ ప్రభుత్వం తప్పు వారికి కనిపించలేదు. మాల్యాను మీరే దేశంనుంచి తప్పించారు అని బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంతగా ఆడిపోసుకున్నా ఆ విమర్శలు ప్రజల మనసులను తాకలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన మోదీకి ఈ దేశాన్ని ప్రక్షాళించేందుకు కొంత సమయం పడుతుంది కదా అని సరిపెట్టుకున్నారు. కానీ, నీరవ్ వ్యవహారం చూసిన తరువాత మోదీ కూడా తమను మోసగించారని వారికి అనిపించడం సహజం.

మాల్యాతో పోలిస్తే నీరవ్ మోసం భిన్నమైనది. తీసుకున్న అప్పులు ఎగ్గొట్టి మాల్యా బ్యాంకులను ముంచేశాడు. నీరవ్ ఏకంగా బ్యాంకులోనే తిష్టవేసి, జేబునుంచి రూపాయి తీయకుండా సాంకేతిక మాయతో వేలకోట్ల వ్యాపారం చేసుకున్నాడు, బ్యాంకు సొమ్ముతో అప్పులు తీర్చుకున్నాడు. బీజేపీ చెబుతున్నట్టుగా ఇది ఎనిమిదేళ్ళుగా సాగుతున్న మోసమే. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన ఓ బ్రాంచి కేంద్రంగా సాగిన ఈ దారుణంతో మోదీకి కానీ, ప్రభుత్వ పెద్దలకు కానీ సంబంధం లేదన్నదీ వాస్తవమే. కానీ మాల్యావంటి మరో మోసకారి ఈ దేశంనుంచి పెళ్ళాం పిల్లలతో ఇంత సునాయాసంగా ఎగిరిపోగలగడమే ప్రజలు ఆశ్చర్యపరుస్తున్నది. అవినీతి వ్యతిరేక ఎన్నికల ప్రచారంలో తాను కాపలాదారుగా ఉంటానని మోదీ హామీ ఇవ్వడం, అవినీతి విషయంలో మన్మోహన్ సింగ్ నిష్క్రియాపరత్వాన్ని ఎద్దేవా చేస్తూ ఆయనను 'మౌన్' మోహన్‌గా అభివర్ణించడం ఇప్పుడు అనేకులకు గుర్తుకు వస్తున్నాయి. నీరవ్ మోసాలపై ప్రధానమంత్రి కార్యాలయంతో సహా రెండేళ్ళుగా అనేక స్థాయిల్లో ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు తీసుకోలేదన్న విమర్శలు రేగడం, డావోస్‌లో మోదీతో పాటు ఫోటో దిగిన పారిశ్రామికవేత్తల్లో నీరవ్ కూడా ఉండటం వంటివి సహజంగానే ప్రజల్లో అనుమానాలు పెంచుతాయి. మాటకారిగా మారిన రాహుల్ గాంధీ సోషల్ మీడియాలోనూ క్రియాశీలకంగా ఉంటూ నిమో–నమో వంటి మాటలతోనూ, చిన్న మోదీ–పెద్ద మోదీ వంటి ప్రయోగాలతోనూ విమర్శలు చేయడం అన్యాయమే అయినప్పటికీ, ఇప్పటి కక్షపూరిత రాజకీయాల్లో న్యాయాన్యాయాలకు చోటెక్కడిది?

నీరవ్ చేసిన మోసం ఐదువేల కోట్లా, 20వేల కోట్లా అన్న లెక్కల్లో తేడా ఉండవచ్చునేమో కానీ, బ్యాంకులను ఇలా ఏదో పేరుతో ముంచిన కారణంగా పోగుబడిన నిరర్థక ఆస్తులు మాత్రం 8లక్షల కోట్ల పైచిలుకే. ఈ లెక్కన ప్రతి దేశ పౌరుడి నెత్తిన ఏడున్నరవేల రూపాయల భారం ఉన్నట్టేనని ఓ సంస్థ లెక్కలు వేస్తున్నది. 'ఎంత స్వేచ్ఛనిచ్చినా ఇలా చేస్తున్నారేమిటి?' అంటూ నిన్నగాక మొన్న అరుణ్‌జైట్లీ ఏదో సందర్భంగా నీరవ్ పేరు ఎత్తకుండా బ్యాంకులపై ఆగ్రహించారు. ఈ పాపంలో తమ పాత్ర లేదనీ, బ్యాంకుల చేతకానితనమే ఇందుకు కారణమని చెప్పే ప్రయత్నం ఇది. కానీ, యూపీఏ నుంచి ఎన్డీయే వరకూ బ్యాంకింగ్ వ్యవస్థను లోపరహితంగా మార్చే ప్రయత్నమేదీ ప్రధానంగా సాగలేదని ఈ కుంభకోణం చెబుతున్నది. నిరర్థక ఆస్తులతో కుదేలైన బ్యాంకులను మోదీ ప్రభుత్వం తిరిగి రెండు లక్షల కోట్లతో నిలబెడుతున్నది. మరోపక్కన ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ద్వారా ప్రజల ఖాతాలకే ఎసరు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శ కూడా ఉన్నది. ప్రజల సొమ్ముతో బ్యాంకు ఖజానాలు నింపి, తిరిగి మోదీలకు, మాల్యాలకు సమర్పించే ఈ విన్యాసానికి ఎప్పటికి తెరపడుతుందో చూడాలి.


అంబేద్కర్ సత్యశోధన

ఆర్య ద్రావిడ వివాదం గురించి అంబేద్కర్ వైఖరి ఏమిటనే విషయమై జనవరి 25న రామ్ విలాస్ శర్మ వ్యాసానికి అనువాదం, దానికి జవాబుగా ఫిబ్రవరి 11న మర్ల విజయకుమార్ వ్యాసం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయ్యాయి. తన వ్యాసం రామ్ విలాస్ శర్మ రాసిన వ్యాసానికి సమాధానమని విజయకుమార్ రాశారు. ఆర్యులు బయట నుంచి వచ్చారనే వాదన అబద్ధమని హిందూత్వ వాదులు ప్రచారం చేస్తున్నారని చెబుతూ అది ఎట్లా తప్పో నిరూపించడానికి విజయ కుమార్ ప్రయత్నించారు.

రామ్ విలాస్ శర్మ హిందూత్వ వాది కాదు. హిందీలో చాలా ప్రఖ్యాత అభ్యుదయ సాహితీ విమర్శకుడు. అంతమాత్రాన ఆయన తప్పు అభిప్రాయాలు వ్యక్తం చేయడని కాదు. కాకపోతే ఇక్కడ ప్రధానమైన చర్చనీయాంశం రాం విలాస్ శర్మ అభిప్రాయాల చర్చ కాదు. ఆర్య, ద్రావిడ లేదా ఆర్య, శూద్ర విషయానికి సంబంధించి అంబేద్కర్ ఏ అభిప్రాయాలు వ్యక్తపరిచాడనేది ముఖ్య విషయం. విజయకుమార్ ఈ విషయాన్ని ఏ మాత్రం తడమకుండా అంబేద్కర్ రచనలకు వక్రభాష్యం చెప్పారని చెప్పి, చరిత్రహీనులుగా మిగిలిపోతారని శాపనార్థాలు మాత్రం పెట్టారు.

శర్మ వ్యాసంలో అంబేద్కర్‌ను ఉటంకించిన విషయాలను స్వతంత్రంగా అంబేద్కర్ రచనల నుంచి నేరుగా సరిచూసుకునే అవకాశం ప్రస్తుతం నాకు లేదు. శర్మ నిజాయితీగానే అంబేద్కర్‌ను ఉటంకించాడని భావిస్తున్నాను. ఆర్యులు బయటి నుంచి వచ్చారని మనకు ఈనాడు ఏ సందేహమూ అవసరమూ లేదు. (కరడు గట్టిన హిందూత్వవాదులను వదిలేస్తే). ఆర్యుల దాడి వల్లనే సింధు నాగరికత నాశనమయ్యిందనే వాదన మాత్రం సరికాదని కూడా పురావస్తు శాస్త్రవేత్తల, చరిత్రకారుల వాదన. ఆర్యుల దాడులు కూడా జరిగాయనడానికి తగిన సాహిత్య ఆధారాలు మాత్రం ఉన్నాయి. ఈ దాడులు కూడా సింధు నాగరికత నశించిపోవడానికి దోహదపడినాయి. తొలినాళ్ళలో ఆర్యులలోనే మూడు వర్ణాలు ఏర్పడినాయి. సమాజాభివృద్ధి జరిగేకొద్దీ, శ్రమ విభజన పెంపొందే కొద్దీ ఆర్యులలో కూడా కొందరు శూద్రులయ్యారు. కానీ, ప్రధానంగా శూద్రులు మాత్రం ఆర్యులు ఓడించి లొంగదీసుకొన్న అనార్య తెగలనుంచే ఏర్పడినారు. ఆర్యుల నుంచే కొద్దిమందైనా బానిసలు కూడా ఏర్పడినారనడానికి ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు. హరిశ్చంద్రుడు, ద్రౌపదిల కంటే పెద్ద ఉదాహరణలేముంటాయి? వాటి వివరాలకు వ్యాసపరిధి రీత్యా పోలేము కానీ, కులవ్యవస్థ బలంగా వేళ్ళూనుకోక ముందు ఆర్యులు, అనార్యులు కలిసి కులాలుగా ఏర్పడడం మొదలైందనేది వాస్తవం. ప్రధానంగా ఆర్యుల నుంచి కూడా పూజారి వర్గాన్ని లేదా అందులోని ఒక సెక్షనును బ్రాహ్మణులలో కలుపుకున్నారు. శూద్రుల నుంచి కూడా రాజులైనారు. విదేశాల నుంచి దండయాత్రలు చేసి రాజులైనవారు కూడా తమను తాము క్షత్రియులుగా చెప్పుకున్నారు. బ్రాహ్మణులతో వంశవృక్షాలు రాయించుకున్నారు.

ఆర్యులు విదేశీయులు, శూద్రులు మూలవాసులు అనడం అంబేద్కర్ రాజకీయ లక్ష్యానికి చాలా ఉపయోగకరమైన నిర్ధారణ. కానీ అంబేద్కర్ అందుకు పూనుకోలేదు. సాక్ష్యాధారాలను విశ్లేషించి వాటి ఆధారంగా నిర్ధారణలకు వచ్చాడు. పూర్వాభిప్రాయాలతో కాకుండా, సాక్ష్యాధారాల ద్వారా విషయ నిర్ధారణ చేసే పద్ధతి– అంబేద్కర్ వాదులు కానీ, సామాజిక శాస్త్రవేత్తలు కానీ, సమాజాన్ని మార్చాలనుకొనేవారు కానీ అవలంబించాల్సిన పద్ధతి.



అంబేద్కర్ ఈ విషయాలలో కొన్ని తప్పు నిర్ధారణలకు వచ్చాడని శర్మ వ్యాసంలో అంబేద్కర్ అభిప్రాయాలను చదివినా అంబేద్కర్ ఇతర రచనలను చదివినా అర్థమవుతుంది. అంబేద్కర్ అవలంబించిన సంవిధానం (మెథడాలజీ) ఇందుకు కొంత కారణమైతే అంబేద్కర్ కొన్ని రచనలు చేసేనాటికి పురావస్తు అధ్యయనాలు అంతగా అభివృద్ధి చెందకపోవడం మరొక కారణం. అంబేద్కర్ రచనలు చేసేనాటికి సింధూ నాగరికత తవ్వకాలు, అప్పుడప్పుడే మొదలై బయటపడినాయి. వాటి పైన ఇంకా పూర్తి నిర్ధారణలు బయటకురాలేదు. ఆ అధ్యయనాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అంబేద్కర్ అనుసరించిన సంవిధానంలో పూర్తిగా బ్రాహ్మణ సాహిత్యం పైనే ఆధారపడినాడు. వాటిపై విదేశీ పండితులు చేసిన టీకా టిప్పణీలపై ఆధారపడినాడు. వీటి ఆధారంగా చరిత్రను పునర్వ్యాఖ్యానించడానికి ప్రయత్నం చేశాడు. ఆ తరువాతి కాలంలో డి.డి. కొశాంబి అభివృద్ధి చేసిన సంవిధానాన్ని చూస్తే– కొశాంబి బ్రాహ్మణ సాహిత్యంపై ఆధారపడుతూనే (మరేదీ లేదు కాబట్టి) అందులో ఉన్న విషయాలను పురావస్తు పరిశోధనలతో, వర్తమానంలో ఉన్న మౌఖిక సాహిత్యంతో, సంస్కృతీ సంబంధిత విషయాలతో, అభివృద్ధి అవుతూ వస్తున్న భాషా శాస్త్రం తదితరాలతో పోల్చిచూస్తూ వీటన్నింటికీ తోడు, అంత కంటే ముఖ్యంగా ఈ పరిణామాల వెనుకనున్న ఆర్థిక మూలాలను పరిగణనలోకి తీసుకొంటూ చరిత్ర రచనా సంవిధానాన్ని అభివృద్ధి పరిచాడు. అంబేద్కర్ అవలంబించిన సంవిధానంలో సాంస్కృతిక కారణమొక్కటే ప్రధానం.

మాతంగులు ఒకప్పుడు క్షత్రియులేనని పూలే అన్నా, శూద్రులు ఆర్యులలో భాగమేనని అంబేద్కర్ అన్నా బ్రాహ్మణవాదంపై పోరాడాలన్న రాజకీయ లక్ష్యం ప్రధానమైంది. వారి ఈ రాజకీయ లక్ష్యాన్ని సమున్నతంగా ఎత్తిపడుతూ, కొనసాగిస్తూ, ముందుకు తీసుకుపోవాలి. కానీ అందుకు వారు చరిత్రను వ్యాఖ్యానించిన ప్రతి అంశాన్నీ సరియైందే అనవలసిన అవసరం లేదు. వారు చేసిన నిర్ధారణలలో తప్పులే ఎన్నకూడదు, ప్రశ్నించకూడదు, ప్రశ్నించటమే తప్పు, పాపమన్న రీతిలో స్పందనలుంటే అది అహేతుకం; బ్రాహ్మణవాద పద్ధతి. ఇప్పుడు చర్చలో ఉన్న వ్యాసాల విషయానికొస్తే రాం విలాస్ శర్మ వ్యాసంలో అంబేద్కర్ చేసిన నిర్ధారణలంటూ పేర్కొన్న విషయాలు అంబేద్కర్‌వి కావు అనుకుంటే ఆ విషయాన్ని నిరూపించాలి. అవి అంబేద్కర్ చేసిన నిర్ధారణలే అయితే ఈ విషయానికి సంబంధించి అంబేద్కర్ చేసిన నిర్ధారణలూ, వాటి ఆధారంగానూ, వాటి చాటునా రాం విలాస్ శర్మ చేసిన నిర్ధారణలూ, వ్యాఖ్యలూ తప్పు.

అంబేద్కర్ నిర్ధారణలను చూసి అంబేద్కర్ అనుసరించిన ఒక సరియైన పద్ధతి నుంచి మనం నేర్చుకోవాల్సి ఉంది. అంబేద్కర్ పూర్వాభిప్రాయాలతో విషయాన్ని పరిశీలించలేదు. ఒక విజ్ఞానవేత్త అనుసరించాల్సిన పద్ధతిలో తన ముందున్న సాహిత్యాన్ని పరిశీలించి నిర్ధారణలకు వచ్చే ప్రయత్నం చేశాడు. ఆర్యులు విదేశీయులు, శూద్రులు మూలవాసులు అనడం అంబేద్కర్ రాజకీయ లక్ష్యానికి ఉపయోగకరమైన నిర్ధారణ. కానీ అంబేద్కర్ అందుకు పూనుకోలేదు. సాక్ష్యాధారాలను విశ్లేషించి వాటి ఆధారంగా నిర్ధారణలకు వచ్చాడు. ఆ నిర్ధారణలు తప్పని ఆ తరువాత అభివృద్ధి చెందిన జ్ఞానం వల్ల తెలియవచ్చు. అదివేరే విషయం. కానీ పూర్వాభిప్రాయాలతో కాకుండా, సాక్ష్యాధారాల ద్వారా విషయ నిర్ధారణ చేసే పద్ధతి అంబేద్కర్ వాదులుకానీ, సామాజిక శాస్త్రవేత్తలు కానీ, సమాజాన్ని మార్చాలనుకొనేవారు కానీ అవలంబించాల్సిన పద్ధతి.

■ ఎన్. రవి

కనబడని గోడలు కడుతున్నారు

హతుడు ఫలానా మతానికి చెందినవాడన్న కారణంగా ఆ హత్యను సమర్థించవచ్చా? పూణేలో దాదాపు నాలుగేళ్ల క్రితం జరిగిన ఒక హత్య కేసులో నిందితులకు బెయిలు మంజూరు చేయడానికి బొంబాయి హైకోర్టు న్యాయమూర్తి చూపిన కారణం అదే. ఆ బెయిలును మొన్న రద్దు చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ఆ హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలను తీవ్రంగా ఆక్షేపించింది.

2014 జూన్ రెండవ తేదీ రాత్రి పూణేలో 23 మంది యువకులు తమకు దారిలో తారసపడిన షేక్ మొహసిన్ అనే 24 ఏళ్ల ఐటి ఉద్యోగిని హాకీ బ్యాట్లతో కొట్టి చంపారు. ఆ యువకులు హిందూ రాష్ట్ర సేన అనే ఓ సంస్థ సమావేశంలో పాల్గొని తిరిగి వెళుతున్నారు. షేక్ మొహసిన్ మసీదులో ప్రార్థన ముగించుకుని ఇంటికి వెళుతున్నాడు. అతని వంటి మీద ఆకుపచ్చ చొక్కా ఉంది. ముఖానికి గడ్డం ఉంది. చూడగానే ముస్లిం అని తెలిసిపోతున్నది. ఎదురొచ్చిన హిందూ యువకులకు మొహసిన్‌తో పరిచయం కూడా లేదు. ముస్లిం కాబట్టి మూకుమ్మడిగా దాడి చేసి ఓ నిస్సహాయుడిని, నిరాయుధుడిని కొట్టి చంపారు.

వారికి బెయిల్ ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తికి ఆ అంశమే బెయిల్ ఇవ్వడానికి తగిన కారణంగా కనిపించింది. "హతుడికీ నిందితులకీ మధ్య వ్యక్తిగత వైరం లేదు. హతుడు ముస్లిం కాబట్టి మతపరమైన విద్వేషంతో నిందితులు అతడిని హతమార్చారు. ఈ హత్యకు ఇతరత్రా కారణం ఏమీ లేదు. హతుడి తప్పల్లా అతను వేరే మతానికి చెందిన వాడు కావడమే" ఇలా సాగింది బొంబాయి హైకోర్టు న్యాయమూర్తి వాదన.

అంతకు ముందు నిందితులకు బెయిల్ నిరాకరించిన పూణే సెషన్స్ కోర్టు అందుకు ఇదే కారణం చూపింది. "ముస్లిం లాగా కనబడినంతమాత్రాన ఎలాంటి వైరం లేకుండా చంపేస్తారా? ఇంత ఘోరమైన నేరం చేసిన వారికి బెయిల్ ఎలా ఇస్తాం?" అని సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా ఇదే ప్రశ్న వేసింది.

మత విద్వేషాలను పెంచి పోషించేందుకు హిందుత్వశక్తులు శతవిధాలా ప్రయత్నిస్తున్న ప్రస్తుత తరుణంలో సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఉంది. ఇటీవల జమ్మూ ప్రాంతంలోని సుంజువాన్ సైనిక శిబిరంపై టెర్రరిస్టులు జరిపిన దాడి అనంతరం సైనిక జవాన్ల మతం చర్చలోకి వచ్చింది. టెర్రరిస్టులతో పోరాడుతూ ప్రాణాలు అర్పించిన జవాన్లలో ముగ్గురు కాశ్మీరీ ముస్లింలేనని మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్య ఈ చర్చకు దారి తీసింది.

"ఇండియాలో ముస్లింలను కొందరు పాకిస్థానీలని అంటున్నారు. టెర్రరిస్టులు ఇక్కడ ముస్లింలను కూడా చంపుతున్నారు" అని ఒవైసీ అన్నారు. ఇందుకు సమాధానంగా ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు శ్రీనగర్‌లో మాట్లాడుతూ, "మేము సైనికులను మతపరంగా చూడం. భారత ఆర్మీ సర్వమతాల కూడలి" అన్నారు. ఆ అధికారి అన్నది నిజమే. అందులో సందేహం లేదు. 2002లో గుజరాత్‌లో గోధ్రా అనంతరం ముస్లిం ఊచకోత సైనిక బలగాలు రంగప్రవేశం చేసిన తర్వాత మాత్రమే ఆగింది.

సైనిక జవాన్లను మతపరంగా చూడాల్సిన అవసరం లేదు కానీ, అసదుద్దీన్ ఒవైసీ ఆ మాటలు ఎందుకు అనాల్సి వచ్చిందో చూడక తప్పదు.

భారత ముస్లింల పట్ల నిర్హేతుకమైన ద్వేషాన్ని హిందువులలో నూరిపోసేందుకు హిందుత్వ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ విద్వేష ప్రచారానికి అందివచ్చిన ప్రతి సందర్భాన్నీ వినియోగించుకుంటున్నాయి. సోషల్ మీడియా ద్వారా అసత్యాలనూ, అర్ధసత్యాలనూ ప్రచారంలో పెడుతున్నాయి.

అక్కడక్కడా జరిగే ఒకటి రెండు అవాంఛనీయ సంఘటనలను అందిపుచ్చుకుని, గోరంతలు కొండంతలుగా చిత్రీకరించి భారత ముస్లింల దేశభక్తినీ, విధేయతనూ ప్రశ్నిస్తున్నారు. భారత సమాజాన్ని మత ప్రాతిపదికన నిట్టనిలువునా చీల్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. 'కౌబెల్ట్'గా పిలిచే ఉత్తరాది రాష్ట్రాలలో ఈ ధోరణి మరీ ఎక్కువగా విజృంభిస్తోంది. 2014 ఎన్నికలలో బిజెపిని సొంత మెజారిటీతో అధికారంలోకి తీసుకు రావడానికి తోడ్పడిన అంశాలలో ఈ 'చీలిక' కూడా ఒకటి.



విషాదం ఏమిటంటే హిందుత్వ శక్తులు కడుతున్న ఈ కనబడని గోడలు అంతకంతకూ ఎంతో కొంత విస్తరిస్తున్నాయి. రేపు బిజెపి ఓడిపోయి మరో పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ గోడలు అలాగే ఉంటాయి. వాటిని పగలగొట్టడం అంత తేలిక కాదు.

మళ్లీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మతపరమైన చీలికను మరింత లోతుగా విస్తరించేందుకు హిందూత్వ శక్తులు నిరంతరం పావులు కదుపుతున్నాయి. తమ ఎజెండాను అమలు పరచగల భారతీయ జనతా పార్టీని ఈ సారి కూడా అధికారంలోకి తీసుకు రావాలంటే దక్షిణాది రాష్ట్రాలలో కూడా సమాజాన్ని మత ప్రాతిపదికపై చీల్చాల్సిన అవసరం ఉందని ఆ శక్తులు భావిస్తున్నాయి. ఆ దిశగా ఇక్కడ కూడా ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రాలలో ఇటీవలి పరిణామాలను ఈ కోణం నుంచే చూడాలి.

నిజానికి భారత సమాజంలో ఈ చీలిక ఎంతో కొంత ముందు నుంచే ఉంది. 1992 నాటి బాబ్రీ మసీదు విధ్వంసం ఫలితంగా, తదనంతరం చోటు చేసుకున్న అనేక పరిణామాల ఫలితంగా ఈ చీలిక ఉండేకొద్దీ ప్రస్ఫుటమవుతూ వచ్చింది. ముంబై మహా నగరంలోని కొన్ని ప్రాంతాలలో ముస్లింలకు ఇల్లు అద్దెకు ఇవ్వకపోవడం చాలా కాలంగా ఉంది. ఇప్పుడు ఢిల్లీ, నోయిడా, గురుగావ్ లాంటి నగరాలకు కూడా ఈ వివక్ష పాకింది. గుజరాత్‌లో హిందువులు నడిపే వ్యాపారాలలో, పరిశ్రమలలో ముస్లింలకు ఉద్యోగాలు దొరకడం చాలా కష్టం.

మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఇది వాస్తవ పరిస్థితి. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించకపోవడం దానిని ఉపేక్షించడం కన్నా ప్రమాదకరం. వ్యక్తిగతమైన మంచి చెడ్డల ఆధారంగా కాకుండా మతం ప్రాతిపదికన మనిషిని తూకం వేసే ఈ విషాదాన్ని మరింత లోతుగా, మరింత గాఢంగా దేశవ్యాపితం చేసేందుకు సంఘ్ పరివార్ నాయకత్వంలోని హిందుత్వ శక్తులు కంకణం కట్టుకున్నాయి.

2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ ప్రయత్నాలకు గట్టి ఊతం లభించింది. అడ్డూ ఆపూ లేని గో సంరక్షక దళాల అరాచకాలూ, లవ్‌జిహాద్ బూచి పేరిట సాగుతున్న ప్రచారం అసలు లక్ష్యం ఇదే. సంకుచిత జాతీయవాదాన్ని దేశభక్తిగా చిత్రించే యత్నాలు ముమ్మరం అయ్యాయి. వందేమాతర గీతం, సూర్య నమస్కారాల వంటి యోగాసనాల వివాదాలు అందుకే పుంజుకుంటున్నాయి. అధికారపీఠాలలో ఉన్నవారు కూడా నిస్సంకోచంగా ఈ అగ్నిలో ఆజ్యం పోస్తున్నారు.

చట్టాలను చేసే అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థ మన పార్లమెంటు. బిజెపి తరపున ప్రజాప్రతినిధిగా అందులో అడుగుపెట్టిన వినయ్ కత్యార్ అనే పెద్దమనిషి ఇటీవల, భారత దేశంలోని ముస్లిింలందరూ పాకిస్థాన్ వెళ్లిపోవాలని అన్నారు. "భారత దేశాన్ని 1947లో మత ప్రాతిపదికన విభజించింది ముస్లింలే. వారికి ఇక్కడేం పని? అందరూ పాకిస్థాన్ వెళ్లిపోవాల్సిందే' అన్నారాయన. ఒక లోక్‌సభ సభ్యుడు ఇంత తీవ్రమైన ప్రకటన చేస్తే బిజెపి నాయకత్వం అదేమిటని అనలేదు. వినయ్ కత్యార్ ఎప్పుడూ అలాగే వివాదాస్పద ప్రకటనలు చేస్తాడులే అని మనమూ సరిపెట్టుకుంటున్నాం. కానీ ఆ ప్రకటన ఎంతమంది మనసులను విషపూరితం చేస్తుందో ఆలోచించడం లేదు.

నిజానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి గత ఏడాది ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలో చేసిన ప్రకటన ముందు ఇవన్నీ దిగదుడుపే. ఆ ఎన్నికలలో 403 సీట్ల అసెంబ్లీలో 384 స్థానాలకు బిజెపి అభ్యర్థులు పోటీ చేశారు. వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ముస్లిం అభ్యర్థి లేరు. జనాభాలో 20 శాతం వరకూ ముస్లింలున్న రాష్ట్రంలో అధికారం చేపట్టే లక్ష్యంతో ఎన్నికల గోదాలోకి దిగిన బిజెపి తమకు ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా అక్కర్లేదని నిర్ణయించుకుంది. ముస్లింలకు వ్యతిరేకంగా నేరుగా ఒక్కమాట కూడా మాట్లాడకుండా బిజెపి చేసిన అతిపెద్ద రాజకీయ ప్రకటన ఇది.

ఇంకా అనుమానాలకు ఆస్కారం ఉందా? హిందుత్వ శక్తులు, భారతీయ జనతా పార్టీ కలిసి భారత సమాజం గతిని ఎలా మార్చాలనుకుంటున్నదీ స్పష్టంగా అర్థం కావడం లేదా? ఇలాంటి వాతావరణంలో ముస్లిం ఎవరైనా తన దేశభక్తిని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని భావించినట్లయితే అతనిని ఎలా తప్పుపట్టగలం? విషాదం ఏమిటంటే హిందుత్వ శక్తులు కడుతున్న ఈ కనబడని గోడలు అంతకంతకూ ఎంతోకొంత విస్తరిస్తున్నాయి. రేపు బిజెపి ఓడిపోయి మరో పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ గోడలు అలాగే ఉంటాయి. వాటిని పగలగొట్టడం అంత తేలిక కాదు.

■ ఆలపాటి సురేశ్ కుమార్
సీనియర్ జర్నలిస్టు

కేసీఆర్ మార్చిన బతుకు చిత్రం

నూటికి డెబ్భైమందికి పైగా నివసించే గ్రామాలను మార్చితే తప్ప 'రోటీ కపడా ఔర్ మకాన్' సాధ్యం కాదని కేసీఆర్ బలంగా నమ్మినందుకే తాగునీరు, సాగునీటికి పెద్ద పీట వేశారు. రోటీ కపడా మకాన్... ఈ మూడింటికీ వ్యవసాయమే మూలం.వ్యవసాయానికి సాగునీరే ఇరుసు. 44నెలల కేసీఆర్ పాలనలో గ్రామీణ ప్రాంతాలతో ముడిపడి ఉన్న సాగునీటి రంగంలో అనూహ్యమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. అందరిలా కేసీఆర్‌కు రెండు కళ్ళు కాదు, ఆరు కళ్ళు ఉన్నవి. మంత్రులు హరీశ్ రావు, తారక రామారావుల చూపు కూడా ఆయనకు తోడైంది. ముగ్గురూ ఎవరికి వారే సమర్థులు. ప్రత్యర్థులను మాటలతో చిత్తు చేయగలరు.

'ఆంధ్రాలో గోదావరి నీళ్ళు పారించిన వాళ్ళు తెలంగాణలో రక్తం పారించారు. కరీంనగర్‌ను కల్లోలిత ప్రాంతంగా ముద్ర వేసి అభివృద్ధి జరగకుండా చేశార'ని కరీంనగర్ బహిరంగసభలో మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ పై నిప్పులు చెరిగినప్పుడు టి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తల్లో, జనంలో వచ్చిన స్పందన అంతా ఇంతా కాదు. ఇప్పటికే ప్రతిపక్షాలు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను తన వ్యూహ రచనతో కేసీఆర్ తునాతునకలు చేశారు. ఒక మనిషిని వెయ్యి ఏళ్లు గుర్తుపెట్టుకోవాలంటే ఆయన వందేళ్లు బ్రతకాల్సిన అవసరం లేదు. చేసే ఒక్క పనైనా సరిగ్గా చేస్తే అతను భావి తరాలకు దేవుడిగా మిగిలిపోతారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి పనిలోనూ నిబద్ధుడై సాగుతున్నారు. సమకాలీన రాజకీయాల్లో ఆయనది ప్రత్యేక శైలి.

ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టాలన్నది, ఒంటినిండా బట్టలు ఇవ్వాలన్నది, ఉండటానికి ఓ ఇల్లు కట్టించాలన్నది ఆయన ఆశయం. రోటీ కపడా మకాన్ నినాదాన్ని వాడుకొని గతంలో ఎంతో మంది అధికారం చెలాయించారు. దాని లక్ష్యం మాత్రం వంద శాతం పూర్తికాలేకపోయింది. ఆ నినాదాన్ని ఓ యాభై శాతం చిత్తశుద్ధితో అమలు చేసినా రైతుల ఆత్మహత్యలు ఉండేవి కావు. రోటీ కపడా ఔర్ మకాన్ పేరుతో వివిధ రాజకీయ పార్టీలు ఓట్లు దండుకునే ప్రయత్నం చేశాయి. ముఖ్యమంత్రులెవ్వరూ కేసీఆర్ మాదిరి ఆలోచించ లేదు. సంక్షేమ అభివృద్ధి పథకాలు నాడు కూడా ఉన్నాయి. కానీ వాటి అమలు తీరులోనే స్పష్టమైన మార్పు నేడు కనిపిస్తున్నది. పథకాలు రాజకీయ లబ్ధి కోసం కాదు, ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరచడం కోసమని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే ఆయన రోటి కపడా ఔర్ మకాన్ నినాదాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ఎక్కడా ఆయన ఈ నినాదాన్ని ఉపయోగించకపోయినా, నూటికి నూరు శాతం ప్రజల బతుకు చిత్రాన్ని మార్చాలంటే కనీస అవసరాలు తీర్చాలని అనుకున్నారు. రేషన్ దుకాణంతో పల్లె ప్రజలకు, పేదవాడి కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉంటుంది. పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు రేషన్ షాపులో దొరికే వస్తువులే ఆధారం. గత ప్రభుత్వాలు సీలింగు పెట్టి, నాణ్యత లేని బియ్యం పోసి, పేదవాడిని అర్థాకలితో ఉంచేవి. ఇంట్లో పెద్దలు పస్తులుండి, పిల్లల కడుపు నింపే ప్రయత్నాలు జరిగేవి. కడుపు నిండా తిండిపెడతామని అధికారంలోకి వచ్చిన వాళ్లకు ఇవేవీ పట్టేవి కావు. ఇచ్చిన బియ్యమే బంగారం అన్నట్టు ప్రచారం చేసుకునేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఒక్కొక్కరికీ ఆరు కిలోల బియ్యం ఇస్తున్న ఘనత కేసీఆర్‌దే. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ ఆరు కిలోల చొప్పున బియ్యం పోసి... మూడుపూటలా పట్టెడు అన్నం దొరికేలా చూసిన నాయకుడు కేసీఆర్.

ప్రభుత్వాలను కూలదోసిన చరిత్ర ఉన్న ఉల్లి పండించే రైతుల సంక్షోభాన్ని కేసీఆర్ సూచనలతో మార్కెటింగ్ మంత్రి హరీష్‌రావు సులువుగా పరిష్కరించి, ఆదుకొన్నారు. బహుశా దేశంలోనే మరే ప్రభుత్వం కూడా ఉల్లి కష్టాలను గుర్తించకముందే తెలంగాణ ప్రభుత్వం మేల్కొంది. ఎక్కడికక్కడ ప్రభుత్వ కౌంటర్లు తెరచి, సబ్సిడీ ఉల్లిపాయలను అందించారు. కందిపప్పు ధరలు ఆకాశాన్ని అంటిన సందర్భంలోనూ తెలంగాణ ప్రభుత్వం చతురత ప్రదర్శించింది. విద్యార్థులు భావి పౌరులు. అలాంటి విద్యార్థులు కూడా ఉడికీఉడకని, పురుగులు పడిన అన్నం తినలేక, బోరింగు నీళ్లు తాగి కడుపు నింపుకునేవారు. స్వయంగా బీసీ హాస్టల్‌లో ఉండి చదువుకున్న పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ చొరవతో హాస్టళ్లలో సన్న బియ్యంతోనే అన్నంపెట్టాలని సీఎం నిర్ణయించారు. అర్థాకలితో చదువుకుంటే అది వంట



సంక్షేమ పథకాలు రాజకీయ లబ్ధికోసం కాదు, ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరచడం కోసమని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే ఆయన రోటీ కపడా ఔర్ మకాన్ నినాదాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు.

బట్టదని, మన భావితరాలను మనమే చిదిమేస్తే ఎలా అని ఆయన అనుకున్నారు. పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులను ప్రభుత్వాలు ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే పరిగణించేవి. ఒక ప్రభుత్వ హయాంలో యాభై రూపాయలు ఇస్తే, మరొకరు రెండొందలు ఇచ్చారు. నిజానికి సగటు మనిషి కనీస అవసరాలకు నెలకు రెండొందలు సరిపోతాయా? కనీస అవసరాలైన బట్టలు, రోగాలబారిన పడినవారు మందులు ఎలా కొనుక్కుంటారు? ఎలా జీవితం నెట్టుకొస్తారు? ఇలా ఏ పాలకుడు ఆలోచించలేదు. సంక్షేమం అంటే హుందాగా ఉండాలని, పేదలకు, వృద్ధులకు ప్రభుత్వం ఆసరాగా ఉండాలని కేసీఆర్ భావించారు. ఉద్యమం జరుగుతున్నప్పుడే, కనీసం ప్రభుత్వ ఏర్పాటు మీద ఎలాంటి అంచనాలు లేనప్పుడే వృద్ధులు, వితంతువులకు వెయ్యి రూపాయలు, వికలాంగులకు పదిహేను వందల రూపాయల పెన్షన్ ఇస్తానని చెప్పారు. అప్పుడు చాలామంది అవహేళన చేశారు. బ్యాంకులకు కన్నం వేస్తారా? అని ప్రశ్నించిన వాళ్లను కూడా చూశాం. కానీ అదే కేసీఆర్ ఇప్పుడు ముప్పై నాలుగు లక్షల మందికి పెన్షన్లు ఇస్తుంటే, నాడు విమర్శించిన వారు ముక్కున వేలేసుకొని చూస్తున్నారు.

ఒక పూట తిన్నా, పస్తులు పడుకున్నా, ఒంటి నిండా బట్ట కట్టుకోకున్నా, తలదాచుకోవటానికి ఓ గూడు మాత్రం ఖచ్చితంగా ఉండాలన్న ఆలోచన నుంచే డబుల్ బెడ్ రూమ్ ఆవిష్కృతమైంది. కూడు గుడ్డ గూడు అనే నినాదం అందులోంచి పుట్టుకొచ్చిందే. ఇందిరా గాంధీ హయాంలో మొదలైన ఈ పథకాలు.. ఇప్పటికీ ఇంకా పథకాలుగానే కొనసాగుతున్నాయి. పేపర్ లెక్కల్లో మాత్రం లక్షల ఇండ్లు కట్టించినట్టు చూపిస్తారు. తెలంగాణ ప్రజలకు అలాంటి అగత్యంలేదు. ఈ పీడ సమైక్య పాలనతోనే విముక్తమైపోయింది. పేదవాడు పేదవాడిగా వందల జన్మలు ఎత్తినా సొంతంగా కట్టుకోలేని ఇళ్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. రెండు బెడ్ రూములు, ఒక హాలు, మోడల్ కిచెన్‌తో కూడిన ఒక ఇంటిని బహుమతిగా అందిస్తోంది. ఇది ప్రపంచ చరిత్రలోనే ఎక్కడా జరగని ఒక అద్భుతం. అయితే కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ పథకం ఆశించినంత వేగంగా అమలు కావడం లేదు. ఇంకా కొన్ని బాలారిష్టాలు ఉన్నవి. దళితులకు మూడెకరాల భూ పంపిణీ కూడా అమలులో ఆటుపోట్లను ఎదుర్కొంటున్నది.

ప్రపంచ యవనికపై కేసీఆర్ ప్రతిష్ఠ ఇనుమడిస్తున్నది. పలు సందర్భాల్లో విదేశాల నుంచి ఆహ్వానాలు కేసీఆర్ కు అందుతున్నవి. కేసీఆర్ చేపట్టిన విధానాలు వాతావరణ మార్పుల సమస్యకు పరిష్కారం చూపుతాయని అమెరికాలోని కాలిఫోర్నియా గవర్నర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ శతాబ్దాంతానికి గ్లోబల్ వార్మింగ్‌ను రెండు డిగ్రీల వరకు తగ్గించాలన్న ప్రపంచ దేశాల లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా కేసీఆర్ సర్కార్ విధానాలు ఉన్నాయన్నారు. కాలిఫోర్నియా, తెలంగాణ రాష్ట్రాలు వర్షాభావం, గ్రీన్ కవర్ తగ్గడం వంటి ఒకే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మిషన్ కాకతీయను గురించి చెప్పనక్కర్లేదు. కేంద్ర ప్రభుత్వానికే ఇపుడు ఇది రోల్ మోడల్ పథకం. మిషన్ కాకతీయ స్ఫూర్తితో ముందుకు కదిలిన కేంద్రం దేశవ్యాప్తంగా ఐదు లక్షల వాటర్ పాండ్స్ (నీటి కుంటలను) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇది మన మిషన్ కాకతీయకు దక్కిన గౌరవం. దేశ విదేశాల నుంచి వచ్చి మిషన్ కాకతీయ మీద పరిశోధనలు కూడా చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం ప్రతిపాదన దశలో ఉండగానే బీహార్‌లో ఎన్నికల ప్రచార అస్త్రంగా మలచుకుని నితీష్ కుమార్ బీహార్ సీఎం పీఠం దక్కించుకున్నాడు. నీతిఆయోగ్ కూడా మిషన్ భగీరథను రోల్ మోడల్‌గా తీసుకొని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు కూడా రాసింది.

కరెంటు విషయంలో కేసీఆర్ ముందు చూపును విమర్శకులు సైతం మెచ్చుకుంటున్నారు. విభజనను వ్యతిరేకించి, కేసీఆర్‌ను తూలనాడిన కిరణ్ కుమార్ రెడ్డి కేసీఆర్ పాలన భేష్ అంటూ కితాబిచ్చారు. ఇరిగేషన్ పాలసీ మీద సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే, అంతా నివ్వెరపోయారు. ఎదురు మాట్లాడలేక, ఆయన దార్శనికతకు దాసోహం అయ్యారు. ఏండ్లకుఏండ్లు అధికార పీఠాన్ని పట్టుకొని కూర్చుకున్న మహామహులు చెయ్యలేని పనిని తన శైలిలో చేసి చూపించి కేసీఆర్ అద్భుతాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు ఎక్కువ. ఆ పాపం టి.ఆర్.ఎస్‌దేనని నెట్టివేయడానికి విపక్షాలు చేసే ప్రయత్నాలు ఫలించవు. రైతుల ఆత్మహత్యలకు విరుగుడు సాగునీటి కల్పన అని 2001లో పార్టీ ఆవిర్భావ సమయానికే కేసీఆర్‌కు అవగాహన ఉన్నది. రైతాంగం పట్ల ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నిర్లక్ష్యాన్ని ముందుగా సరిదిద్దవలసి ఉన్నది. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వవలసి ఉన్నది. ఆన్ గోయింగ్ పథకాలను పూర్తి చేయవలసి ఉన్నది. అటు కాళేశ్వరం, మరోవైపు పాలమూరు, రంగారెడ్డి, సీతారామా ప్రాజెక్టులు ఊపుమీద ఉన్నవి. కాళేశ్వరం గురించి మాటల్లో చెప్పడం కష్టం. దగ్గరకు వెళ్లి చూడవలసిందే. ప్రాజెక్టులకు ప్రధాన అడ్డంకి భూసేకరణ. పైగా చంద్రబాబు నాయుడి హయాంలో మొగ్గ తొడిగిన భూముల బూమ్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వేగం పుంజుకున్నది. భూములు కోల్పోతున్న రైతులు ఎక్కువ రేటు కోరతారు. పరిహారంతో పాటు, పునరావాసం వంటి చర్యలకు ఖర్చు బాగా పెరుగుతుంది. ఇది అనివార్యం. ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెరవకుండా ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించిన కారణంగానే దాని ఫలితాలు కనిపిస్తున్నవి. అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల దశదిశనుసైతం కేసీఆర్ రీడిజైనింగ్‌తో మలుపు తిప్పారు. గతంతో పోల్చుకుంటే తెలంగాణలో రైతుల పరిస్థితి మెరుగ్గా ఉంది. రిజర్వాయర్లు పొంగాయి. మిషన్ కాకతీయ పుణ్యమా అని చెరువులు మత్తడి దుమికాయి. రైతుల్లో సంతోషం కన్పిస్తున్నది. యాసంగిలోకూడా దిగుబడులు పెరగనున్నాయి. వాటికి మద్దతు ధర కల్పించేందుకు మార్కెటింగ్ రంగం నడుం బిగించింది.

■ ఎస్.కె. జకీర్

పంచాయతీల్లో పైసల్లేవ్!

చిన్న చిన్న పనులకూ నిధుల కొరత..పారిశుధ్య సిబ్బంది వేతనాలకూ సమస్య.. గుదిబండగా విద్యుత్తు బిల్లులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరు గ్రామపంచాయతీ అధికారులు చాలా కాలంగా విద్యుత్తు బిల్లు చెల్లించడం లేదు. దీంతో బిల్లు బకాయిలు ఏకంగా రూ.1.40 కోట్లకు చేరింది. దీంతో విద్యుత్తు మంచినీటి మోటార్లకు విద్యుత్తు కనెక్షన్‌ను తొలగించారు. దీంతో ఆగ్రహించిన పంచాయతీ అధికారులు.. విద్యుత్తు శాఖ వారు కూడా తమకు పన్నులు చెల్లించడం లేదంటూ ఆ శాఖ కార్యాలయానికి తాళం వేశారు. విద్యుత్తు శాఖ చెల్లించాల్సిన భవనాల పన్ను రూ.40 లక్షల వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇలా.. పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం, నిధుల కొరత గ్రామాల్లో ఆయా శాఖల మధ్య తగాదాలకు కారణమవుతోంది.



ఇది కేవలం ఆలేరు గ్రామంలోని పరిస్థితి మాత్రమే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలు నిధుల్లేక సతమతమవుతున్న తీరుకు నిదర్శనం. గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి డబ్బుల్లేవు! విద్యుత్తు బిల్లు బకాయి చెల్లించడానికి నిధుల్లేవు! మంచినీటి సరఫరాకు, వాటర్ ట్యాంకుల నిర్మాణానికి సొమ్ముల్లేవు! రోడ్ల నిర్మాణానికి, పారిశుధ్యానికి పైసల్లేవు! రాష్ట్రంలోని అత్యధిక గ్రామ పంచాయతీలు ఆర్థిక సంక్షోభంతో అల్లాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘం ద్వారా సమకూరుస్తున్న నిధులే పంచాయతీలకు పెద్ద దిక్కుగా నిలుస్తున్నాయి. వీటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని పంచాయతీలకు రూ.928.47 కోట్లు, ప్రోత్సాహక నిధులుగా రూ.119.28 కోట్లు.. మొత్తంగా రూ.1047.75 కోట్లను కేంద్రం సమకూరుస్తోంది. అయితే వీటిలో సగానికిపైగా నిధుల్ని విద్యుత్తు బిల్లుల చెల్లింపులు, మంచినీటి పథకాల నిర్వహణ, సిబ్బంది వ్యయం కిందనే ఖర్చు చేయాల్సి వస్తోంది. మిగిలిన నిధులనే అభివృద్ధి, నిర్వహణ పనులకు వినియోగించాల్సి ఉంటుంది. ఇక రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా పెద్దగా నిధులు ఇవ్వడం లేదు. నాలుగేళ్లుగా నిధుల కొరత కారణంగా చిన్న చిన్న సమస్యలనూ పరిష్కరించలేకపోతున్నాయి.

వేతనాలకూ ఇబ్బందే..

ఓ గ్రామ జనాభా సుమారు 3వేలు. సొంత ఆదాయం రూ.50 వేలు కూడా లేదు. కానీ, నెల నెలా రూ.10 వేల వరకు వేతనాల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. నాలుగేళ్లుగా సిబ్బందికి వేతనాలను ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటున్నారు. ఇలాంటప్పుడు అభివృద్ధి కార్యక్రమాల పరిస్థితి ఏంటో చెప్పనవసరమే లేదు. వాస్తవానికి పంచాయతీల సొంత ఆదాయంలో పన్నులే కీలకం. ఇందులో సగం నిధులను వేతనాలకు వాడుకోవచ్చు. సొంత ఆదాయాన్ని పూర్తిగా వెచ్చించినా వేతనాలకు సరిపోయే పరిస్థితి లేదు. రాష్ట్రంలో మూడింట రెండొంతుల పంచాయతీల సొంత ఆదాయం లక్ష రూపాయలు కూడా దాటడం లేదు. వచ్చిన కాస్త ఆదాయాన్ని విద్యుత్తు బిల్లుల బకాయిలకే చెల్లించడంతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకుండా పోతోందని చెబుతున్నారు. ఆదాయం లేక నిధుల లేమితో పంచాయతీలు సతమతమవుతున్నాయని అంటున్నారు.

నిజామాబాద్ జిల్లాలో 152 కోట్ల బకాయిలు..

నిజామాబాద్ జిల్లాలో 393 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీధి దీపాలు, కరెంట్, తాగునీటి పథకాల బిల్లులు రూ.152 కోట్ల వరకు పేరుకుపోయాయి. 14వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధుల్లో కొద్దిమొత్తంగానే తాగునీటికి, వీధి దీపాలకు బిల్లులు చెల్లించారు. నిధులు లేకపోవడం వల్ల విద్యుత్ బిల్లులు ఎక్కువగా పెండింగ్‌లో ఉంటున్నాయి. సర్కారు నుంచి నిధులు విడుదల కాకపోవడం వల్లనే వీటిని పూర్తిస్థాయిలో చెల్లించడంలేదు. కొన్నిగ్రామ పంచాయతీల్లో నిధులు లేక వేతనాలు చెల్లించలేదు. జిల్లాలో ఈజీఎస్ కింద కొన్ని భవనాలకు నిధులు విడుదలైనా.. మ్యాచింగ్ గ్రాంట్ లేకపోవడం వల్ల పనులు చేపట్టలేదు. కొన్ని గ్రామాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇచ్చే గ్రాంట్‌లతో భవనాలను నిర్మిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో 208 గ్రామ పంచాయతీలు ఉండగా అన్నిచోట్లా కనీసం పారిశుధ్య సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉంది. మంచిర్యాల జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.36 కోట్ల 24లక్షల 48 వేలు ఉన్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత 14వ ఆర్థిక సంఘం కింద రూ. 12.71 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ మొత్తం విద్యుత్తు బకాయిలకే జమయ్యే పరిస్థితి ఉంది.

జటాయువు సన్నిధిలో రామయ్యకు కల్యాణం



ఏపీలోని ఎటపాకలో ఉన్న జటాయువు మండపంలోని జటాయువుకు బుధవారం పంచామృతాలతో భద్రాద్రి దేవస్థానం అర్చక బృందం అభిషేకం నిర్వహించింది. ఈ సందర్భంగా భద్రాద్రి దేవస్థానం వైదిక బృందం సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రెండేళ్ల క్రితం భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శతవర్ష ప్రయుక్త సువర్ణ భద్రకవచ సమర్పణాత్మక నవాహ్నిక శ్రీరామ మహాక్రతువులో భాగంగా జటాయువుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో ఇకపై ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ షష్టినాడు ఎటపాకలో జటాయువుకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తామని దేవస్థానం అధికారులు వెల్లడించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి ప్రచార మూర్తులకు కల్యాణం నిర్వహించారు. - భద్రాచలం

24న విశ్వభారతి స్వర్ణోత్సవం



ఒత్తిడిలేని విద్య అందించడమే లక్ష్యం.. చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ

గుడివాడ, ఫిబ్రవరి 21: విశ్వభారతి విద్యాసంస్థ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 24వ తేదీన స్వర్ణోత్సవ వేడుకలునిర్వహిస్తున్నట్లు చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. పెదపారుపూడి మండలం వానపాములలో వైజ్‌ఉడ్స్ క్యాంపస్‌లో జరిగే ఈ వేడుకలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రారంభిస్తారని చెప్పారు. ఒత్తిడి లేని విద్యనందించి జాతికి రత్నాల్లాంటి పౌరులను అందించటమే లక్ష్యంగా 50ఏళ్ల క్రితం విశ్వభారతి పాఠశాలను స్థాపించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వభారతి స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని పాఠశాలలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడలో మాజీ ఎమ్మెల్యే రావి శోభనాద్రి సహకారంతో 1968వ సంవత్సరం జూన్ 20వ తేదీన 70 మంది విద్యార్థులతో, ఏడుగురు ఉపాధ్యాయులతో విశ్వభారతి పాఠశాల నెలకొల్పినట్టు తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు ప్రోత్సాహంతో 2005 ఫిబ్రవరిలో ఐఐటీ ఫౌండేషన్‌ను ప్రారంభించామని చెప్పారు. ఐఐటీ ఫౌండేషన్‌లో చదివిన పృథ్వీతేజ అతి చిన్నవయసులో 2011వ సంవత్సరంలో ఐఐటీ, జేఈఈ ఓపెన్‌లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించాడని పేర్కొన్నారు. 2013లో సాయిసందీప్ రెడ్డి ఐఐటీ, జేఈఈ మెడికల్ ఫౌండేషన్ లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడని చెప్పారు. 2016 ఎంసెట్ మెడికల్ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన ప్రఫుల్ల మానస తెలంగాణ స్టేట్ ఫస్ట్ సాధించినట్టు తెలిపారు. నేడు దేశంలోని అన్ని ఐఐటీలలోనూ, ఎయిమ్స్‌లలోనూ తమ విద్యార్థులు ఎంతో మంది ఉన్నారని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్న ఎమ్మెల్సీలు

భూపాలపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనమండలి సభ్యులు శుక్ర, శనివారాల్లో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. 40మంది ఎమ్మెల్సీలు శుక్రవారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లోని శాసనమండలి ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో బయలుదేరనున్నారు. జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో కాళేశ్వరానికి అనుబంధంగా నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులను పరిశీలిస్తారు.

అఫ్ఘనిస్తాన్‌లో ఉద్యోగాల పేరిట మోసం

జగిత్యాల,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అఫ్ఘనిస్తాన్‌లో ఉద్యోగాల పేర ఘరానా మోసం జరిగింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు చెందిన దాదాపు 20 మంది అఫ్ఘనిస్తాన్ వెళ్లేందుకు ఏజెంట్‌కు దాదాపు రూ.25 లక్షలు ఇచ్చారు. అఫ్ఘనిస్తాన్‌లోని ఎంఎంహెచ్ఆర్ సొల్యూషన్ కంపెనీలో మంచి ఉద్యోగాలు ఉన్నాయని జగిత్యాలకు చెందిన చల్ల మహేష్ అనే సబ్ ఏజెంట్ 20 మంది వద్ద రూ.25 లక్షలు వసూలు చేశాడు. 2017, ఏప్రిల్‌లో ఏజెంట్‌కు డబ్బులు అప్పగించారు. అప్పటి నుంచి రేపు, మాపు అంటూ గడిపి డిసెంబర్‌లో ఢిల్లీకి తీసుకువెళ్లి వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఫేక్ వీసాలు చేతిలో పెట్టాడు. తీరా అవి నకిలీ వీసాలని తేలడంతో మహేష్ కోసం ఆరా తీయగా, ఆయన దుబాయ్‌లో ఉన్నట్లు తేలింది. దీంతో బాధితులు బుధవారం జగిత్యాల ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు.

ఈతకు వెళ్లి ముగ్గురి మృతి

శాయంపేట, ఫిబ్రవరి 21: వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం మాందారిపేటలో ఈతకు వెళ్లి ఆలేటి సునిల్(19), దేవుళ్లపల్లి వంశీ(17), రంగు సాయికృష్ణ(17) మృతి చెందారు. వరంగల్ కొత్తవాడకు చెందిన ఈ ముగ్గురు పెళ్లి కోసం మాందారిపేటకు వచ్చారు. పెళ్లి తరువాత ఈత కొడుదామని వంశీ, సాయికృష్ణ కుంటలోకి దిగారు. ఇరువురు నీటిలో మునిగిపోతుండగా కాపాడబోయిన సునీల్ కూడా నీటిలో మునిగిపోయాడు.

నీటి గుంటలో పడి ఇద్దరు చిన్నారులు..

సిరికొండ, ఫిబ్రవరి 21: వాటర్‌షెడ్ పథకం కింద తవ్విన నీటి గుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం ముత్యంపేటలో చిన్నారులు కినక పరమేశ్వరి(4), కినక పుష్ప(5) ఆడుకుంటూ గత ఏడాది నీటి నిల్వ కోసం వాటర్‌షెడ్ పథకం కింద తవ్విన నీటి గుంటలో పడి మృతి చెందారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఝరాసంగం, ఫిబ్రవరి 21: అప్పుల బాధతో సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం గుంతమర్పల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య(45) ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లయ్య కొంత మంది రైతుల వద్ద 16 ఎకరాలు కౌలు తీసుకుని పత్తి పంటను సాగు చేశాడు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో సాగు కోసం చేసిన రూ.4లక్షల అప్పులు మిగిలాయి. అప్పుల తీర్చలేక బుధవారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

బిచ్కుంద, ఫిబ్రవరి 21: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన గోనె హన్మాండ్లు (55) అనే రైతు మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రోజూ లాగే ఉదయం తన పొలానికి వెళ్లిన హన్మాండ్లు.. బోరు మోటార్ వద్ద ప్రమాదవశాత్తు కరెంటు వైరు కాలుకు తగిలి మరణించాడు.



ధర్నా చేస్తున్న బాలలతో మాట్లాడుతున్న ఎస్ఐ

భోజనం బాగా లేదన్నందుకు
వీధి బాలలకు గుండు

వరంగల్ అర్బన్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21: భోజనం బాగా లేదన్నందుకు ముగ్గురు బాలలకు గుండు గీయించిన ఘటన హన్మకొండ పట్టణ వీధి బాలల వసతి గృహంలో జరిగింది. భోజనం బాగా లేదన్న దిలీప్, అక్షయ్‌వర్మ, కల్యాణ్‌కు హాస్టల్ నిర్వాహకులు గుండు గీయించారని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. రెండు రోజుల నుంచి వారిని వేధిస్తుండటంతో ముగ్గురూ హాస్టల్‌లోని మిగతా బాలలతో కలిసి బుధవారం రాత్రి ధర్నాకు దిగారు.

తొలి ప్రయత్నంలోనే... ఫారెస్ట్ సర్వీస్

బీటెక్ చదువు, మంచి కంపెనీలో ఉద్యోగం... అయినా సరే, సివిల్స్ లేదా ఐఎఫ్ఎస్ సాధించాలనే చిన్ననాటి సంకల్పంతో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి లక్ష్యం దిశగా అడుగులు వేశారు. నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకున్నారు తేజస్విని. ఇటీవల ప్రకటించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 49వ ర్యాంక్ సాధించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహం వల్ల ఈ విజయం సాధ్యమైంది అంటున్న **తేజస్విని** సక్సెస్ స్టోరీ ఆమె మాటల్లోనే..



ఐఎఫ్ఎస్ ర్యాంకర్

ఫలితాలను చెక్ చేసుకుంటున్నప్పుడే స్నేహితులు కూడా చూసి ఫోన్ చేసి చెప్పారు ఇంత ర్యాంక్ వచ్చిందని. చాలా ఆనందంగా అనిపించింది. కుటుంబ సభ్యులు, గురువులు ఇచ్చిన ప్రోత్సాహం, తోడ్పాటు ఈ ర్యాంక్ రావడానికి ప్రధాన కారణం.

ఆఫర్ వచ్చినా

బీటెక్‌లో ఉన్నప్పుడే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో యునైటెడ్ ఆన్‌లైన్, టీసీఎస్ రెండు కంపెనీల ఆఫర్లు వచ్చాయి. యునైటెడ్ ఆన్‌లైన్‌లో చేరాను. తరవాత నా లక్ష్యం సివిల్స్ దిశగా సన్నాహాలు ప్రారంభించాలని నిర్ణయించుకున్నా. ఈ క్రమంలో లక్ష్మయ్య సార్‌ను కలిశాను. పూర్తి సమయం కేటాయిస్తే సివిల్స్‌లో విజయం సాధించవచ్చు అని సలహా ఇచ్చారు. దాంతో మూడు నెలల తరవాత ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా సివిల్స్ ప్రిపరేషన్‌పై దృష్టి సారించాను.

తొలి ప్రయత్నం

సివిల్స్ మూడు సార్లు రాశాను. మూడు సార్లు మెయిన్స్ వరకు వెళ్లాను. ఐఎఫ్ఎస్ మాత్రం తొలిసారి ప్రయత్నించాను. సివిల్స్, ఐఎఫ్ఎస్ ప్రిలిమినరీ పరీక్ష ఒకటే. కాబట్టి ఎటువంటి ఇబ్బంది ఉండదు. మెయిన్స్ పరీక్షలు పూర్తిగా భిన్నం. సివిల్స్ మెయిన్స్‌లో నాలుగు పేపర్లు ఉంటే, ఐఎఫ్ఎస్‌లో రెండు పేపర్లు మాత్రమే ఉంటాయి. సివిల్స్ మెయిన్స్‌లో ఒక ఆప్షనల్ ఉంటే ఐఎఫ్ఎస్‌లో రెండు ఆప్షనల్ పేపర్స్‌ను ఎంచుకోవచ్చు.

ప్రోత్సాహమే కారణం

సివిల్స్ ప్రిపరేషన్‌తో ఐఎఫ్ఎస్ రాయొచ్చు. సివిల్స్‌లోని జనరల్ స్టడీస్ కొంత వరకు ఐఎఫ్ఎస్‌కు ఉపయోగపడుతుంది. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న క్రమంలోనే ఈసారి ఐఎఫ్ఎస్ రాశాను. అది కూడా మా ఫ్రెండ్ గతేడాది ఐఎఫ్ఎస్‌కు ప్రిపేరయ్యారు. వాళ్ల నాన్న వై. వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో ఓఎస్‌డీగా పని చేస్తున్నారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఐఎఫ్ఎస్‌కు ప్రిపేర్ అయ్యాను. ఆయన గైడెన్స్ లేకుంటే రాసేదాన్ని కాదు. ఐఎఫ్ఎస్‌లో అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ నా ఆప్షనల్స్. ఫారెస్ట్రీ సబ్జెక్ట్ సొంతంగా చదువుకున్నా. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ మాత్రం వెంకటేశ్వర్లు అంకుల్ గైడ్ చేశారు. అది చాలా ఉపయోగపడింది. ఈ రోజు సక్సెస్‌కు దాన్నే ప్రధాన కారణంగా భావించవచ్చు. అదేవిధంగా మా మావయ్య డి. మంగపతిరావు యూఎస్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అంతకుముందు ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్. తాను కూడా నన్ను ఎంతో ప్రోత్సాహించారు.

ఐఎఫ్ఎస్‌లో చేరతా...

ఐఎఫ్ఎస్‌లో చేరతాను. డిసెంబర్‌లో ఐఎఫ్ఎస్ శిక్షణ ప్రారంభమవుతుంది. ఈలోగా మరోసారి సివిల్స్ రాస్తాను. నా దృష్టిలో సివిల్స్, ఐఎఫ్ఎస్ ఒకటే. కేవలం సైన్స్ బ్యాగ్రౌండ్ ఉన్నవారు మాత్రమే ఐఎఫ్ఎస్ రాసేందుకు అర్హులు మినహా సర్వీస్ పరంగా ఎటువంటి తేడా ఉండదు. కాబట్టి ఐఎఫ్ఎస్‌లో చేరతాను. చిన్ననాటి నుంచి కూడా నాది అదే లక్ష్యం.

నిబద్ధతతో కష్టపడాలి...

సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు నిబద్ధతతో కృషి చేయాలి. ఏదో ఒక సర్వీస్‌ను సాధించాలని కాకుండా ఆసక్తితో ప్రిపరేషన్ సాగించాలి. దాన్ని ఆస్వాదించాలి. అదే సమయంలో సంబంధిత అంశాల్లో విషయావగాహన పెరుగుతుంది. మన వ్యక్తిత్వం మెరుగుపడుతుంది. వెంటనే కాకుండా విజయం సాధించే వరకు ఓపికతో ఉండాలి. స్నేహితులతో డిస్కషన్ చేస్తూ, తరచుగా టెస్ట్ సిరీస్‌లను రాస్తూ ఉంటే విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఈ అంశాలు చాలా దోహదం చేస్తాయి.

సన్నద్ధత ఇలా...

సివిల్స్, ఐఎఫ్ఎస్‌కు నెల మాత్రమే తేడా ఉంది. సివిల్స్ మెయిన్స్ నవంబర్‌లో, ఐఎఫ్ఎస్ మెయిన్స్ డిసెంబర్‌లో జరిగాయి. ఆ నెల రోజుల్లోనే ఐఎఫ్ఎస్‌కు ప్రిపేరయ్యాను. ప్రిపరేషన్‌లో ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్, ఆయా సబ్జెక్ట్‌లకు ఉండే స్టాండర్డ్ పుస్తకాలను చదివాను. ఎక్కువ టెస్ట్ సిరీస్‌లు రాశాను. అంతేకాకుండా ఇన్‌స్టిట్యూట్‌లో కూడా మాక్ టెస్ట్‌లు నిర్వహించేవారు. పరీక్ష తరవాత వాటిని విశ్లేషించారు. తద్వారా మరింత మెరుగ్గా ప్రిపేర్ అవ్వడానికి అవకాశం లభించింది. అంతేకాకుండా తోటి విద్యార్థులతో ఆయా అంశాలపై చర్చించేదాన్ని. ఇవన్నీ డిస్క్రిప్టివ్‌గా ఉండే మెయిన్స్‌లో సమాధానాలను చక్కగా ప్రెజెంట్ చేయడానికి ఉపయోగపడ్డాయి.

ఇంటర్వ్యూ..

డాక్టర్ మనోజ్ సోనీ బోర్డు ఇంటర్వ్యూ చేసింది. దాదాపు 25 - 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ సాగింది. ఎక్కువగా సొంత జిల్లా అయిన ఖమ్మంకు సంబంధించిన ప్రశ్నలను అడిగారు.

చదువు

మా స్వస్థలం ఖమ్మం. నాన్న వెంకటేశ్వర్లు, అమ్మ శేషు కుమారి. నాన్న వ్యాపారం చేస్తారు. ఒక తమ్ముడు మనోజ్. తాను డెంటిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. మా ఇంట్లో ఎవరూ ప్రభుత్వ సర్వీసుల్లో లేరు. దాంతో చిన్ననాటి నుంచి సివిల్స్ / ఐఎఫ్ఎస్ రెంటిలో ఏదో ఒకటి సాధించాలనే తపన ఉండేది.

☆ ఖమ్మంలోని వీవీసీ పబ్లిక్ స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌తో 1 నుంచి 10వ తరగతి చదివాను. 10వ తరగతిలో 87 శాతం మార్కులు వచ్చాయి. విజయవాడ శ్రీచైతన్య కాలేజ్ నుంచి 97 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. ఎంసెట్‌లో 220వ ర్యాంక్ వచ్చింది. దాంతో జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్‌లో చేరాను. 2014లో ఈసీఈ బ్రాంచ్‌తో బీటెక్ పూర్తి చేశాను.

ఉద్యోగంతోపాటు చేస్తున్న సామాజిక సేవ తనకు లక్ష్యాన్ని నిర్దేశించింది. చేరుకోవాల్సిన గమ్యం వేరే ఉందనే విషయం బోధపడింది. అది చేరుకోవడానికి ఎనిమిదేళ్లు పట్టింది. అయినా ఓపికతో ఉన్నాడు. చివరికి లక్ష్యాన్ని సాధించాడు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన గ్రూప్ - 1 ఫలితాల్లో 489.5 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడు ప్రకాశం జిల్లాకు చెందిన **ఆకుల వెంకట రమణ.** ఈ విజయ ప్రస్థానం అతని మాటల్లోనే..



గ్రూప్-1 టాపర్

అధ్యయనంతోనే అన్ని మార్కులు సాధించా...

టాప్ మార్కులు రావడం ఆనందంగా ఉంది. చాలాకాలం నుంచి ప్రయత్నిస్తున్నాను. సర్వీస్ వస్తుందా రాదా అనే సందేహంలో ఉన్నాను. వేరే రంగానికి మారితే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా చేస్తున్నా. అదే సమయంలో ఈ ఫలితం రావడం హ్యాపీగా ఉంది. మొదట్లో సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేవాన్ని. ఇంటర్ వరకు తెలుగు మీడియం. అయినప్పటికీ గ్రూప్స్, సివిల్స్ పరీక్షలను ఇంగ్లీష్‌లోనే రాశాను. 2010, 2012, 2014, 2015లో మొత్తం నాలుగుసార్లు సివిల్స్ ప్రయత్నించాను. అదే క్రమంలో 2011లో గ్రూప్-1 మొదటిసారి రాశాను. దానికి సంబంధించి 2013లో ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. కానీ అది రద్దయింది.

డిప్యూటీ కలెక్టర్ రావచ్చు...

నాకు వచ్చిన మార్కులను బట్టి డిప్యూటీ కలెక్టర్ పోస్ట్ రావచ్చు అనుకుంటున్నాను. ఓపెన్ కేటగిరీలో పురుషులకు ఒక డిప్యూట్ కలెక్టర్ పోస్ట్ ఉంది. నా మొదటి ఆప్షన్ కూడా అదే కాబట్టి కచ్చితంగా డిప్యూటీ కలెక్టర్ వస్తుందనుకుంటున్నాను. 2011 రీ నోటిఫికేషన్ కాకుండా ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 పరీక్షకు సంబంధించి కూడా ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. వచ్చే నెలలో ఈ ఇంటర్వ్యూ ఉంటుంది.

తేడా ఇదే...

2011లో గ్రూప్-1 రాసినప్పుడు అంతగా అవగాహన లేదు. ఇంజనీరింగ్ నేపథ్యం, గ్రామీణ ప్రాంతం కావడంతో అంతా కొత్తగా ఉండేది. అప్పట్లో కేవలం ఉద్యోగం వస్తే చాలు అనే భావన ఉండేది. దానికి సంబంధించి ఎటువంటి పరిజ్ఞానం ఉండేది కాదు. 2016లో మళ్లీ పరీక్ష రాసేనాటికి సబ్జెక్ట్‌తోపాటు వివిధ అంశాలపై విస్తృత అవగాహన వచ్చింది. దాంతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాశాను.

వ్యవసాయ కుటుంబం..

మాది వ్యవసాయ కుటుంబం. నాన్న శ్రీరాములు, అమ్మ లక్ష్మీ నర్సమ్మ. ఆర్థిక స్తోమత అంతగా లేకున్నా నాన్న చదువుకోవాలని బాగా ప్రోత్సహించేవారు. మేము నలుగురు అన్నదమ్ములం. నేను మూడోవాన్ని. ఇద్దరు అన్నయ్యలు వెంకట నరసింహారావు, పూర్ణచంద్రరావు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. తమ్ముడు శ్రీకాంత్ హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. పెద్దన్నయ్య నరసింహారావు మొదట్లో లెక్చరర్‌గా పని చేశాడు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఇంజనీరింగ్‌లో చేరాను. ప్రస్తుత విజయంలో కూడా కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది. 2010 నుంచి చూస్తే ఈ ఫలితం రావడానికి ఎనిమిదేళ్లు పట్టింది. ఇన్నేళ్లలో అమ్మ, నాన్న, అన్నయ్యలు కానీ ఎవరూ కూడా దీని కోసం ఎదురు చూస్తున్నందుకు ప్రశ్నించలేదు. పైగా నన్ను ప్రోత్సహించారు.

మారిన లక్ష్యం

ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 2005లో హైదరాబాద్‌లో సర్క్యూట్ డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. జాబ్ చేస్తున్న సమయంలోనే సామాజిక సేవ చేసేవాన్ని. సాంఘిక సంక్షేమ హాస్టల్స్, స్కూల్స్‌లో ట్యూషన్ చెప్పడం, రామకృష్ణ మఠంలో బోధించడం, బాల కార్మిక వ్యవస్థ, వ్యవసాయంపై సెంటర్ ఫర్ సస్టయినబుల్ అగ్రికల్చర్ అనే ఎన్‌జీవోతో కలిసి పని చేశాను. అవన్నీ నాలో ఒకరకమైన చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపాయి. ఆ క్రమంలో మనం చేయాల్సిన జాబ్ వేరే అనే విషయం స్పష్టమైంది. ప్రైవేట్ జాబ్ కంటే ప్రభుత్వ ఉద్యోగంతోనే సామాజిక సేవ మరింత మెరుగ్గా చేయవచ్చు అనే ఉద్దేశంతో చేస్తున్న 2009లో ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను.

విద్యాభ్యాసం

మా స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం. 1 నుంచి 5వ తరగతి వరకు స్థానిక మున్సిపల్ స్కూల్లో, 6 నుంచి 10వ తరగతి వరకు జెడ్పీ పాఠశాలలో చదివాను. 10వ తరగతిలో 60 శాతం మార్కులు వచ్చాయి. 83 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. ఎంసెట్‌లో 1000వ ర్యాంక్ రావడంతో ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీటు వచ్చింది. విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీ నుంచి 2005లో ఈసీఈ బ్రాంచ్‌తో బీటెక్ పూర్తి చేశాను. 2013 నుంచి 16 వరకు లా చదివాను.

విస్తృత అధ్యయనం...

గ్రూప్స్ కోసం ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. 2011 గ్రూప్-1కు ఎటువంటి ప్రిపరేషన్ లేకుండా హాజరయ్యాను. అయినా మంచి ర్యాంక్‌తో ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. ఆ నోటిఫికేషన్ రద్దయింది. అయినప్పటికీ ఆ సమయంలో విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇండియన్ ఎకానమీ, ఇండియన్ పాలిటీ క్లాసులు చెప్పేవాన్ని. దినపత్రికలు, సబ్జెక్ట్ బాగా చదివేవాన్ని. వివిధ ప్రభుత్వ నివేదికలను బాగా అధ్యయనం చేసేవాన్ని. అవసరమైన విషయాన్ని ఇంటర్నెట్ సహాయంతో తెలుసుకునేవాన్ని. పరీక్షల కోణంలో కాకుండా ఆసక్తితో చదివడం అలవాటు చేసుకున్నాను. ఆన్‌లైన్ మెటీరియల్, రాజ్యసభ టీవీలో చర్చలను ఫాలో అయ్యేవాన్ని. ఆయా అంశాలపై హైదరాబాద్‌లో సెమినార్లు ఉంటే హాజరయ్యేవాన్ని. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ సివిల్స్‌లో నా ఆప్షనల్స్. గ్రూప్స్ ప్రిపరేషన్‌లో చాలావరకు వీటి ద్వారా పూర్తయింది. అదే విధంగా పరిపాలన సంస్కరణల కమిషన్ సిఫార్సులు, రాజ్యాంగ సవరణలను సమగ్రంగా అధ్యయనం చేశాను. ఫౌండేషన్ కోసం ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలను చదివాను. ఏస్ ఇంజనీరింగ్ అకాడమీ కోసం ఎన్విరాన్‌మెంట్ బుక్ రాశాను, ఎకానమీ మెటీరియల్ రూపొందించాను. ఇవన్నీ నా విషయ పరిజ్ఞానాన్ని పెంచాయి. దాంతో 2016 గ్రూప్స్ మెయిన్స్‌లో విజయం సులువైంది.

☆ **పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ప్రధానంగా ఓపిక ఉండాలి. ప్రిపరేషన్‌ను నిరంతరం కొనసాగించాలి. నిరుత్సాహం చెందకుండా మంచి ఫలితం వస్తుందన్న నమ్మకంతో ఉండాలి.**

ఇంటర్వ్యూ స్వభావం మారింది...

2013తో పోల్చితే ప్రస్తుతం ఇంటర్వ్యూ విధానం మారింది. అప్పట్లో దాదాపు 40 నిమిషాలపాటు ఇంటర్వ్యూ జరిగింది. బోర్డులో 11 మంది సభ్యులు ఉన్నారు. అప్పుడు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, విద్యా వ్యవస్థ మీద ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ప్రస్తుత బోర్డులో నలుగురు మాత్రమే సభ్యులు. దాదాపు 30 నిమిషాలపాటు విశ్లేషణాత్మకంగా ఇంటర్వ్యూ జరిగింది. ఇందులో మా స్వస్థలం మార్కాపురంకు సంబంధించి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. మార్కాపురం వెనుకబడి పోవడానికి కారణాలు, వెలుగొండ ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి కాలేదు, నల్లమల ప్రాంతంలో ఉండే నక్సల్ సమస్య, చదువుకున్నవారు అటువైపు వెళ్లడానికి కారణాలు, ఆర్‌డీవోగా ఎంపికైతే విద్యావ్యవస్థను ఏవిధంగా అభివృద్ధి చేస్తావు, నీవు లంచం తీసుకోవు అనే నమ్మకం ఏమిటి వంటి ప్రశ్నలను అడిగారు. అంతకుముందు కోచింగ్ క్లాసులు, టీచింగ్ చేసిన అనుభవం ఉండటంతో ఇంటర్వ్యూలో సమాధానాలను బాగా చెప్పగలిగాను.

జాబ్ కార్నర్

డిఎల్‌డబ్ల్యులో సమ్మర్ ఇంటర్న్‌షిప్

సీట్లు 4350

వారణాసిలోని డీజిల్ లోకోమోటివ్ వర్క్స్ (డిఎల్‌డబ్ల్యు)- టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టిటిసి) - ఇంజనీరింగ్ డిగ్రీ/ డిప్లొమా అభ్యర్థుల కోసం ఒకేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది.

- ఇంటర్న్‌షిప్ వ్యవధి: వర్క్‌షాప్‌లో 6 వారాల ట్రైనింగ్ ఉంటుంది. దీనిని 8 వారాలకు పెంచే అవకాశం ఉంది.
- నెలలవారీ ఖాళీలు: ఏప్రిల్‌లో 150, మేలో 1000, జూన్‌లో 1500, జూలైలో 1500, ఆగస్టులో 200 ఖాళీలు ఉన్నాయి.
- విభాగాలవారీ సీట్లు: మెకానికల్ 2390, మెకానికల్ (ప్రొడక్షన్ 625, ఆటొమొబైల్ 100), ఆటొమొబైల్ 25, ఎలక్ట్రికల్ 600, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ 150, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 125, ఎలక్ట్రానిక్స్ 100, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ 20, ఎలక్ట్రానిక్స్ & టెలి కమ్యూనికేషన్ 10, కంప్యూటర్ సైన్స్ 40, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 15, సివిల్ 150
- అర్హత: టెక్నికల్ / ఇంజనీరింగ్ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ (డిగ్రీ/ డిప్లొమా) కోర్సులు చదువుతున్న అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సుకు సంబంధించి ఆఖరు సంవత్సరం పరీక్ష ఉత్తీర్ణులైనవారు, ఆయా విశ్వవిద్యాలయాలు / సంస్థల నుంచి బయటికి వచ్చినవారు దరఖాస్తుకు అనర్హులు.
- వర్క్‌షాప్‌లో 80 శాతం అటెండెన్స్‌తో ట్రైనింగ్ పూర్తిచేసుకొని ప్రాజెక్ట్ రిపోర్టు సబ్మిట్ చేసిన అభ్యర్థులకు టిటిసి / డిఎల్‌డబ్ల్యు సర్టిఫికెట్ ఇస్తారు. ట్రైనింగ్ సమయంలో ఎటువంటి స్టయిపెండ్/ వేతనం చెల్లించరు. ట్రైనింగ్‌లో చేరేందుకు దరఖాస్తు ఫీజు చెల్లించనవసరం లేదు. సేఫ్టీ షూస్, హెల్మెట్స్, పీపీఈ లేకుండా వర్క్‌షాప్‌లోకి అనుమతించరు. అభ్యర్థులు భోజన, వసతి సౌకర్యాలను సొంత ఖర్చులతోనే ఏర్పాటు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 26
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 5
- దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 15
- చిరునామా: Principal, Technical Training Centre, Diesel Locomotive Works, Varanasi - 221004
- వెబ్‌సైట్: www.dlw.indianrailways.gov.in

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

ఖాళీలు 195

కపుర్తలా లోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్)- అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 55, వెల్డర్ 50, మెషినిస్ట్ 17, పెయింటర్ 9, కార్పెంటర్ 16, మెకానిక్ (మోటార్ వెహికిల్) 6, ఎలక్ట్రీషియన్ 28, ఎలక్ట్రానిక్ మెకానిక్ 4, ఏసి & ఫ్రిజ్ మెకానిక్ 10
- అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఎన్‌సీవీటీ వారి నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ పొంది ఉండాలి.
- వయసు: ఫిబ్రవరి 17 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
- దరఖాస్తు ఫీజు: రూ.100
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 19
- వెబ్‌సైట్: www.rcf.indianrailways.gov.in

ఐసీఎంఏఎంలో సైంటిస్టులు

ఖాళీలు 62

మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఆధ్వర్యంలోని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ అండ్ మెరైన్ ఏరియా మేనేజ్‌మెంట్ (ఐసీఎంఏఎం) - తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: ప్రాజెక్ట్ సైంటిస్ట్ (డి కేటగిరీ 1, సీ కేటగిరీ 17, బీ కేటగిరీ 33), టెక్నికల్ అసిస్టెంట్ 3, ఫీల్డ్ అసిస్టెంట్ 8
- విభాగాలు: కోస్టల్ ఓషనోగ్రఫీ/ మెరైన్ బయాలజీ/ ఫిజికల్ ఓషనోగ్రఫీ/ కోస్టల్ జియో మార్ఫాలజీ/ హజార్డ్ మోడలింగ్/ మెరైన్ కెమిస్ట్రీ/ కంప్యూటర్ సైన్స్/కోస్టల్ హైడ్రో డైనమిక్స్/ ఫిషరీస్/ మెరైన్ బయాలజీ/ ఫిజికల్ ఓషనోగ్రఫీ/ కోస్టల్ హైడ్రో డైనమిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్
- అర్హత: సైంటిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో పీజీ / బీఈ (సివిల్/ జియోమాటిక్స్ / ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ / ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్) పూర్తిచేసి ఉండాలి. నిబంధనల మేరకు రీసెర్చ్ అనుభవం ఉండాలి. పిహెచ్‌డి అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు బిఎస్సీ (కెమిస్ట్రీ) / డిప్లొమా (ఎలక్ట్రికల్ / ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్) పూర్తిచేసి ఉండాలి. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు పదోతరగతి అర్హత చాలు.
- వయసు: పోస్టును అనుసరించి 28 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 14
- హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 21
- వెబ్‌సైట్: www.icmam.gov.in/rect1.htm

కౌన్సెలింగ్

మంచి ఉద్యోగం కోసం ఏ స్పెషలైజేషన్..?

ఎంబీఏ పీజీడీఎం

ప్ర: నేను ప్రస్తుతం ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మంచి ఉద్యోగం రావాలంటే ఏ స్పెషలైజేషన్ ఎంచుకోవాలో తెలపండి.

- వి. భరత్, హైదరాబాద్

జ: స్పెషలైజేషన్‌కు సంబంధించి కోర్సులో ఉన్న ఆప్షన్స్ ప్రకారం మీకు దేనిలో ఆసక్తి ఉందో చూసుకోండి. ఆప్షన్ ఎంపికలో ఒకరు చెప్పే దాని కంటే మీకు మీరుగా నిర్ణయించుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్ అవసరాల ప్రకారం మీ కెరీర్‌కు ఉపకరించే విధంగా ఎంపిక ఉండాలి. భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకువెళుతోంది. కాబట్టి మార్కెటింగ్ విభాగంలో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పవచ్చు. బాగా కష్టపడే మనస్తత్వం ఉన్న ఔత్సాహికులకు ఈ రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయి. ఫైనాన్స్ విభాగాన్ని ఎంచుకోవడం కూడా మంచిదే. ఆర్థికంగా ఎదగడానికి ఈ విభాగంలోని అవకాశాలు ఉపకరిస్తాయి. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో కొంతమేర అవకాశాలు తక్కువనే చెప్పాలి. ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో కూడా మంచి అవకాశాలే ఉన్నాయి. సంస్థ అవసరాలను అనుసరించి తగిన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ విభాగం మంచి అవగాహన కల్పిస్తుంది.

- డాక్టర్ ఎం. భాస్కరరావు





ప్యాడ్ ఉమెన్

» ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ తయారీ
» దీపాంజలి దాల్మియా సంచలనం

వయస్సు 26 ఏళ్లు..న్యూయార్క్‌లో పెద్ద ఉద్యోగం..చేతి నిండా డబ్బు.. కానీ దీపాంజలి దాల్మియాకు సంతృప్తి లేదు! ఏదో చేయాలి.. నలుగురి కోసం బతకాలి..పదిమందికి సాయపడాలి! ఈ సంఘర్షణలోంచి పుట్టిందే.. ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ ఆలోచన! రెండేళ్ల పాటు ఆమె చేసిన పరిశోధన ఫలించింది. 6 నెలల్లోనే మట్టిలో కలిసిపోయే ప్యాడ్ల తయారీతో 'హేడే' కంపెనీని ప్రారంభించింది.



దీపాంజలి దాల్మియా! న్యూయార్క్‌లోని ఓ టాప్ కంపెనీలో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా పనిచేస్తూ.. 2015లో ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇదేం పిచ్చి పని అని చాలామంది విమర్శించారు. కానీ యాంత్రికమైన పనిలో ఆమె ఇమడలేకపోయింది. నలుగురికీ ఉపయోగపడేలా కొత్తగా ఏదైనా చేయాలని తపించింది. అలా మొదలైన కంపెనీయే 'హేడే'! వెదురు, కార్న్ ఫైబర్‌తో చేసిన.. నూటికి నూరుశాతం మట్టిలో కలిసిపోయే శానిటరీ ప్యాడ్! ఢిల్లీ, గుర్గావ్, నోయిడా, ముంబైలలో ఇప్పుడిదో బ్రాండ్! 'భారత్‌లో 87% మహిళలు శానిటరీ ప్యాడ్స్ ఉపయోగించరు. అందుకే వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన రంగంలో ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాను' అంటుంది దీపాంజలి! 'మార్కెట్లో ఉన్న ప్యాడ్స్‌లో 90% రసాయనాలతో నిండిన ప్లాస్టిక్‌తో చేసినవే! అందుకే ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ తయారీ మొదలుపెట్టాను' అనే దీపాంజలి మాటల్లో పర్యావరణంపై ప్రేమ కనిపిస్తుంది.

తయారీ నుంచి ప్యాకేజింగ్ వరకూ..



వెదురు నారకు పీల్చుకునే సామర్థ్యం ఉంటుంది. మొక్కజొన్న పోగుల అమరిక మెత్తగా ఉంటుంది. ఇలా రెండేళ్ల పరిశోధన తర్వాత గత ఏడాది సెప్టెంబరులో సేంద్రీయ, సహజమైన, సురక్షితమైన నెలసరి ప్యాడ్ల తయారీ కంపెనీ ప్రారంభించింది. తన బ్రాండ్‌కు 'హేడే' అని పేరుపెట్టింది. ప్యాకేజింగ్ ఇండియాలో జరుగుతున్నా..చైనా, ఫిన్లాండ్‌లలో ఉత్పత్తుల తయారీ జరుగుతోంది. మరి ఇలా ఎందుకు? 'రసాయనాలు లేని, 100 శాతం సేంద్రియ పదార్థాలతోనే మేం శానిటరీ ప్యాడ్స్ తయారుచేస్తాం. భారత్‌లో రసాయనాలు లేని నేల మాకు కనిపించలేదు. అందుకే ఇతర దేశాలపై ఆధారపడుతున్నాం' అని వివరిస్తోంది దీపాంజలి దాల్మియా! విదేశాల్లో తయారైనప్పటికీ మార్కెట్లోని ఇతర శానిటరీ న్యాప్‌కిన్స్‌తో పోలిస్తే.. హేడే ధర తక్కువే అంటోంది! శానిటరీ ప్యాడ్స్ దగ్గర్నుంచి..కవర్, ప్యాకేజింగ్ ఇలా మొత్తం ఆరునెలల్లో మట్టిలో కలిసిపోతుంది. త్వరలోనే ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలో కూడా ఈ ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ అందుబాటులోకి రానున్నాయి. మహిళల ఆరోగ్యం, పర్యావరణ రక్షణను దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన ఈ ఉత్పత్తికి 2017 సంవత్సరానికిగాను.. ఫోర్బ్స్ ఇండియా-30 జాబితాలో దీపాంజలి స్థానం సొంతం చేసుకుంది.

–సెంట్రల్ డెస్క్

భిక్షాటన, పడుపువృత్తే కాదు..
ఏ ఉద్యోగాన్నైనా సాధిస్తాం

» దేవుడిచ్చిన అక్కాబావకు రుణపడి ఉంటా
» ఎన్ఐఆర్‌డీలో ఉద్యోగం సాధించిన ట్రాన్స్‌జెండర్ గంగా భవాని



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఇప్పటికీ వివక్షను ఎదుర్కొనే వర్గం నుంచి వచ్చిన ట్రాన్స్‌జెండర్.. తానంటే ఏంటో నిరూపించాలనుకుంది. తాను కూడా అందరిలా హుందాగా బతకాలన్న లక్ష్యంతో రాత్రింబవళ్లు కష్టపడి చదివి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్ఐఆర్‌డీ)లో ఉద్యోగం సంపాదించింది. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీలో ఉద్యోగం సాధించిన విషయాన్ని గంగా భవానికి అధికారులు మంగళవారం తెలిపారు. వారం రోజుల్లో కాల్ లెటర్ వస్తుందని చెప్పారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఎన్ఐఆర్‌డీ ఇంటర్వ్యూకి ఎంపికైన 16 మందిలో తనకు ఉద్యోగం లభించడం ఆనందంగా ఉందని గంగా భవాని తెలిపారు. 'ట్రాన్స్ జెండర్స్ అంటే భిక్షాటన చేయడం, పడుపువృత్తి మాత్రమే చేస్తారనుకోవడం తప్పు. గతిలేక మాలో కొందరు ఆలాంటి పనులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం, సమాజంలోని వారందరూ మమ్మల్ని అందరి లాంటి మనుషుల్లానే చూడాలి. నా సొంత కుటుంబమే నన్ను పొమ్మంది. నాతో ఏ సంబంధం లేని శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గారి కుటుంబమే నన్ను పెంచారు. సమాజంలో హిజ్రాలను చూసే దృష్టిలో మార్పు రావాలి. ప్రభుత్వం ప్రోత్సహిస్తే హిజ్రాలు ఎలాంటి ఉద్యోగాన్నైనా సాధిస్తారు. మన శరీరంలో ఎలాంటి మార్పులున్నా సాధించాలనే పట్టుదల ఉంటే దానికి దేవుడి సహకారం ఉంటుంది. నా విషయంలో అదే జరిగింది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా కానీ చదువును మాత్రం వదిలిపెట్టకూడదని నిర్ణయించుకున్నా. అందుకే ఉద్యోగం వచ్చింది. అక్కాబావకు రుణపడి ఉంటాను.' అని సంతోషం వ్యక్తం చేసింది. ఏపీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌లో హిజ్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక డాక్యుమెంటరీ చేసి త్వరలోనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెబుతోంది.

సొంత కుటుంబమే గెంటేసింది

అనంతపురానికి చెందిన 32 ఏళ్ల గంగాభవాని ట్రాన్ జెండర్ అన్న విషయం తెలిసిన తల్లిదండ్రులు 14వ ఏటనే ఇంటి నుంచి వెలివేశారు. శ్రీశైలంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుటుంబం గంగను చేరదీసి కన్నకూతురులా చూసుకోవడమే కాదు ఉన్నత చదువులు చదివించింది. మానసిక ధైర్యాన్ని అందించి నీకు మేమున్నాం అంటూ ప్రోత్సహించారు. గంగ అనంతపురంలో డిగ్రీతో పాటు ఏఎన్ఎం పూర్తి చేశారు. ఆ తర్వాత కర్ణాటకలో ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేశారు.

పెద్ద మనసున్న చిన్న దేశం


సింగపూర్ స్వేచ్ఛా వాణిజ్యానికి పెట్టింది పేరు. అవినీతి, ఆంక్షల రహితం. వ్యాపార అనుకూలం. అందుకే సింగపూర్ వైపు అనేక ప్రపంచ కంపెనీలు దృష్టి సారించాయి. ఉభయులకూ లాభదాయకమైన రీతిలో ఉండాలన్న లక్ష్యంతో- స్థానిక పౌరులకు అంటే సింగపూర్ యువతకు ఉద్యోగాలు ఇచ్చేలా ఒప్పందాలు ఉంటాయి. అందుకే సింగపూర్‌లో నిరుద్యోగం కేవలం 3 శాతం మాత్రమే.. అదే సమయంలో తాజా లెక్కల ప్రకారం ఉపాధి కల్పన రేటు మాత్రం 80% నుంచి 81.8 శాతానికి పెరగడం విశేషం. వారి బడ్జెట్ ప్రణాళిక కూడా కేవలం ఒక్క సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని జరగదు. వచ్చే 10 నుంచి పాతిక సంవత్సరాల కోసం ఆర్థిక ప్రణాళిక రూపొందిస్తారు. అందుకు అనుగుణంగా పన్నులు విధిస్తారు. కాబట్టి సింగపూర్‌లో పన్నులు ఎక్కువ. ప్రతీ దానికీ పన్ను కట్టాల్సి ఉంటుంది. ఆ దేశ ఆర్థికరథాన్ని నడిపేది పన్నులే.. అదే సమయంలో జీతాలు, సబ్సిడీలు కూడా తదనుగుణంగానే ఉంటాయి. ఇలా ఎన్నో... అంశాలు సింగపూర్ ఆర్థికవృద్ధికి దోహదం చేస్తున్నాయి.

స్వేచ్ఛా విపణి

కృషి, పట్టుదలతో మిగులు బడ్జెట్.. బోనస్‌గా ప్రజలకు పంచిన సర్కారు

రెండురోజుల క్రితం సింగపూర్ నుంచి వచ్చిన ఓ వార్త ప్రపంచాన్ని అబ్బురపర్చింది. 2017-18లో 10 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 50 వేల కోట్ల రూపాయల మేర బడ్జెట్‌లో మిగులొచ్చిందనీ, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దేశంలో 21 ఏళ్లు దాటిన ప్రతీ వ్యక్తికీ బోనస్ (నగదు) ఇవ్వాలని నిర్ణయించామని సింగపూర్ ఆర్థిక మంత్రి హెంగ్ స్వీ కీట్ దేశ పార్లమెంట్‌లో- 2018 బడ్జెట్‌ను సమర్పిస్తూ ప్రకటించారు. నిజంగా ఇది అద్భుతమే. ఎందుకంటే ప్రపంచంలోని ఏ దేశంలోనూ ఎప్పుడూ లోటు బడ్జెట్లు. అప్పుల కుప్పలే తప్ప మిగులంటూ ఉండదు. అలాంటిది సింగపూర్ దీన్నెలా సాధించగలిగింది? ఆ దేశ ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ప్రకారం.. ఈ విజయానికి కారణం సింగపూర్ ప్రజలే. ఉద్యోగుల, కార్మికుల విశేష శ్రమ వల్లనే అద్భుతమైన ఈ ప్రగతి సాధ్యమయ్యింది. 'సింగపూర్ జీడీపీ 2.4 శాతం నుంచి 3.6 శాతానికి పెరిగింది.. ఇది ప్రభుత్వ లక్ష్యం కంటే ఎక్కువ. ఉత్పత్తి 2010 తర్వాత అతి ఎక్కువగా 4.5 శాతం మేర పెరిగింది. ఈ పెరుగుదల వల్ల కంపెనీలు తమ ఉద్యోగులకు మంచి జీతాలు ఇవ్వగలగడంతో పాటు పోటీలో కొనసాగగలుగుతున్నాయి. పూర్తి స్థాయి ఉద్యోగుల వేతనం 5.3 శాతం మేర పెరిగింది. అన్ని రంగాల్లో వృద్ధి పెరిగేందుకు వాణిజ్య పరిశ్రమల శాఖ (ఎంటీఐ) చేసిన కృషి ఫలించింది' అని ఆయన వివరించారు. సింగపూర్‌లో దాదాపు 66 చట్టబద్ధ ప్రభుత్వ సంస్థలు.. అంటే మనదేశంలో ఉన్న వివిధ మంత్రిత్వ శాఖలు, కార్పొరేషన్ల లాంటివి ఉన్నాయి. మెజారిటీ ప్రజలు వాటిలోనే పనిచేస్తారు. వాటి ద్వారా 2017-18లో దాదాపు 7.6 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చిన స్టాంప్ డ్యూటీ ఆదాయం 2 బిలియన్ డాలర్లు.. వెరసి 9.6 బిలియన్ డాలర్ల మిగులు.

దేశం చూస్తే చాలా చిన్నది.. అదీ ఓ ద్వీపం... అంతా కలిపి 278 చదరపు మైళ్లు దాటదు! జనాభా కేవలం 56 లక్షలు.. ఇంచుమించుగా హైదరాబాద్‌లో సగం జనాభా!! కానీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది ఆగ్నేయాసియా దేశం. బడ్జెట్‌లో మిగులును.. ప్రజలకు బోనస్‌గా ఇస్తోంది. ఇది ఎలా సాధ్యమైంది? ఏంటి వారి జీవన ప్రణాళిక?



ఎలా సాధ్యం?

సింగపూర్ ఓ నియమబద్ధ దేశం. అక్కడ ఉన్నంత క్రమశిక్షణ, రుజువర్తన చాలా తక్కువ దేశాల్లో మాత్రమే ఉంటుందంటే అతిశయోక్తి కాదు. నేతాగణంలో అవినీతి మచ్చుకైనా కానరాదు. ప్రజలూ అంతే! వ్యాపార దృక్పథం మెండు. సాంకేతికతను అభివృద్ధి చేయడంలో, పోటీపడడంలో వారికి వారే సాటి. తమకున్న ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకునే నైపుణ్యం వారికి ఎక్కువ.

కష్టే ఫలి

సింగపూర్ వాసుల జీవనశైలి కూడా ఆర్థిక పురోగతికి దోహదపడిందని చెప్పవచ్చు. ప్రజలు కష్టపడి పనిచేస్తారు. సింగపూర్‌లో స్వాతంత్ర్యం ఉన్నా పూర్తి స్వేచ్ఛ దక్కదు. చాలా ఆంక్షలుంటాయి. సైకిల్ తొక్కాలన్నా నిర్దిష్టమైన రోడ్లపై.. అదీ మార్కింగ్ ఉన్న ప్రాంతంలోంచే వెళ్లాలి. ఆ నిబంధన అతిక్రమిస్తే 1000 డాలర్లు జరిమానా కట్టాలి. చూయింగ్ గమ్, పాన్ మసాలా లాంటివి తిని రోడ్లపై ఉమ్మేయడం కుదరదు. సింగపూర్‌లో పనిమనుషులు చాలా ఎక్కువ. ఒక అంచనా ప్రకారం దాదాపు 2 లక్షల మందికి పైనే ఉంటారు.. మలేషియా, తమిళనాడు నుంచి వచ్చినవారు ఎక్కువమంది. పోటీతత్వం ప్రజల్లో ప్రతి ఒక్కరి నరనరాన ఉంటుంది. డిగ్రీ తప్పనిసరి. చదువు పూర్తయ్యాక ఎంప్లాయ్‌మెంట్ సెంటర్‌లో నమోదు చేయించుకోవాలి. వారి వారి ప్రతిభను బట్టి- డిగ్రీని బట్టి కొద్దికాలంలోనే ఉద్యోగం వస్తుంది. కంపెనీలు కూడా పోటీతత్వాన్ని పెంచుతాయి. అందుకే అక్కడ కంపెనీల వృద్ధి ఎక్కువ.





ఎక్కువమంది ప్రభుత్వ ఇళ్లలోనే

ప్రపంచంలో అత్యంత ఖరీదైన నగరాల్లో సింగపూర్‌ది ఏడో స్థానం. ఆసియా ఖండంలో చూస్తే దీనిది ఐదో స్థానం. విలాస జీవనం పెద్దగా సాధ్యపడదు. సింగపూర్‌లో భూభాగం చాలా తక్కువ కాబట్టి సొంతంగా ఇళ్లు కట్టుకోవడం సాధ్యం కాదు. 80% మంది సింగపూర్‌వాసులు ప్రభుత్వం రాయితీ మీద ఇచ్చే ఇళ్లలోనే ఉంటారు. ఇల్లు కొనాలంటే లక్ష డాలర్ల పైనే పెట్టాలి. అది కూడా నిర్దిష్ట కాలం వరకే! ఒంటరిగా ఉండేవారికి ఇల్లు కొనడానికి అనుమతి ఇవ్వరు. 35 ఏళ్లు దాటిన వారికే కొనే హక్కు. ఈ సమస్యలేవీ వద్దనుకుంటే.. 400 డాలర్లు చెల్లిస్తే నగరం మధ్యలో సింగిల్ బెడ్రూం ఫ్లాట్ వస్తుంది. దానిలో హాయిగా అద్దెకు ఉండవచ్చు.



ప్రైవేట్ కార్లకు స్వస్తి

సింగపూర్‌లోని మొత్తం భూభాగంలో 12 శాతం మేర రోడ్లు ఉంటాయి. వీటిపై అటు ప్రభుత్వ వాహనాలు, అత్యవసర వాహనాలు, రైళ్లు, బీఆర్‌టీఎస్.. ఇంకా ఎన్ని పడతాయి? అందుకే దీన్ని నియంత్రించాలని భావించారు. 2016లో అక్కడ ఆరు లక్షల ప్రైవేటు కార్లుండగా.. ఆ సంఖ్య పెరగడానికి వీల్లేకుండా కఠినమైన నిబంధనలు అమల్లోకి తెచ్చారు. వాటి ప్రకారం సింగపూర్‌లో కారు కొనడం తలకు మించిన పని. కారు ఖరీదు కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్‌తో పాటు సర్టిఫికెట్ ఆఫ్ ఎన్‌టైటిల్‌మెంట్ (అంటే వాహనం నడపడానికి అనుమతినిచ్చే పత్రం) తప్పనిసరి. ఈ సర్టిఫికెట్ పొందాలంటే 50,000 డాలర్లు చెల్లించాలి. ఇది కూడా పదేళ్ల పాటే చెల్లుతుంది. ఆఫీసులకు వెళ్లాలన్నా, బయటి పనుల మీద తిరగాలన్నా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును మాత్రమే వాడాలి. దీనికి తోడు ఈ ఏడాది నుంచి కార్బన్ టాక్స్ ఒకటి చేరింది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పులను ఎదుర్కొనడానికి ప్రభుత్వం ఈ టాక్స్ విధించింది. అందుకే సింగపూర్‌లో సైకిల్ వాడకం ఎక్కువ. హోదాతో నిమిత్తం లేకుండా అనేకమంది సైకిళ్ల మీదే ఆఫీసులకు వెళతారు. వేల మంది పెట్రో వాహనాలను త్యజించడం వల్ల కాలుష్యం తగ్గడంతోపాటు.. ఇంధనం ఖర్చులు తగ్గి ఆర్థికవ్యవస్థకు మేలు జరుగుతోంది.

దేశమంతా డిజిటలే..



కృత్రిమ మేధపై సాగుతున్న అధ్యయనానికి చాలా దేశాలు సింగపూర్‌ను ఎన్నుకుంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా ఉండడం, దానికి ప్రభుత్వ తోడ్పాటు ఇతోధికంగా అందడమే ఇందుకు కారణం. కృత్రిమ మేధ డేటా సెంటర్ కోసం ప్రభుత్వం 150 మిలియన్ డాలర్ల మొత్తాన్ని కేటాయించింది. ఇక దేశమంతా డిజిటలే.. బ్యాంకులన్నీ డిజిటల్ లావాదేవీలే చేపడతాయి. ఐటీ లేని విభాగం అంటూ కానరాదు. స్వయం సేవా కియోస్క్‌లు, డిజిటల్ తాళాలు, స్మార్ట్‌బెడ్‌లు.. అంతటా సాంకేతిక పరిజ్ఞానమే. ఇవన్నీ పనిలో నాణ్యత పెంచడమే కాక డబ్బు ఆదా చేస్తున్నాయి.. మానవ వనరులను ఇతరత్రా వినియోగించడానికి దోహదం చేస్తున్నాయి. ఇన్నోవేషన్, నైపుణ్య శిక్షణ, సాంకేతికత, వాణిజ్య దృక్పథం పెంపు.. మొదలైన వాటిపై ఎక్కువ ఫోకస్ పెట్టి- యువతను ఆ దిశగా మళ్లించడం ద్వారా సింగపూర్ ప్రభుత్వం తమ దేశాభివృద్ధిని పరుగులు తీయిస్తోంది.

వృద్ధుల రక్షణ చట్టం.. నిస్తేజం!





లా-లోచనం
Law lochanam

మన దేశంలో అరవై ఏళ్లు నిండిన వారి సంఖ్య 2011 జనాభా లెక్కల ప్రకారం 9.83 కోట్లు. ఇతర దేశాల్లో సీనియర్ సిటిజన్లు వందేళ్లకు రెట్టింపవుతుండగా మన దేశంలో సగటున ఇరవయ్యేళ్లలోనే రెట్టింపయ్యారు. 2025 నాటికి యువత సంఖ్య కన్నా వృద్ధుల సంఖ్యే ఎక్కువ కాగలదని, 2050 నాటికి దేశ జనాభాలో 25 శాతం వృద్ధులే అవుతారని మరో అంచనా. కోటిన్నర మంది పెద్దలు ఏకాకి జీవితం గడుపుతున్నారని, వారిలో మూడో వంతు మంది మహిళలేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. వయోవృద్ధులను ఆదరించి, వారికి వార్ధక్యంలో ప్రశాంత జీవితం అందించడం సమాజ ధర్మం. కానీ వాస్తవంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇంటి బాల్కనీపై నుంచి రోగిష్టి తల్లిని తోసేసిన కొడుకులు, బతికుండగానే శ్మశానానికి చేర్చిన బిడ్డలూ ఇటీవల వార్తల్లోకెక్కారు. 40 శాతం సీనియర్ సిటిజన్లు తమ కుటుంబం నుంచే అవమానాల్నీ, నిరాదరణను ఎదుర్కొంటూ అవసాన దశకు దగ్గరవుతున్నారు. కానీ కేవలం ఆరు శాతం కేసులే చట్ట పరిధిలో నమోదు అవుతున్నాయి. ఆర్థిక భద్రత లేమి, ముసురుకొచ్చే వ్యాధులూ, ఒంటరితనం, అభద్రత వంటి సమస్యలతో చివరిక్షణాలు లెక్కిస్తున్న కన్నవారికీ, వృద్ధ బంధువులకూ మనమిచ్చే ఆసరా ఏమిటి?

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్-125 ప్రకారం తల్లిదండ్రులు జీవనభృతి కోరవచ్చు. హిందూ దత్తత, మనోవర్తి చట్టం కూడా ఇందుకు వీలు కల్పిస్తుంది. అయితే ఈ చట్టాల కంటే పదునైన న్యాయప్రక్రియ కోసం 2007లో ప్రభుత్వం తెచ్చిన 'తల్లిదండ్రులూ, వృద్ధుల భృతి, సంరక్షణ చట్టం' అమలులో నీరసించింది. వయసుతో ప్రమేయం లేకుండా తల్లిదండ్రులు.. సంతానం లేక ఎవరినో చేరదీసి ఆస్తిని కట్టబెట్టి నిరాశపాలైన వృద్ధులు ఈ చట్టం ప్రకారం భృతి, పోషణ, రక్షణ వంటి పరిహారాలను సులువుగానూ, వేగంగానూ పొందే వీలుంది. నివాసం, వైద్య సౌకర్యం, భద్రత వంటి సదుపాయాలను బిడ్డల నుంచి, పెంచుకున్న వారి నుంచి పొందే అవకాశం వృద్ధులకు 2007 చట్టం వీలు కల్పించింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను ఖాతరుచేయని నిందితులకు జైలుశిక్ష వడ్డించే ఏర్పాటు కూడా ఈ చట్టం చేయడంతో, చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయవచ్చు. తల్లిదండ్రులకు భృతి చెల్లించాల్సిన బాధ్యత వివాహిత కుమార్తెలకు కూడా ఉందని అర్బాత్ కేసు (1987)లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2003లో పాలడుగు విజయలక్ష్మి కేసులో- సొంత ఆదాయ వనరులున్న వివాహిత కుమార్తెలు కన్నవారిని పోషించాల్సిందేనని స్పష్టం చేయడం విశేషం. తమను నిర్లక్ష్యం చేసి, వేధించే బిడ్డలను ఇంటి నుండి వెళ్లగొట్టే హక్కు తల్లిదండ్రులకుందని గత మార్చిలో ఢిల్లీ హైకోర్టు (సన్నీపాల్ కేసు) ప్రకటించింది. దీంతో కేవలం జీవనభృతిని అర్థించడమే కాదు, తమ ఆస్తులను కాపాడుకునే హక్కు కూడా వృద్ధులకు 2007 చట్టం కట్టపెట్టిందని స్పష్టమైంది. భర్తతో తగాదా పడే కోడలు అత్తమామల్ని వేధిస్తూ కూడా వారి ఇంటిలో నివసించే హక్కు కోరలేదని రష్మీ సక్సేనా కేసు (ఫిబ్రవరి 2017)లో హైకోర్టు ఇచ్చిన తీర్పు.. కోడళ్ల ఆరళ్లకు బలవుతున్న అత్తమామలకు ఓదార్పు. పెంపుడు కొడుకు తమ చివరి రోజుల్లో బాగోగులు చూస్తాడనే గుడ్డి నమ్మకంతో ఆస్తులు అతగాడికి దఖలు చేసి, నమ్మకం వమ్మయిన వృద్ధులు, 2007 వృద్ధుల చట్టం క్రింద దఖలు దస్తావేజు రద్దు డిక్రీని పొందవచ్చని షబీబ్ మార్టిన్ కేసులో (2016) కేరళ హైకోర్టు అభిప్రాయపడింది. అయితే బాధితులు న్యాయవాది సహాయం పొందకుండా చట్టం అడ్డుచెప్పటం ఒక లోపం. నిస్సహాయులైన వృద్ధ బాధితులు.. ట్రిబ్యునల్ అధికారాలున్న రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో పడిగాపులు కాయాల్సి రావడం వారిని చట్టం నీడలో మరింత వేధించడమే. దీనిపై నిష్ణాతులు, అనుభవజ్ఞులైన న్యాయవాదులు, రిటైరయిన ప్రభుత్వాధికారులతో ప్రత్యేక ట్రిబ్యునళ్లు ఏర్పాటుచేస్తే న్యాయ ప్రక్రియ వేగవంతమవుతుంది.

– వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్ : 70421 40099

మార్చిలో తెలంగాణకు వస్తాం

▸ మాంసం ఉత్పత్తి రంగ సంస్థల ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పరిశీలించేందుకు మార్చి నెలలో రాష్ట్రంలో పర్యటించేందుకు మాంసం ఉత్పత్తి రంగ సంస్థల ప్రతినిధులు అంగీకరించారు. దుబాయ్‌లో జరుగుతున్న గల్ఫ్ ఫుడ్-2018 ట్రేడ్ షోలో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రస్తుతం మాంసాన్ని దిగుమతి చేసుకుంటున్న తెలంగాణ ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 44 లక్షల గొర్రెల పంపిణీ జరిగిందని, చేపల పెంపకాన్నీ ప్రోత్సహిస్తున్నామన్నారు.

నిర్మల్‌కు ఈఎస్‌ఐ ఆస్పత్రి ఇవ్వండి : ఇంద్రకరణ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్‌ను రాష్ట్ర దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో బుధవారం గాంగ్వార్‌తో భేటీ అయిన ఇంద్రకరణ్ 50 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు. అనంతరం కేంద్ర మంత్రి రాధామోహన్ సింగ్‌ను కలిసిన ఇంద్రకరణ్.. కందుల కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రిజర్వేషన్లు పెంచి తీరుతాం: మహమూద్ అలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు పెంచి తీరుతామని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతారన్నారు. లేని పక్షంలో సుప్రీంకోర్టుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రానికి పంపిన ప్రతిపాదనలపై రాష్ట్రానికి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

స్పీకర్, మండలి చైర్మన్‌ను కలిసిన సీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి బుధవారం కలిశారు. అసెంబ్లీకి వచ్చిన జోషికి కార్యదర్శి నరసింహాచార్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్పీకర్, చైర్మన్లను కలిశారు.

సీఎంకు పోలీస్ అధికారుల సంఘం కృతజ్ఞతలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం కేసీఆర్, డీజీపీ మహేందర్‌రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్ జీవోపై డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వం జీవో విడుదల చేయించడంపై సంఘం అధ్యక్షుడు గోపీరెడ్డి, రాచకొండ, సైబరాబాద్ పోలీస్‌అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రవాణా కమిషనరేట్‌లో 9 పోస్టుల భర్తీకి ఓకే

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖ కమిషనరేట్‌లో ఖాళీగా ఉన్న 9 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి శివశంకర్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారానే ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.

విడతలవారీగా ఎలక్ట్రానిక్ పట్టాదారు పుస్తకాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌పుస్తకాలను విడతల వారీగా ఏప్రిల్ నెలాఖరుకల్లా అందజేస్తామని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నోడల్ అధికారి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈనెల 27న ప్రయోగాత్మకంగా 1000 పాస్‌పుస్తకాలు ఇస్తామని దీనికి అంగీకరిస్తే.. మార్చి 5వ తేదీ నాటికి 5 లక్షలు, తరువాత రోజుకు రెండు లక్షలు చొప్పున ఏప్రిల్ నెలాఖరుకల్లా 72 లక్షల పాస్‌పుస్తకాలు ముద్రించి ఇస్తామని అందులో పేర్కొన్నారు. ఈ లేఖతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం పాస్‌పుస్తకాల ముద్రణ పై ఇతర ప్రెస్‌లతో చర్చలు జరిపింది. ఒకే ప్రెస్‌కు ఇవ్వడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని, నాలుగైదు ప్రెస్‌లను రంగంలోకి దించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఈ విషయంపై గురువారం తుది నిర్ణయం వెలువడే అవకాశాలున్నాయి.

ఆర్వోఆర్ యాక్ట్ గెజిట్ నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రికార్డ్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్ బుక్ యాక్ట్‌కు గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఆమోద ముద్రవేయడంతో బుధవారం నోటిఫై చేస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు న్యాయశాఖ కార్యదర్శి ఒలిమినేని నిరంజన్‌రావు జీవో 5ను జారీ చేశారు. మంగళవారం ఈ బిల్లుపై గవర్నర్ సంతకం చేయడంతో బిల్లు చట్ట రూపం సంతరించుకుంది. దీంతో దీన్ని నోటిఫై చేస్తూ బుధవారం తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ పట్టాదార్ పాస్‌పుస్తకం (సవరణ) యాక్ట్ - 2018 యాక్ట్ నంబర్.1 ఆఫ్ 2018గా పరిగణనలోకి తీసుకుంటూ గెజిట్ విడుదల చేశారు.

సామూహిక ఉపనయనాలకు ఆర్థిక సాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సామూహిక ఉపనయనాలు నిర్వహించే బ్రాహ్మణ సేవాసంఘాలకు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆర్థిక సాయం అందజేయనుంది. ప్రతి వటువు పేరున రూ. 11,116 చొప్పున ఆర్థిక సాయాన్ని ఆయా సంస్థలకు పరిషత్ అందించనుంది. ఉపనయనాలకు సంబంధించిన వీడియో సీడీ, ఫొటోల్ని సంబంధిత పత్రాలు జతచేసి ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

‘తహసీల్దార్ల’కు రిజిస్ట్రేషన్ల ‘కార్డ్’ లింకేజీ

హైదరాబాద్, 21 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించనున్న నేపథ్యంలో అన్ని తహసీల్దార్ల కార్యాలయాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను అనుసంధానిస్తోంది. ఈమేరకు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలోని మౌలిక సదుపాయాల విభాగం ఈ లింకేజీ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కింద 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి ద్వారానే రాష్ట్రంలోని భూములు, ప్లాట్లు, ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలులోకి తెస్తున్న విషయం తెలిసిందే. మే నెల నుంచి తహసీల్దార్లు కూడా రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఈ దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకున్న ప్రత్యేక రిజిస్ట్రేషన్ల నెట్‌వర్క్‌ను అన్ని తహసీల్దార్ల కార్యాలయాలకు అనుసంధానించే పనులు చేపట్టారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ‘కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్(కార్డ్)’ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇక మీదట తహసీల్దార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు చేయనున్న దృష్ట్యా ‘కార్డ్’ను లింక్ చేసే పనులను ఐటీ శాఖ చేపట్టింది. ఇప్పటికే గచ్చిబౌలిలోని సెంట్రల్ సర్వర్‌లో నవీకరణ పనులకు శ్రీకారం చుట్టింది.

300 కోట్లతో రైతు సమావేశ మందిరాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) క్లస్టర్ పరిధిలో రూ. 12 లక్షల వ్యయంతో ప్రభుత్వం సమావేశ మందిరాన్ని నిర్మించనుంది. ఈ మేరకు బడ్జెట్లో నిధుల మంజూరుకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,500 ఏఈవో క్లస్టర్లకుగాను రూ. 300 కోట్ల మేరకు బడ్జెట్ అవసరమవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. రాష్ట్రంలో ప్రతి 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా నిర్ణయించి.. దీనికి ఒక ఏఈవోను నియమించిన సంగతి తెలిసిందే. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు.. జిల్లా, మండల, క్లస్టర్ స్థాయిల్లో రైతు సమావేశ మందిరాల ఏర్పాటుకు ప్రతిపాదనలపై కసరత్తు చేశారు. స్థాయిని బట్టి రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకూ వ్యయంతో రైతు సమావేశ మందిరాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అయితే వాటిని పరిశీలించిన సీఎం కేసీఆర్.. ప్రతి ఏఈవో క్లస్టర్ పరిధి మేరకే సమావేశ మందిరాల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ సమావేశ మందిరాల్లో ఆయా క్లస్టర్ల పరిధిలోని గ్రామాల రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా, జిల్లా రైతు సమన్వయ సమితిలో సభ్యులుగా మండల సమితిలో సభ్యులే ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం సవరించింది. మండల సమితిలో సభ్యత్వం లేకున్నా జిల్లా సమితి సభ్యుడు కావొచ్చంటూ జిల్లాల కలెక్టర్లకు వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మండల సమితి సభ్యులు ఆయా మండలాల పరిధిలోని గ్రామ సమితుల్లో సభ్యులై ఉండాలన్న వ్యవసాయ శాఖ గత సర్క్యులర్ ఆధారంగా మండల సమితుల ఏర్పాటు జరిగింది. అయితే, మండల సమితిలో సభ్యత్వం లేనివారినీ జిల్లా సమితి సభ్యులుగా నామినేట్ చేసిన మంత్రుల సిఫారసును నిలిపేసిన కలెక్టర్లు స్పష్టత కోసం వ్యవసాయ శాఖను సంప్రదించగా తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి.



అమరుల ‘ప్రమిద’

▸ ప్రమిద ఆకారంలో అమరుల స్థూపం.. అంగీకరించిన సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమాలకు నెలవైన హుస్సేన్‌సాగర్ తీరం ఆ పోరాటంలో బలిదానం చేసుకున్న అమరుల స్థూపానికి వేదిక కానుంది. తెలంగాణ ఉద్యమంలో ఆత్మార్పణ చేసుకున్న అమరవీరుల స్మారకార్థం సాగర తీరంలో స్థూపం ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో టీఆర్‌ఎస్ ప్రకటించింది. దీనికి సీఎం కేసీఆర్ 2016లోనే శంకుస్థాపన చేశారు. అయితే, రూపం ఎలా ఉండాలనే అంశంపై రోడ్లు, భవనాల శాఖ వివిధ చోట్ల అధ్యయనం చేసింది. చివరికి తాను కరుగుతూ వెలుగునిచ్చే ప్రమిద రూపంలో నిర్మించాలని ప్రతిపాదించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 1100 మందికి పైగా ప్రాణాలర్పించిన విషయం తెలిసిందే. తమను తాము బలి ఇస్తూ స్వరాష్ట్రం కోసం పోరాటం చేసిన అర్థం వచ్చేలా ‘ప్రమిద’ నమూనాను సీఎం కేసీఆర్ బుధవారం ఖరారు చేశారని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్‌లో వెల్లడించారు. సాగర్‌లో ఉన్న బుద్ధుడి విగ్రహం, జాతీయ జెండా ఒకే రేఖపై కనిపించేలా నిర్మించాలని ప్రతిపాదించారు. స్థూపం ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అందమైన ఉద్యానవనం, వాటర్ ఫౌంటెయిన్, పార్కు చుట్టూ 9 పిల్లర్లు, మధ్యలో పెద్ద పిల్లర్.. ఆ పిల్లర్‌పై తెలంగాణ తల్లి విగ్రహం ఉండేలా డిజైన్ రూపొందించారు. దీని నిర్మాణానికి రూ.80 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. స్థూపం మొత్తం నాలుగు భాగాలుగా ఉండనుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, రెండో భాగంలో సంస్మరణ సభలు జరుపుకునేందుకు హాల్, మ్యూజియంతో ఆడియో విజ్యువల్ హాల్, నాలుగో భాగంలో రెస్టారెంట్ ఉంటుంది. ఇక తొమ్మిది దీపాలు ఉండే పిల్లర్లు నిరంతరం గ్లోసైన్ విద్యుత్ దీపాలతో వెలిగేలా ఫైబర్ మెటీరియల్‌ను వాడనున్నారు. ఈ నిర్మాణానికి వచ్చే నెలలో టెండర్లు పిలవనున్నారు. ఈ అమరవీరుల స్థూపం ఏడంతస్థుల మేడలా ఉండనుంది.



శంషాబాద్ విమానాశ్రయంలో బాధితులు

కువైత్ ఆర్తులకు కవిత సాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కువైత్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్షకు అర్హులై ఉండి స్వదేశానికి రావడానికి ఆర్థిక స్తోమత లేక అక్కడే ఉండిపోయిన పలువురికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆపన్న హస్తం అందించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 9మందికి విమాన టికెట్లు ఏర్పాటు చేసి స్వదేశానికి రప్పించారు. విమానాశ్రయానికి చేరుకున్న బృందానికి జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యువత అధ్యక్షుడు కోరబోయిన విజయ్, తదితరులు స్వాగతం పలికారు. స్వదేశానికి రావడానికి తమకు సహకరించిన ఎంపీ కవితకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. అంగోత్ ప్రకాష్ (డిచ్‌పల్లి), గుగులోత్ దేవీదాస్, అంతిరెడ్డి రాజు, రవికుమార్, మెగావత్ జేత్య, రంజిత్, శ్రీనివాస్, నాగ మహిపాల్, అనుకుమార్‌లు కువైత్ నుంచి వచ్చారు.

వ్యవసాయానికి సౌర పంపుసెట్లు

▸ ‘కుసుమ్’ పథకం కింద పంపుసెట్ల మార్పు
▸ రూ.22 వేల కోట్లు ప్రతిపాదించిన కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మార్చడానికి ‘కిసాన్ ఉర్జా ఉత్థాన్ మహా అభియాన్(కుసుమ్)’ పథకాన్ని కేంద్రం ప్రతిపాదించింది. దేశంలో తొలిసారిగా తెలంగాణలో వ్యవసాయ రంగానికి ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుండటంతో రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లను మార్చడానికి ఈ పథకం ఉపయుక్తంగా ఉండనుంది. సోలార్ ప్యానల్‌లు పెట్టుకునే రైతులు ఈ పథకం కింద కరెంటును వ్యవసాయానికి వాడుకున్న తర్వాత మిగులు కరెంట్‌ను డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. ఒక్కో యూనిట్‌కు 50 పైసలు ఇస్తారు. కుసుమ్ పథకం కింద దేశవ్యాప్తంగా రైతుల భూముల్లో 10 వేల మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లు పెట్టాలని కేంద్రం యోచిస్తోంది. 2018-19 బడ్జెట్‌లో ఈ పథకానికి కేంద్రం రూ.22 వేల కోట్లు కేటాయించింది. దేశవ్యాప్తంగా 7.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు మార్చనున్నారు. తెలంగాణలో 30 వేల వ్యవసాయ పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మార్చనున్నారు. సోలార్ పంపుసెట్లకు అయ్యే వ్యయంలో కేంద్రం 60% సబ్సిడీగా ఇవ్వనుండగా 30% బ్యాంకు రుణం, మిగిలిన 10% రైతులు కట్టాల్సి ఉంటుంది. తొలి విడతలో 17.5 లక్షల డీజిల్ పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మారుస్తారు. ఈ పథకం కింద రానున్న పదేళ్లలో రూ.1.4 లక్షల కోట్లు వెచ్చించాలని కేంద్రం టార్గెట్‌గా పెట్టుకుంది. ఇన్‌సెంటివ్‌గా రూ.48 వేల కోట్లు ఇవ్వనుంది. దాంతో పాటు కొత్త సోలార్ ప్లాంట్లు కూడా పెట్టే అవకాశాలున్నాయి. బీడు భూముల్లో కొత్త ప్లాంట్లు పెట్టి ఆ విద్యుత్‌ను వ్యవసాయ కనెక్షన్లకు అందించే అవకాశాలున్నాయి. నీటిపారుదల డ్యామ్‌లు, రిజర్వాయర్లు, యాష్‌పాండ్‌లు, బొగ్గు గనుల్లోనూ కొత్త సోలార్ ప్లాంట్లు పెట్టాలని ప్రతిపాదించారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

హెల్త్‌కార్డులు కూడా..

▸ జూలై నుంచి ప్రారంభం
30 లక్షల మందికి ప్రయోజనం
▸ 8 లక్షల మంది విద్యార్థినులకు
హెల్త్ అండ్ హైజీన్ కిట్స్
▸ బాలికలకు ఆరోగ్య తరగతులు
▸ ఆరోగ్య శాఖ, విద్యాశాఖ కార్యాచరణ
▸ సమీక్షించిన కడియం, లక్ష్మారెడ్డి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు కడియం, లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్‌కార్డులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని జూలై నెలలో ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధి విధానాలపై విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ, ఆరోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహించనుంది. వైద్య పరీక్షలు 6 నెలల్లో పూర్తి చేసి హెల్త్‌కార్డులు అందించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. అలాగే 8 లక్షల మంది స్కూల్ విద్యార్థినులకు హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే కేజీబీవీలు, గురుకుల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలోని 3 లక్షల మందికి విద్యాశాఖ హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ అందిస్తోందని కడియం తెలిపారు. విద్య, వైద్య శాఖలు సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఇక ప్రాథమికోన్నత బాలికలకు యుక్త వయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలు, సంరక్షణపైనా అవగాహన తరగతులు నిర్వహించాలని మంత్రులు ఆదేశించారు. ఇందుకోసం విద్యాశాఖలోని కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులందరికీ వైద్య, ఆరోగ్య శాఖ తరఫున శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే బాలికల్లో రక్తహీనత సమస్యను దూరం చేసేలా గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో అన్ని రకాల పోషకాహారాలు అందించే మెనూను ఇప్పటికే అమలు చేస్తున్నామని కడియం వివరించారు. మిగిలిన స్కూళ్లలోనూ విద్యార్థినుల్లో రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు సూచించాలని ఆరోగ్య శాఖను కోరారు. ఒక్కో జిల్లాలో, ఒక్కో స్కూల్‌కు ముందే షెడ్యూల్ విడుదల చేసి, ఆ తేదీల్లోనే పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య కార్డులు ఇచ్చే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రులు సూచించారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రులు కడియం, లక్ష్మారెడ్డి తెలిపారు.



ప్రపంచ ఐటీ సదస్సులో దీపిక



మంత్రి కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న దీపిక

కుంగుబాటు.. అసమర్థత కాదు

▸ బాధితుల పట్ల సానుభూతి చూపాలి
▸ వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి
▸ ‘కార్పొరేట్’లకు దీపికా పదుకోన్ సలహా
▸ ముగిసిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): “డిప్రెషన్ (కుంగుబాటు).. అదెలా ఉంటుందో నాకు తెలుసు. 2014లో నా కెరీర్ ఉచ్ఛస్థాయిలో ఉన్నప్పుడు నేను డిప్రెషన్‌కు గురయ్యాను. ఆ సమయంలో మా అమ్మ నాలో తేడాను గుర్తించి సరైన సమయంలో చికిత్స చేయించారు. నన్ను డిప్రెషన్ నుంచి బయటపడేసేందుకు మా బంధుమిత్రులు కూడా సహకరించారు” అని ప్రముఖ నటి దీపికాపదుకోన్ చెప్పారు! హైదరాబాద్‌లో జరుగుతున్న ఐటీ సదస్సులో పాల్గొన్న దీపిక.. ‘ఉద్యోగుల మానసిక స్వస్థత, బోర్డ్ రూమ్ ప్రాధాన్యత’ అనే అంశంపై మాట్లాడారు. తన ఉదాహరణ ఎలా ఉన్నా.. ప్రస్తుతం ఉన్న ఒత్తిళ్ల వాతావరణంలో కుంగుబాటుకు గురవుతున్న ఉద్యోగులు ఆ విషయాన్ని యాజమాన్యానికి చెప్పే పరిస్థితి లేదని.. చెప్తే దయాదాక్షిణ్యం లేకుండా ఉద్యోగం నుంచి తొలగించే వాతావరణం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటివారి పట్ల సానుభూతితో వ్యవహరించి దాన్నుంచి బయటపడేందుకు వారికి సహకరించాలని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలకు ఆమె సూచించారు. వారిని ఆ స్థితి నుంచి బయటకు తీసుకురాగలిగితే వారు తిరిగి పూర్తి సామర్థ్యాలతో పని చేయగలుగుతారని స్పష్టం చేశారు. ఇందుకోసం కార్పొరేట్ సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ‘మీరు ఏకాకి కాదు’ అని చెప్పి వారికి భరోసా అందించాలని సూచించారు. తాను డిప్రెషన్ నుంచి బయటపడగానే.. సమాజంలో ఈ సమస్యను ఎదుర్కొంటున్న ఇతరుల కోసం తనవంతుగా ఏదైనా చేయాలన్న ఆలోచన కలిగి “లివ్ లవ్ అండ్ లాఫ్ ఫౌండేషన్” ఏర్పాటు చేశానని ఆమె తెలిపారు. కాగా.. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ కాలంతో పోటీపడితే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఉద్యోగాలు చేసుకోవచ్చని సదస్సులో పాల్గొన్న ఐటీ నిపుణులు అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, స్మార్ట్ నగరాల అభివృద్ధి అంశాలపై చర్చలతో సందడిగా సాగిన ఈ సదస్సు బుధవారం ముగిసింది.

షెడ్యూల్ ప్రకారమే టీఆర్టీ

▸ అభ్యర్థులు ఆందోళన చెందొద్దు
▸ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి వెల్లడి



టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, సభ్యులు, సెక్రటరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)పై అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి భరోసా ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 24 నుంచి రాత పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. 24న జరిగే తెలుగు సబ్జెక్టు అభ్యర్థుల హాల్‌టికెట్లను బుధవారం ఉదయం 11గంటల నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటివరకు 9500 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. మిగితా సబ్జెక్టుల హాల్‌టికెట్లను కూడా త్వరలో జారీ చేస్తామని బుధవారం కమిషన్ కార్యాలయంలో ఆయన మీడియాకు తెలిపారు. గతంలో డీఎస్సీ ద్వారా 3 పేపర్లకు మాత్రమే రాత పరీక్ష నిర్వహించేవారని, ప్రస్తుతం 48 సబ్జెక్టులకు వేరువేరుగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ఏ పరీక్షకైనా హాజరుకావచ్చని ఆయన స్పష్టం చేశారు. 48 పరీక్షల నిర్వహణ కారణంగా సాంకేతికంగా కొన్ని ఇబ్బందులు వచ్చాయన్నారు.

అలా ఇస్తే ఇబ్బందులు తలెత్తేవికావు

హాల్‌టికెట్ల జారీ విషయంలో ఈ నెల 15న టీఎస్‌పీఎస్సీ ద్వారా సీజీజీకి లేఖ రాశామని, తాము అడిగిన ఫార్మాట్ ప్రకారం జంబ్లింగ్ చేసి హాల్‌టికెట్లు జారీ చేస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తేవికావని ఘంటా చక్రపాణి అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు సీజీజీ సహకారంతో టీఎస్‌పీఎస్సీ 89 రాత పరీక్షలు నిర్వహించిందని, గ్రూప్-1, టీఆర్టీ, గురుకుల పోస్టులకు మినహా గతంలో ఎప్పుడూ ఇబ్బంది తలెత్తలేదని తెలిపారు. టీఆర్టీ హాల్‌టికెట్లపై అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత సాధ్యమైనంత మేరకు పరీక్షా కేంద్రాలను దగ్గరి జిల్లాల్లో కేటాయించినట్లు వివరించారు. ఎస్జీటీ కేటగిరీలోని రెండు సబ్జెక్టులు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలోని బయాలజికల్ సైన్స్, మ్యాథ్స్ మినహా మిగితా పరీక్షలన్నీ సీబీఆర్టీ విధానంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ పరీక్షలన్నింటికీ హెచ్‌ఎండీఏ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కొంతమంది పనిగట్టుకొని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీబీఆర్టీ రాత పరీక్ష కేవలం ఇంజనీరింగ్ కాలేజీలు అందుబాటులో ఉన్న జిల్లాల్లో మాత్రమే నిర్వహించటం జరుగుతుందని, అందుకే ఎక్కువ మందికి హెచ్‌ఎండీఏ పరిధిలోని పరీక్షా కేంద్రాలు కేటాయించినట్లు వివరించారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుడు సి.విఠల్ మాట్లాడుతూ కొంత మంది కావాలని టీఎస్‌పీఎస్సీని బద్నాం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో కమిషన్ సభ్యులు చంద్రావతి, సాయిలు, రామ్మోహన్‌రెడ్డి, మతీనుద్దీన్, సెక్రటరీ ఎ.వాణీప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు, ఇంగ్లిష్‌లో ప్రశ్నాపత్రం ఇవ్వండి

టీఆర్టీ పీఈటీపై టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీఆర్టీలో భాగంగా నిర్వహించనున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ) పోస్టుల ప్రశ్నాపత్రాన్ని తెలుగుతోపాటు ఇంగ్లిష్ భాషలో కూడా ఇవ్వాలని బుధవారం టీఎస్‌పీఎస్సీని ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. పీఈటీ సిలబస్ ఇంగ్లిష్‌లో ఉందని, ప్రశ్నలను తెలుగులో అర్థం చేసుకోవడం కష్టమని, గతంలో నిర్వహించిన పరీక్షలకు రెండు భాషల్లో ప్రశ్నాపత్రాన్ని ఇచ్చారని నల్లగొండ జిల్లాకు చెందిన కె.వెంకటరమణతోపాటు ముగ్గురు ఇటీవల న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచందర్‌రావు ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ ఎస్‌డీఎఫ్ పెట్టి లాభం ఏంటి?

▸ నిధుల ఖర్చుపై జాతీయ ఎస్సీ కమిషన్ అసంతృప్తి

హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్సీ ఎస్‌డీఎఫ్)అమలు తీరుపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేటాయించిన నిధులు, ఖర్చు తీరును సమీక్షించి నివ్వెరపోయింది. ఎస్సీ ఎస్డీఎఫ్ ఏర్పాటు చేసి నిధులు ఖర్చు చేయకుంటే ఫలితం ఏంటని ఎస్సీ కమిషన్ అధికారులను ప్రశ్నించింది. జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కఠారియా నేతృత్వంలోని బృందం బుధవారం ప్రభుత్వ సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ఎస్సీ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించింది. 2017-18లో ఎస్సీఎస్‌డీఎఫ్ కింద రూ.14,375 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.7వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ రామ్‌శంకర్ కఠారియా, వైస్ చైర్మన్ మురుగన్, సభ్యులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పని తీరు బాగుందని కితాబిచ్చారు.



కమిషన్ చైర్మన్, సభ్యులతో డీజీపీ మహేందర్‌రెడ్డి

కాగా, అట్రాసిటీ చట్టం నమోదు ప్రక్రియలో జాప్యం కారణంగా సకాలంలో నష్టపరిహారం అందడం లేదన్నారు. కేసుల నమోదులో జాతీయ సగటుతో పోల్చితే రాష్ట్రంలో అతి తక్కువగా ఉందని మురుగన్ పేర్కొన్నారు. అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదులు, నమోదైన కేసులు, పరిహారం చెల్లింపుపై పూర్తిస్థాయి నివేదికను నెలలోగా తమకు సమర్పించాలని పోలీసు యంత్రాంగానికి స్పష్టం చేసినట్లు చెప్పారు.

నేరెళ్ల ఘటనను నీరుగారుస్తున్నారు

నేరెళ్లలో దళితులను చిత్రహింసలకు గురిచేసిన కేసును ప్రభుత్వం నీరుగారుస్తోందని జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో సిరిసిల్ల జిల్లా ఎస్పీపై చర్యలు ఎందుకు తీసుకోలేదంటూ అధికారులపై కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా ఎస్పీపై చర్యలు తీసుకోకుండా, ఇద్దరు దళిత ఎస్సైలపైనే చర్యలు తీసుకుని చేతులు దులుపేసుకుందని విమర్శించింది.

అట్టహాసంగా ముగిసిన డబ్ల్యుసిఐటి

మూడు రోజులుగా హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ ఐటి సదస్సు, నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్ అట్టహాసంగా ముగిశాయి. మూడు రోజుల్లోనూ 24 గోష్ఠులు, నిపుణుల ప్రెజెంటేషన్లు జరిగాయి. ఆధునిక టెక్నాలజీపై అవగాహన కల్పించడంతోపాటు వాటి వల్ల ప్రస్తుత ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండదని వక్తలు, విధాన కర్తలు భరోసా ఇచ్చారు. ఆయా రంగాల్లో నైపుణ్యాలు అలవరచుకుంటే నిపుణులకు ఆకాశమే హద్దు అన్న సందేశం ఇచ్చారు. ఆర్మీనియాలో యెరెవాన్ నగరంలో తదుపరి డబ్ల్యుసిఐటి నిర్వహణకు బాటన్ అందించారు. సదస్సుకు 30కి పైగా దేశాల నుంచి 1830 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారని తెలంగాణ ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ ముగింపు సందర్భంగా చెప్పారు.

తెలంగాణలో విప్రో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు

రూ.220 కోట్ల పెట్టుబడి.. 500 మందికి ఉపాధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలో మరో భారీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకానుంది. విప్రోకు చెందిన కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డివిజన్ విప్రో కన్స్యూమర్ కేర్.. తెలంగాణలో తన మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించింది. ప్రతిపాదిత యూనిట్ కోసం కంపెనీ 220 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకానుంది. ఈ యూనిట్ మూలంగా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 200 మందికి ఉపాధి లభించనుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్‌లో టాయిలెట్ సోప్‌లు, ఇతర పర్సనల్ కేర్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటి సదస్సులో భాగంగా విప్రో ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ రిషద్ ప్రేమ్‌జీని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణను ఎంచుకున్న విప్రో యాజమాన్యానికి కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో మరిన్ని వ్యాపార అవకాశాలు కూడా ఉన్నాయని, వీటిని కూడా విప్రో పరిశీలించాలని ఆయన కోరారు. తెలంగాణలో విప్రో మంచి ఉనికిని కలిగి ఉందని, నూతన మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఈ కంపెనీ ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక రంగం మరింత పురోగతి సాధిస్తుందని కెటిఆర్ పేర్కొన్నారు. టిఎస్-ఐపాస్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అనేక మెగా ప్రాజెక్టులను అనుమతులు ఇచ్చిందని తెలిపారు. పెట్టుబడిదారులకు తెలంగాణ ఫేవరెట్ గమ్యస్థానమనేందుకు విప్రో తాజా పెట్టుబడే నిదర్శనమని కెటిఆర్ పేర్కొన్నారు.



రిషద్ ప్రేమ్‌జీతో కెటిఆర్ సెల్ఫీ

జూన్‌లో టివర్క్స్ ప్రారంభం

దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ లాబ్

మార్చి 8న మహిళా ఆంత్రప్రెన్యూర్ల హబ్ ప్రారంభం

డబ్ల్యుసిఐటి సదస్సు ముగింపు సందర్భంగా కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే జూన్‌లో తెలంగాణలో టివర్క్స్ పేరిట ఒక పెద్ద ప్రోటో టైపింగ్ లాబ్‌ను ప్రారంభించనున్నామని తెలంగాణ ఐటి శాఖ మంత్రి కె తారకరామారావు ప్రకటించారు. మూడు రోజుల పాటు జరిగిన ప్రపంచ ఐటి సదస్సు, నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్ ముగింపు సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. టివర్క్స్ పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామని ఆయన అన్నారు. గత డిసెంబరు చివరిలో జరిగిన మహిళా ఆంత్రప్రెన్యూర్ల సదస్సులో ఇచ్చిన హామీకి అనుగుణంగా మహిళా దినోత్సవం మహిళా ఆంత్రప్రెన్యూర్ల హబ్ ప్రారంభించబోతున్నట్లు చెప్పారు.

ఒక్క నెల రోజుల వ్యవధిలోనే హైదరాబాద్ నాలుగు ప్రధాన జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు వేదిక కావడం నగరానికి పెరుగుతున్న ఆకర్షణకు నిదర్శనమని ఆయన అన్నారు. అందులో ఇటీవలే ముగిసిన మైనింగ్ సదస్సు ఒకటి కాగా ఈ రోజుతో డబ్ల్యుసిఐటి సదస్సు విజయవంతంగా పూర్తయిందని ఆయన చెప్పారు. ఈ సదస్సు భారత్‌కు రావడం ఇదే ప్రథమమని, దీనికి సమాంతరంగా ఎన్ఐఎల్ఎఫ్ కూడా తొలిసారిగా ముంబై వెలుపల నిర్వహించారని చెబుతూ ఈ రెండింటికీ హైదరాబాద్ వేదికయిందని ఆయన అన్నారు. కొత్త టెక్నాలజీలపై సదస్సులో విస్తృతంగా చర్చ జరగడంతో పాటు వాటిపై ప్రజల్లో గల అనుమానాలను కూడా ఆయా రంగాల నిపుణులు నివృత్తి చేశారని కెటిఆర్ చెప్పారు. డేటా సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని ఆయన అన్నారు. అలాగే ఈ నెల 26,27 తేదీల్లో జాతీయ ఇ గవర్నెన్స్ సదస్సుకు, మార్చి 8,9,10 తేదీల్లో వింగ్స్ ఇండియా పేరిట ఏవియేషన్ సదస్సుకు హైదరాబాద్ వేదిక అవుతున్నదని ఆయన తెలిపారు.

ఐటిలో మెరుగైన వృద్ధి

తెలంగాణ ఐటి రంగంలో ఎంతో పురోగమన దశలో ఉన్నదని, జాతీయ సగటు కన్నా ఐదు శాతం అధిక వృద్ధిని నమోదు చేసిందని కెటిఆర్ చెప్పారు. వచ్చే ఏడాది కూడా నాస్కామ్ ప్రకటించిన అంచనాల కన్నా మెరుగైన వృద్ధిరేటును సాధించగలమంటూ ఇందుకు ఎన్నో సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయని ఆయన అన్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండు బాగా పెరగడమే ఐటి రంగం పురోగతికి తార్కాణమని ఆయన పేర్కొన్నారు. అలాగే కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్ నగరాల్లో ఐటి హబ్‌లు నిర్మిస్తున్నామని, వాటి నిర్మాణం పూర్తయితే అక్కడ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ ఐటి హబ్‌లతో పాటు నైపుణ్యాల శిక్షణకు టాస్క్ కేంద్రాలు కూడా అక్కడ ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. టి-హబ్ రెండో దశ కూడా ఈ ఏడాది ద్వితీయార్ధంలో ప్రారంభంకానున్నదని ఆయన చెప్పారు.

తోయువాన్‌తో హైదరాబాద్ భాగస్వామ్య ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : తైవాన్‌లో ఐటి, కృత్రిమ మేధ రంగాల్లో అగ్రగామి అయిన తోయువాన్ నగరంతో హైదరాబాద్ టెక్నాలజీ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఐటి సదస్సు ముగింపు సందర్భంగా తెలంగాణ ఐటి శాఖ మంత్రి కెటిఆర్ సమక్షంలో ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, తోయువాన్ నగర బోర్డు డైరెక్టర్ రాబర్ట్ హువాంగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఐఓటి, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, ఇతర కొత్త తరం టెక్నాలజీలన్నింటికీ తోయువాన్ నగరం కేంద్రంగా ఉన్నదని, ఆ రంగాలన్నింటిలోనూ హైదరాబాద్‌కు ఆ నగరం సాంకేతిక సహకారం అందించడం ఒప్పందం లక్ష్యమని జయేష్ రంజన్ చెప్పారు. స్థానిక ప్రభుత్వాల సహకారంతో తోయువాన్‌కు చెందిన కంపెనీలు తెలంగాణలోను, తెలంగాణకు చెందిన కంపెనీలు తోయువాన్‌లోను తమ కార్యకలాపాలు ప్రారంభించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఇందులో స్టార్టప్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ప్రధానమైనదని, ఈ కార్యక్రమం కింద తోయువాన్ నగరంలోని స్టార్టప్‌లు తయారుచేసిన ఉత్పత్తులేవైనా తెలంగాణకు పనికొస్తాయని భావిస్తే వాటిని ఇక్కడ పరీక్షిస్తామని ఆయన అన్నారు. అలాగే టిహబ్ నిర్వహణలోని టి బ్రిడ్జ్ కార్యక్రమం కింద తోయువాన్ స్టార్టప్‌లకు మార్కెట్ వ్యూహాలు, మెంటార్‌షిప్, నిధుల కల్పన వంటి వసతులు అందిస్తామని ఆయన తెలిపారు. విద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలు గల తెలంగాణ తోయువాన్ నగరంలోని విద్యా సంస్థలకు పరిశోధన, అభివృద్ధి విభాగంలోను, ఫ్యాకల్టీ శిక్షణలోను సహకారం అందిస్తుందని, ఉభయ నగరాలు పరస్పరం విద్యార్థుల సందర్శనలు ఏర్పాటు చేస్తాయని జయేష్ అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, వాటితో తయారుచేసిన ఉత్పత్తులతో ఉమ్మడి ప్రదర్శనలు ఏర్పాటు చేసే విషయం కూడా పరిశీలిస్తామని ఆయన చెప్పారు.



అవార్డు గ్రహీతలతో కెటిఆర్, బివిఆర్ మోహన్ రెడ్డి, జయేష్ రంజన్

ఆర్‌బిఐ అప్పుడే చెప్పింది..

బంగ్లాదేశ్‌లో స్విఫ్ట్ హ్యాకింగ్‌తో 524 కోట్ల దోపిడీ.. పాతకాలం కంప్యూటర్లతో ఆలస్యమైన అప్‌గ్రేడేషన్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ సర్వర్ నుంచి రూ.524 కోట్లు హ్యాకర్లు దోచుకున్న నేపథ్యంలో 2016లో భారతీయ రిజర్వుబ్యాంకు అప్రమత్తమైంది. అంతర్జాతీయ లావాదేవీలకు బ్యాంకులు ఉపయోగించే స్విఫ్ట్ వ్యవస్థలో లోపాలున్నాయని, అదనపు భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని భారతీయ బ్యాంకులను హెచ్చరించింది హ్యాకర్లు బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ సర్వర్‌లో ప్రవేశించి, స్విఫ్ట్ వ్యవస్థ ద్వారా వందల కోట్ల సొమ్మును చిటికెలో విదేశాలకు తరలించారు. ఈ నేపథ్యంలో స్విఫ్ట్ వ్యవస్థను కోర్ బ్యాంకింగ్ వ్యవస్థకు అనుసంధానం చేయాలని ఆర్‌బిఐ దేశీయ బ్యాంకులను ఆదేశించింది. నిజానికి బంగ్లా సెంట్రల్ బ్యాంకు హ్యాకింగ్ జరిగిన సమయంలోనే నీరవ్ మోదీ కుంభకోణం పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరుగుతోంది. భారతదేశంలోని చాలా బ్యాంకుల కంప్యూటర్లు అప్‌గ్రేడ్ కాకపోవడంతో వాటిలో స్విఫ్ట్ పనిచేసే అవకాశం లేదు. దాంతో స్విఫ్ట్ ఎంట్రీలు సమాంతరంగా బ్యాంకింగ్ సర్వర్‌లో నమోదుకావడం లేదు. పశ్చిమ దేశాల్లో నేరుగా స్విఫ్ట్ మెసేజ్‌లు పంపడం ఉండదు. బ్యాంకు సర్వరు, స్విఫ్ట్ వ్యవస్థ ఒకేసారి సమాంతరంగా పని చేస్తాయి.



బ్యాంకర్లతో ఆర్థిక శాఖ భేటీ

నీరవ్ మోదీ దెబ్బకు పిఎన్‌బికి ఇతర బ్యాంకులకు మధ్య తలెత్తిన చెల్లింపుల వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పిఎన్‌బి పేరుతో జారీ అయిన బోగస్ ఎల్ఓయులతో విదేశాల్లోని ఇతర బ్యాంకుల శాఖల నుంచి నీరవ్ మోదీ 11,400 కోట్ల రూపాయలను కొల్లగొట్టిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని ఇప్పుడు పిఎన్‌బి తమకు చెల్లించాలని ఆయా బ్యాంకులు డిమాండ్ చేస్తున్నాయి. ఎల్ఓయులు బోగస్‌వికావడం వల్ల తమకు సంబంధం లేదన్న వాదన పిఎన్‌బిఐ తెరపైకి తెచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాంకుల మధ్య వివాదం ముదరకుండా సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది.

ఎన్నారైగా మారినట్లు బ్యాంకులకు తెలుసు

నీరవ్ మోదీ 2017లోనే భారతీయుడి హోదా నుంచి ఎన్నారైకు మారారు. ఆ విషయాన్ని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద నమోదు కూడా చేశారు. ఆయన చిరునామా దుబాయ్‌కి మార్చుకున్నారు. ఇవన్నీ తెలిసే బ్యాంకులు తాజాగా నీరవ్ మోదీకి రుణాలు ఇచ్చినట్లు అర్థమవుతోంది. 11,400 కోట్లు ఇచ్చే ప్రసక్తే లేదని నీరవ్ మోదీ చెబుతుండగా, 2జీ కేసు, బోఫోర్స్ కేసు, ఆరుషి కేసులాగే ఈ కేసు కూడా కొట్టివేతకు గురవుతుందని ఆయన తరఫు న్యాయవాది విజయ్ అగరాల్ బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

ఆందోళన వద్దు. ఖాతాదారులకు పిఎన్‌బి భరోసా

స్వయంగా భారత ప్రభుత్వమే అండగా ఉండటం, చాలినంత మూలధనం ఉండటం వల్ల ప్రస్తుత 11,400 కోట్ల రూపాయల స్కామ్ కారణంగా బ్యాంకు భవిష్యత్తు గురించి ఆందోళనపడాల్సిన అవసరం లేదని పిఎన్‌బి తన కస్టమర్లకు భరోసా ఇచ్చింది. ట్విటర్‌లో కస్టమర్లకు భరోసా ఇస్తూ, ప్రభుత్వ బ్యాంకు కావడం, కాసా డిపాజిట్లు భారీగా ఉండటం, 123 ఏళ్ల చరిత్ర, బలమైన బ్రాండ్ ఇమేజ్ బ్యాంకుకున్న సానుకూలతలని వెల్లడించింది.

బడుగు వర్గాల అభ్యున్నతికే టెక్నాలజీ

టెక్నోక్రాట్‌లకు కెటిఆర్ సూచన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఏ టెక్నాలజీ అయినా బడుగు వర్గాలకు ఉపయోగపడేది కావాలని తెలంగాణ ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావు సాంకేతిక నిపుణులకు సలహా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా 450 కోట్ల మంది బడుగు వర్గాల ప్రజలున్నారని, వారికి ప్రయోజనం చేకూర్చినప్పుడే ప్రభుత్వాలకైనా, సాంకేతిక నిపుణులకైనా సార్థకత చేకూరుతుందని ఆయన చెప్పారు. బుధవారం నాస్కామ్ సోషల్ ఇన్నోవేషన్ ఫోరమ్ (ఎన్ఎస్ఐఎఫ్) అవార్డుల సభలో ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు అందచేశారు. ఎంతో చిన్న దేశం అయినా ఫిన్లాండ్ ఆహార ఇన్నోవేషన్‌లో అగ్రస్థానంలో ఉన్నదని, సమాజంలోని అట్టడుగు వర్గాలకు టెక్నాలజీ సహాయంతో ఆహారభద్రత కల్పిస్తున్నదని, అందరికీ ఆ దేశం ఆదర్శం కావాలని ఆయన సూచించారు. సమాజం విద్య, ఆహారం, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో పలు సవాళ్లు ఎదుర్కొంటున్నదని, ఆ సమస్యలన్నింటికీ టెక్నాలజీలే పరిష్కారం చూపించాలని ఆయన సూచించారు. సమాజానికి ఉపయోగకరమైన టెక్నాలజీలు రూపొందించిన ఔత్సాహికులకు అవార్డులను ఎన్ఐఎస్ఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్ సిన్హా ప్రకటించారు. అత్యుత్తమంగా ఎంపికైన నాలుగు ఇన్నోవేషన్ల రూపకర్తలకు 40 లక్షల రూపాయల గ్రాంటును ఐటి కంపెనీ ఎంఫసిస్‌తో కలిసి ఎన్ఐఎస్ఎఫ్ అందించనున్నదని ఆయన చెప్పారు. ఇది కాకుండా వారికి ఎన్ఐఎస్ఎఫ్‌కు చెందిన నిపుణులు మెంటారింగ్ చేస్తారని, దాని విలువ మరో 20 లక్షల రూపాయల వరకు ఉంటుందని ఆయన తెలియచేశారు. విద్యారంగంలో పై జామ్ ఫౌండేషన్, సాజా, యాక్సెసిబులిటీ విభాగంలో బ్లాంక్ సొల్యూషన్స్, థింకర్‌బెల్ లాబ్స్, హెల్త్‌కేర్‌లో ఎంపథీ డిజైన్ లాబ్స్, ఎపోకేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో దనామోజో, డొనేట్ కార్ట్, పర్యావరణ విభాగంలో స్ట్రాటా ఎన్విరో, సామాజిక సమస్యల విభాగంలో కర్మ ఆన్‌లైన్ వెంచర్స్‌కు అవార్డులు లభించాయి.

ఫార్మా కంపెనీలతో అధిక కాలుష్యం

టిఎస్ఐఐసి వైస్ చైర్మన్ ఇవి నర్సింహా రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఫార్మా, రసాయనాల తయారీ పరిశ్రమలే అత్యధికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాలకల్పన సంస్థ (టిఎస్ఐఐసి) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇ వెంకట నర్సింహా రెడ్డి అన్నారు. వ్యాపారంలో నైతిక విలువలు చాలా కీలకమని, పారిశ్రామికవేత్తలు లాభాలను పెంచుకోవడంపైనేకాకుండా పర్యావరణం పట్ల బాధ్యత కూడా వహించాలని అన్నారు. చాలా పారిశ్రామిక పార్కుల్లో తగిన స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవని, ఫలితంగా పారిశ్రామిక కాలుష్యం పెరిగేందుకు కారణమవుతున్నట్టు ఆయన చెప్పారు. దీని వల్ల సొంత పరిశ్రమ మనుగడకు కూడా సమస్య ఏర్పడుతుందని చెప్పారు. ప్రతి పారిశ్రామికవేత్త కూడా ఘన, ద్రవ, హానికర వ్యర్థాల మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన ప్రణాళికపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. బుధవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పారిశ్రామిక మండళ్ల సమాఖ్య (ఎఫ్‌టాప్సీ) 'పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ'పై సెమినార్ నిర్వహించింది. ఇందులో వెంకటనర్సింహా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్, ప్రొఫెసర్ కె పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బయోఏషియా

» మూడు రోజుల పాటు నిర్వహణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నేటి నుంచి బయో ఏషియా సదస్సు జరగనుంది. 15వ విడతగా నిర్వహిస్తున్న ఈ సదస్సు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి)లో మూడు రోజుల పాటు జరుగుతుంది. ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. ఈ సదస్సులో 55 దేశాల నుంచి 1,500 మంది ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 100 మంది వరకు వక్తలు, 500 మంది కార్పొరేట్లు ఉండనున్నారు. ఇదే సరైన సమయం అన్న థీమ్‌తో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో హెల్త్‌కేర్, బయోటెక్, ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఐటి, అకాడెమియా, స్టార్టప్స్ ఎలాంటి వ్యూహాలను అనుసరించాలన్న దానిపై చర్చలు సాగనున్నాయి. ఫార్మా, లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు హైదరాబాద్ అగ్రస్థాయి గమ్యస్థానంగా మారిపోయింది. హైదరాబాద్ శివారులోని జినోమ్‌వ్యాలీలో ఆసియాలోనే అతిపెద్ద ఇన్నోవేషన్, లైఫ్‌సైన్సెస్ క్లస్టర్ ఏర్పాటైన విషయం తెలిసిందే. పరిశోధనా, అభివృద్ధి (ఆర్ అండ్ డి) క్లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఈకోసిస్టమ్ ఉన్న నేపథ్యంలో లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో ఈ రంగంలో నెలకొంటున్న మార్పులు, అవకాశాలపై బయో ఏషియా సదస్సులో కీలక చర్చలు జరగనున్నాయి.

అమెరికన్ గ్రీన్ కార్డు కోసం ఇబి-5 ఇమ్మిగ్రేషన్ ఇన్వెస్ట్ ప్రోగ్రామ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్ కార్డు పొందాలనుకునే భారతీయులకు ఇబి-5 ఇమ్మిగ్రేషన్ ఇన్వెస్ట్ ప్రోగ్రామ్ చక్కని అవకాశమని న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ (ఎన్‌వైఐ ఫండ్) ప్రతినిధి అరుణ్ నందా తెలిపారు. బుధవారంనాడిక్కడ జరిగిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇబి-5 ప్రోగ్రామ్ ద్వారా గ్రీన్‌కార్డు పొందగోరే వారు ఎన్‌వైఐ ఫండ్ ద్వారా ఏదేని అమెరికన్ ప్రాజెక్టులో 5 లక్షల డాలర్లు (మన కరెన్సీలో దాదాపు రూ.3.25 కోట్లు) పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. కనీసం పది మంది అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించాలి. తద్వారా దరఖాస్తుదారుకు, వారి కుటుంబ సభ్యులకు (జీవితభాగస్వామితోపాటు పెళ్లికాని 21 ఏళ్లలోపు పిల్లలందరికీ) గ్రీన్ కార్డు పొందేందుకు అర్హత లభిస్తుంది. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ గ్రీన్ కార్డు పథకంపై అవగాహన కల్పించేందుకు గురువారం హైదరాబాద్‌లోని హోటల్ ట్రైడెంట్‌లో సదస్సును నిర్వహించనున్నారు. ఈ సెమినార్‌లోకి ప్రవేశం ఉచితమే అయినప్పటికీ ఔత్సాహికులు ie@crossborders.inకు మెయిల్ చేసి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పలు వాణిజ్య, పారిశ్రామిక మండళ్లకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నట్లు క్రాస్ బార్డర్ ప్రతినిధి దులం భాస్కర్ తెలిపారు. ఎన్‌వైఐ ఫండ్‌కు క్రాస్‌బార్డర్ భారత భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

తెలంగాణలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ సేవలు

» హైదరాబాద్‌లో తొలి శాఖ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐడిఎఫ్‌సి బ్యాంక్ తెలంగాణలో బ్యాంకింగ్ సర్వీసులను ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన తొలి శాఖను బుధవారం బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవతార్ మోంగా, పర్సనల్ బ్యాంకింగ్ హెడ్ అమిత్ కుమార్ ప్రారంభించారు. దేశంలో ఇది 130వ బ్యాంక్ శాఖ. ఈ సందర్భంగా అవతార్ మోంగా, అమిత్ విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలోని 750 ప్రాంతాల్లో మైక్రో ఎటిఎంలు, 182 ఆధార్ ఆధార్ పే మర్చంట్ పాయింట్ల ద్వారా బ్యాంకింగ్ సర్వీసులు అందిస్తున్నామని చెప్పారు. తాజాగా ప్రారంభించిన శాఖ ద్వారా పూర్తి స్థాయి బ్యాంకింగ్ సేవలు అందిస్తామన్నారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అథెంటికేషన్ విధానంతో నాలుగు నిమిషాల వ్యవధిలోనే సేవింగ్స్ ఖాతాను కస్టమర్లకు ఇవ్వనున్నామని తెలిపారు. వచ్చే ఆరు నెలల కాలంలో హైదరాబాద్‌లో మరో నాలుగు శాఖలను ప్రారంభించాలనుకుంటున్నామని అవతార్ మోంగా చెప్పారు. వేతనాలు పొందుతున్న వారు, వ్యాపారులు, చిన్న వ్యాపారులకు అవసరమైన అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని అమిత్ కుమార్ తెలిపారు. బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై బ్యాంక్ 7.5 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు, ప్రాపర్టీ తనఖాపై రుణాలు, వ్యాపార రుణాలు ఇవ్వడంతోపాటు వెల్త్‌మేనేజ్‌మెంట్ సర్వీసులు, ట్రేడ్, క్యాష్, ఫారెక్స్ సొల్యూషన్లను ఈ బ్యాంకు అందిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బ్యాంక్ కస్టమర్ల సంఖ్య 24 లక్షల వరకు ఉంది. 61 ఎటిఎంలు, 356 బిజినెస్ కరెస్పాండెంట్ శాఖలు, 13,070 మైక్రో ఎటిఎంలు, 3,423 ఆధార్ పే మర్చంట్ పాయింట్ల ద్వారా కస్టమర్లకు ఐడిఎఫ్‌సి బ్యాంక్ బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది.



సమావేశంలో పాల్గొన్న అవతార్ మోంగా, అమిత్ కుమార్

రెనో క్విడ్

సూపర్ హీరో ఎడిషన్ కార్లు

హైదరాబాద్ : రెనో ఇండియా భారత మార్కెట్లోకి మరో ఎంట్రీ లెవల్ స్మాల్ కారును విడుదల చేసింది. క్విడ్ సూపర్ హీరో ఎడిషన్ పేరుతో మార్వెల్‌తో కలిసి విడుదల చేసిన ఈ కార్లను రూ.9,999 చెల్లించి అమెజాన్.ఇన్‌లోని రెనో ఇండియా బ్రాండ్ స్టోర్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలి. మాన్యువల్, ఎటిఎం ఆప్షన్స్‌లో లభించే ఈ లిమిటెడ్ కార్ల ఇంజన్ సామర్థ్యం 1.0 లీటర్లు.

మార్వెల్ సూపర్ హీరోస్, ఐరన్ మాన్ అండ్ కెప్టెన్ అమెరికా పేరుతో రెండు వెర్షన్లలో ఈ లిమిటెడ్ ఎడిషన్ కార్లు లభిస్తాయి. అత్యాధునిక ఫీచర్లతో ముంబై, చెన్నైలోని రెనో ఇండియా డిజైన్ స్టూడియోస్‌లో ఈ లిమిటెడ్ వెర్షన్ కార్లను డిజైన్ చేసినట్టు తెలిపింది.



డిస్నీ ఇండియా కంట్రీ హెడ్ అభిషేక్ మహేశ్వరితో కలిసి రెనో క్విడ్ సూపర్ హీరో ఎడిషన్ కారును విడుదల చేస్తున్న రెనో ఇండియా సిఇఒ, ఎండి సుమిత్ సహాని


సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33844.86	10397.45	30585	38180	64.76	64.98
↑ 141.27	↑ 37.05	↓ 200	↓ 130	↓	↓

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

పవన్ హన్స్‌ను కొనేవారే లేరు!

వచ్చే 2-3 నెలల్లో మళ్లీ టెండర్

న్యూఢిల్లీ: హెలికాప్టర్ సేవల సంస్థ పవన్‌హన్స్‌లో ప్రభుత్వ వాటా విక్రయానికి ఆదరణ కరువైంది. పెట్టుబడుల ఉపసంహరణ (డిజినెస్ట్‌మెంట్) ప్రక్రియలో భాగంగా సంస్థలో ప్రభుత్వానికున్న 51 శాతం వాటాను అమ్మకానికి పెట్టగా.. కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వచ్చే 2-3 నెలల్లో కేంద్రం మళ్లీ బిడ్డింగ్‌లు ఆహ్వానించే అవకాశం ఉంది. పవన్ హన్స్‌లో పౌర విమానయాన శాఖకు 51 శాతం, ప్రభుత్వ రంగ ఇంధన ఉత్పత్తి సంస్థ ఒఎన్‌జిసికి 49 శాతం వాటా ఉంది. విమాన శాఖకు చెందిన వాటాతోపాటు సంస్థ నియంత్రణాధికారాన్ని ప్రైవేట్ వర్గాల చేతికి అప్పగించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం దేశీయ, విదేశీ ప్రైవేట్ సంస్థల నుంచి గత ఏడాదిలో బిడ్లను ఆహ్వానించింది. అయితే, కేవలం ఒకే బిడ్ అర్హత పొందిందని పౌర విమానయాన మంత్రి అశోక్ గజపతి రాజు వెల్లడించారు. నిబంధనల ప్రకారం.. ఒకే బిడ్ దాఖలైనప్పుడు పెట్టుబడులను ఉపసంహరించుకోలేమని, మళ్లీ బిడ్లను ఆహ్వానించడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరో రెండు మూడు నెలల్లో కొత్తగా బిడ్లను ఆహ్వానించవచ్చని, ఎక్కువ సంస్థలను ఆకర్షించాలంటే టెండర్ షరతులను కొంత సడలించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



ఎఐలో విక్రయించే వాటాపై ఏ నిర్ణయం తీసుకోలేదు: రాజు

త్వరలో ప్రైవేటీకరించనున్న ఎయిర్ ఇండియాలో ఎంత వాటా విక్రయించాలనేదానిపై ఇంకా ఏం నిర్ణయం తీసుకోలేదని పౌర విమానయాన మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. ప్రస్తుతం పన్ను చెల్లింపుదారుల సొమ్ముపై మనుగడ సాగిస్తున్న ఈ ప్రభుత్వ రంగ విమానయాన సంస్థను ప్రైవేటీకరించాలన్న ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ గత ఏడాదిలోనే ఆమోదం తెలిపింది. సంస్థలో వాటా విక్రయానికి సంబంధించి విధివిధానాల రూపకల్పనకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది కేంద్రం. ఎయిర్ ఇండియాలో మెజారిటీ వాటా (51 శాతం) ప్రైవేట్ సంస్థలకే బదిలీ చేయనున్నట్లు ఈ నెల తొలినాళ్లలో విమాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా తెలిపారు.



మరిన్ని దివాలా పిఎస్‌యుల ప్రైవేటీకరణ : నీతి ఆయోగ్

దివాలా తీసిన ప్రభుత్వ రంగ సంస్థల(పిఎస్‌యు) ప్రైవేటీకరణకు సంబంధించి మరో జాబితాను రూపొందిస్తున్నట్లు నీతి ఆయోగ్ సిఇఒ అమితాబ్ కాంత్ తెలిపారు. ప్రైవేటీకరించాల్సిన అవసరమున్న పిఎస్‌యులకు సంబంధించి ఇప్పటికే నాలుగు జాబితాలను కేంద్రానికి పంపామని, ఐదో జాబితాపై కసరత్తు జరుగుతోందన్నారు. ఆరు, ఏడో జాబితాను కూడా తయారు చేయనున్నట్లు కాంత్ వెల్లడించారు. దివాలా పిఎస్‌యుల వ్యాపార నిర్వహణ సామర్థ్యాన్ని పరిశీలించి వాటిలో ప్రైవేటీకరించాల్సిన వాటి జాబితా రూపొందించాలని ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) నీతి ఆయోగ్‌కు బాధ్యతలు అప్పగించింది.


కాగా, ఇప్పటికే 40 సంస్థల పేర్లను సూచించింది. ఈ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయంపై పెట్టుబడుల, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ డిపార్ట్‌మెంట్ (దీపం) కసరత్తు చేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2018-19) పిఎస్‌యుల్లో వాటాల విక్రయం ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మార్చి 31తో మగియనున్న 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.72,500 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటికే టార్గెట్‌ను మించి (రూ.లక్ష కోట్లు) సేకరించగలిగింది.

జియోక్స్ 'డ్యుయోపిక్స్ ఎఫ్9'

ధర రూ.6,499



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ ఫోన్ల కంపెనీ జియోక్స్ మొబైల్స్ సరికొత్త స్మార్ట్‌ఫోన్ డ్యుయోపిక్స్ ఎఫ్9ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర 6,499 రూపాయలు. 2.5 కర్వ్‌డ్ డిస్‌ప్లేతో కూడిన ఐదు అంగుళాల హెచ్‌డి ఐపిఎస్ డిస్‌ప్లే, 8 ఎంపి వెనుక కెమెరా, 1జిబి రామ్, 16 జిబి ఇంటర్నల్ మెమరీ, 1.3 గిగాహెర్ట్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్, 2500 ఎంఎహెచ్ బ్యాటరీ, డ్యూయల్ సిమ్, డ్యూయల్ ఫ్రంట్ కెమెరావంటి ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయని కంపెనీ సిఇఒ దీపక్ కబూ తెలిపారు.



బులియన్


బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,480	---	31,470	30,250	30,580
క్రితం ముగింపు	31,590	31,350	---	31,300	30,730
22 క్యారెట్లు	29,150	---	28,950	28,980	29,120
క్రితం ముగింపు	29,250	29,100	---	28,940	29,270
వెండి (కిలో)	39,400	---	39,400	39,400	41,300
క్రితం ముగింపు	39,400	39,700	---	39,500	41,400

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	72.00
కర్నూలు	75.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	80.00	అనంతపురం	72.00
గోదావరి	78.00		

లేటెల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	చిత్తూరు	403.00
వరంగల్	357.00	చెన్నై	410.00
విజయవాడ	375.00	నమక్కల్	395.00
గోదావరి	375.00	బెంగళూరు	395.00
విశాఖపట్నం	375.00	ముంబై	400.00

ఐటి షేర్ల ఊతం



సెన్సెక్స్ 141 పాయింట్లు అప్

ముంబై : పిఎన్‌బి స్కామ్ దెబ్బతో తిరోగమనంలో పడిన మార్కెట్లను బుధవారం ఐటి షేర్లు ఆదుకున్నాయి. నాస్కామ్ ప్రకటించిన ఇండస్ట్రీ ఔట్‌లుక్ ప్రోత్సాహకరంగా ఉండటంతో ఐటి షేర్లలో కొనుగోళ్లు జోరుగాసాగాయి. ఆటుపోట్ల మధ్య సెన్సెక్స్ 141 పాయింట్ల లాభంతో 33844 పాయింట్ల వద్ద ముగిసింది. పిఎస్‌యు బ్యాంకు స్టాక్స్ కూడా కోలుకున్నాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 33911 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ప్రాఫిట్ బుకింగ్ కారణంగా మళ్లీ 33702 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకినప్పటికీ ఆఖరులో మళ్లీ కోలుకుంది. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ నికరంగా 593 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 37 పాయింట్ల లాభంతో 10397 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో నిఫ్టీ 10426-10349 పాయింట్ల మధ్య కదలాడింది. ఐటి షేర్లతో పాటు టెక్నాలజీ, ఎఫ్ఎంసిజి, ఆయిల్ అండ్ గ్యాస్, ఇన్‌ఫ్రా, షేర్లకూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ఉండడం, ముడి చమురు ధర కింది చూపులు చూడటం భారత మార్కెట్‌కు కలిసొచ్చింది. ఈ నెల డెరివేటివ్స్ సెటిల్‌మెంట్‌కు గురువారం ఆఖరి రోజు కావడంతో స్పెక్యులేటర్లు షార్ట్ కవరింగ్‌కు దిగడం ఇండెక్స్‌లను ముందుకు నడిపించింది. అయితే ముందు ముందు ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

పిఎన్‌బి ఇన్వెస్టర్లకు రూ.10,900 కోట్ల నష్టం

నీరవ్ మోదీ కుంభకోణంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) షేర్లలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లు గత ఐదు సెషన్లలో రూ.10,900 కోట్లు నష్టపోయారు. బుధవారం కొద్దిగా కోలుకున్నా ఈ షేర్లలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లు ఇంకా నష్టాల్లోనే ఉన్నారు. గత వారం రోజుల్లో ఈ షేర్లు 28 శాతం నష్టపోయాయి.

బిఎస్ఇలో బుధవారం ఒక దశలో పిఎన్‌బి షేర్ల నాలుగు శాతం వరకు నష్టపోయింది. చివరికి కొద్దిగా కోలుకుని 0.47 శాతం స్వల్ప లాభంతో రూ.117.10 వద్ద ముగిసింది.

గీతాంజలి షేర్లు ఢమాల్

పిఎన్‌బి కుంభకోణంతో సంబంధం ఉన్న మెహుల్ చోక్సీ నాయకత్వంలోని గీతాంజలి జెమ్స్ కంపెనీ షేర్లలో అమ్మకాల హోరు బుధవారమూ కొనసాగింది. బిఎస్ఇలో ఈ కంపెనీ షేరు 9.85 శాతం నష్టంతో రూ.27.45 వద్ద ముగిసింది. గతంలో ఎన్నడూ గీతాంజలి జెమ్స్ షేరు ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోలేదు. దీంతో ఈ కంపెనీ షేర్లలో ఇన్వెస్ట్ చేసిన మదుపరులు గత ఆరు సెషన్లలో 56 శాతం నష్టపోయారు. ప్రస్తుతం ఈ కంపెనీ కౌంటర్‌లో అమ్మేవాళ్లే తప్ప కొనేవాళ్లు కనిపించడం లేదు.

ఈరోస్ ఇంటర్నేషనల్ షేర్లకు గిరాకీ

ఈరోస్ ఇంటర్నేషనల్ ఈక్విటీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఐదు శాతం వాటా తీసుకుంటోందన్న వార్తలతో ఆ కంపెనీ షేర్లకు మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో బిఎస్ఇలో ఈ కంపెనీ షేరు ఒక దశలో 10.77 శాతం వరకు లాభపడింది. చివరకు 4.63 శాతం లాభంతో రూ.206.85 వద్ద ముగిసింది.

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.03	68.44
పౌండ్	82.56	95.75
యూరో	72.76	84.39
ఆస్ట్రేలియా డాలర్	46.39	53.66
బహ్రెయిన్ దినార్	159.85	183.17
కువైట్ దినార్	179.03	222.85
ఒమని రియాల్	156.54	179.08
సౌదీ రియాల్	15.69	18.60
సింగపూర్ డాలర్	44.73	52.98
యుఎఇ దిరమ్	16.06	18.78

టెక్ వ్యూ

ముగింపు అనిశ్చితం

నిఫ్టీ 60 పాయింట్లకు పైగా మరోసారి పాజిటివ్‌గానే ప్రారంభమైనా డే గరిష్ఠ స్థాయిలో నిలదొక్కుకోలేక రియాక్షన్‌లో పడింది. కాని మద్దతు స్థాయి 10300 పైన బలమైన రికవరీ సాధించి చివరికి 37 పాయింట్లు లాభంతో డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ ముగిసింది. ఇది సైడ్‌వేస్ ధోరణికి సంకేతం. ఇప్పటికీ ఇండెక్స్ 20, 50 డిఎంఏల కన్నా దిగువనే ఉంది. 100 డిఎంఎ వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది.

- మరింత రికవరీ బాట పడితే నిరోధ స్థాయి 10500 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. తదుపరి టార్గెట్ 10600.
- ప్రధాన మద్దతు స్థాయి 10300. భద్రత కోసం ఈ స్థాయిలో రికవరీ తప్పనిసరి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10000.
- బ్యాంక్ నిఫ్టీ నిఫ్టీ 25000 కన్నా స్వల్పంగా దిగువన ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం బలమైన క్లోజింగ్ అవసరం.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 10500 **మద్దతు :** 10300

■ వి.సుందర్ రాజా

ఆస్ట్రో వ్యూ

ముగింపు నిస్తేజం

తిథి : ఫాల్గుణ శుద్ధ సప్తమి **నక్షత్రం :** భరణి, కృత్తిక

రోహిణి, హస్త, శ్రవణ నక్షత్ర జాతకులు, వృషభ, కన్య రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10397.45 (+37.05) 10,397.45

ట్రెండ్ మార్పు వేళలు : మధ్యాహ్నం 1.32 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై ఉదయం 11.55 గంటల వరకు అదే ధోరణిని ప్రదర్శిస్తూ తదుపరి చివరి నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్ లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.45 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10440, 10475

మద్దతు స్థాయిలు : 10320, 10285

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బ్యాంకర్లపై దర్యాప్తు జరపాల్సిందే

సిబిఐకి స్పెషల్ కోర్టు ఆదేశం
కేసు మూసివేత విజ్ఞప్తికి తిరస్కృతి

న్యూఢిల్లీ : తొలి తరం ప్రైవేట్ విమానయాన సంస్థ పారామౌంట్ ఎయిర్‌వేస్ రుణాల ఎగవేత, ఆర్థిక అక్రమాలకు సంబంధించిన కేసులో పలువురు బ్యాంకు అధికారులకు క్లీన్ చిట్ ఇస్తూ సిబిఐ దాఖలు చేసిన కేసు మూసివేత నివేదికను ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసులో పారామౌంట్ ఎయిర్‌వేస్ మేనేజింగ్ డైరెక్టర్ త్యాగరాజన్‌తోపాటు పాటు ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం రామదాస్, మరికొందరు అధికారులు కీలక నిందితులుగా ఉన్నారు. ఈ కుంభకోణంలో ఐదు ప్రభు త్వ రంగ బ్యాంకులు 442 కోట్ల రూపాయల మేర మునిగాయి. ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన 32 మంది అధికారుల ప్రమేయం పాత్ర ఈ కేసులో ఉందనడానికి ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ 32 మంది నిందితులు లేకుండా ఈ కుంభకోణానికి సంబంధించిన కుట్ర, నిధుల మళ్లింపు ఘటనల మధ్య పొంతనకుదర్చడం సాధ్యంకాదని కోర్టు వ్యాఖ్యానించింది.

ఈ కేసులో బ్యాంకర్లపై ఆరోపణలకు సాక్ష్యాలు లేవని, అందువల్ల 2012 లో ఇతర నిందితులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన చార్జ్‌షీట్‌నే తుది చార్జ్‌షీట్‌గా స్వీకరించాలని దర్యాప్తు సంస్థ కోర్టును 2014 జులైలో కోరింది. అయితే కోర్టు ఈ వాదనలను తోచిపుచ్చుతూ, అవినీతి నిరోధక చట్టం కింద బ్యాంకులు, బీమా కంపెనీ ఉద్యోగులను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతులు తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

- ఈ కేసులో ఆంధ్రాబ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియెంటల్ ఇన్సూరెన్స్‌కు చెందిన ఉద్యోగులు నిందితులుగా ఉన్నారు.

ఇదీ కేసు..

- పారామౌంట్ ఎయిర్‌వేస్ ప్రభుత్వ రంగ చమురు సంస్థల నుంచి ఇంధనం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెద్ద ఎత్తున (రూ.442 కోట్లు) బ్యాంకు గ్యారంటీలను తీసుకుంది. ఈ బ్యాంకు గ్యారంటీలను కవర్ చేసేందుకు అంతే మొత్తానికి ఒఐసిఎల్ నుంచి క్రెడిట్ ఇన్సూరెన్స్ కవర్ తీసుకుంది.
- చమురు కంపెనీలకు చెల్లింపులో పారామౌంట్ ఎయిర్‌వేస్ విఫలంకావడంతో కంపెనీలు బ్యాంకు గ్యారంటీలను సొమ్ము చేసుకున్నాయి. బ్యాంకులు బీమా కంపెనీ నుంచి సొమ్ము కోసం క్లెయిమ్‌లను దాఖలు చేశాయి.
- ఈ కేసులో పారామౌంట్ ఎండి త్యాగరాజన్, ఒఐసిఎల్ మాజీ సిఎండి రామదాస్‌తోపాటు బీమా కంపెనీ మాజీ డిజిఎం హర్షవర్ధన్, జనరల్ మేనేజర్ నీరజ్‌కుమార్, డిజిఎం చంద్రశేఖర్ టండన్ నిందితులుగా ఉన్నారు.
- బీమా సంస్థ చైర్మన్‌గా రామదాస్ 2005-20101 మధ్య తన అధికారాన్ని దుర్వినియోగం చేసి త్యాగరాజన్‌తో నేరపూరిత కుట్రకు పాల్పడి సుమారు 220 క్రెడిట్ ఇన్సూరెన్స్ పాలసీలను ఎయిర్‌వేస్ సంస్థకు జారీ చేశారు.
- ఈ క్రెడిట్ ఇన్సూరెన్స్ పాలసీలను అడ్డుపెట్టుకొని పారామౌంట్ ఎయిర్‌వేస్.. ఎస్‌బిఐ, బిఒఐ, ఇండియన్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్ నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంది. చమురు కంపెనీల నుంచి ఇంధనం కొనుగోలు, విమానాల లీజు, ఎయిర్‌పోర్ట్‌ల్లో చెల్లించే అద్దెలు.. వగైరాలకు ఈ క్రెడిట్ గ్యారంటీలను ఉపయోగించారు.

రూ.4.28 లక్షల కోట్ల పెట్టుబడి హామీలు

ఉత్తరప్రదేశ్ ఇన్వెస్టర్ సమ్మిట్‌కు అపూర్వ స్పందన



ఇన్వెస్టర్ సమ్మిట్‌లో పాల్గొన్న గౌతమ్ అదానీ, ముకేష్ అంబానీ, ఆనంద్ మహీంద్రా

లక్నో: ఉత్తరప్రదేశ్ పెట్టుబడిదారుల సదస్సుకు పారిశ్రామికవేత్తల నుంచి భారీ స్పందన లభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) చైర్మన్ ముకేష్ అంబానీ, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ, మహీంద్రా గ్రూప్ చీఫ్ ఆనంద్ మహీంద్రా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వంటి పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేల కోట్ల పెట్టుబడి హామీలు గుమ్మరించారు. మొదటి రోజునే రూ.4.28 లక్షల కోట్ల విలువైన 1,045 పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మధ్యే రూ.4.28 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, ఇన్వెస్టర్ సదస్సు తొలిరోజున అంతే మొత్తంలో పెట్టుబడులు రావడం సంతోషంగా ఉందన్నారు.

జియో ద్వారా మరో రూ.10 వేల కోట్లు: అంబానీ

రిలయన్స్ జియో ద్వారా ఉత్తరప్రదేశ్‌లో మరో పది వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు ముకేష్ అంబానీ ప్రకటించారు. జియో ద్వారా ఇప్పటికే యుపిలో రూ.20వేల కోట్లు ఇన్వెస్ట్ చేశామని, వచ్చే మూడేళ్లలో మరో రూ.10 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. వచ్చే రెండు నెలల్లో 2 కోట్ల జియో ఫోన్లను రాష్ట్ర ప్రజల కోసం అందుబాటులోకి తేనున్నట్లు, ఏడాది చివరికల్లా యుపిలోని ప్రతి గ్రామానికి జియో సేవలందిస్తామన్నారు.

ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడి: బిర్లా

వచ్చే ఐదేళ్లలో యుపిలోని గ్రూప్ వ్యాపారాల్లో రూ.25,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూపు ప్రకటించింది. తమకు అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌లో ఉత్తర ప్రదేశ్ ఒకటని ఆదిత్య బిర్లా గ్రూపు చైర్మన్ కుమార్ మంగళం బిర్లా అన్నారు.

కన్జ్యూమర్ గూడ్స్ ప్లాంట్ ఏర్పాటు: ఐటిసి

యుపిలో ఇంటిగ్రేటెడ్ కన్స్యూమర్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ఐటిసి ప్రకటించింది. మున్ముందు సంవత్సరాల్లో రాష్ట్రంలోని పర్యావరణహిత ఇంధన రంగంతోపాటు ఓ లాజిస్టిక్స్ హబ్‌లో పెట్టుబడులు పెట్టే యోచన ఉందని తెలిపింది.

రూ.10 వేల కోట్ల పెట్టుబడికి అవాడ హామీ

శుద్ధ ఇంధన ఉత్పత్తి సంస్థ అవాడ పవర్.. రూ.10 వేల కోట్ల ఇన్వెస్ట్‌మెంట్‌తో ఉత్తర ప్రదేశ్‌లో 1,600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన చేసింది. ఇందుకోసం యుపి సర్కారుతో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కూడా కుదుర్చుకుంది.

లక్నో నుంచి వైదొలగం: టిసిఎస్

లక్నో నుంచి టిసిఎస్ వైదొలగబోదని టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. అంతేకాదు, లక్నోతోపాటు యుపిలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించనున్నారు. 30వేల సీటింగ్ సామర్థ్యంతో రాష్ట్రంలో టిసిఎస్ భారీ క్యాంపస్‌ను నిర్మించనుందని ఆయన ప్రకటించారు.

దేశ సంచారి ఇంటికి తిరిగి వచ్చినట్లుంది: మహీంద్రా

దేశ సంచారి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు ఎంత సంతోషం కలుగుతుందో ఉత్తర ప్రదేశ్‌కు వచ్చిన తనకు అలాంటి భావన కలుగుతుందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. ఆ రాష్ట్రంలో 200 గదుల మహీంద్రా క్లబ్ ఏర్పాటుకు రూ.200 కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన ప్రకటించారు.

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 4.84(4.84)255
AGRO TECH FO 617.65(626.7)3162
AISHWARYA TE 6.37(6.37)4882
ALPHAGEO (I) 816.2(818.05)1047
ALU FLUORIDE 108.3(112.95)16513
AMAR RAJA BA 797.2(807.3)14315
ANDHRA BANK 45.8(46.6)159047
ANDHRA CEMEN 10.97(11.05)18361
ANDHRA PETRO 57.8(56.95)52136
ANJANI PORTL 190.05(192.5)135
ASTRA MICRO 89.9(95.55)222913
AUROB.PHARMA 570.8(574.1)190497
AVANTEL LTD 537.35(559.6)6697
AVANTI FEEDS 2336(2315.3)7433
B.N.RATHI SE 40.05(40.3)2367
BALAJI AMINE 653.4(662.2)2862
BAMBINO AGRO 242.95(243.65)211
BARTRONICSIN 12.87(13.01)3236
BHAGIRA.CHEM 293.15(285.9)2001
BHAGYA INL 42.75(43.75)14983
BHARATFIN 972.2(988.45)19924
BNR UDYOG 32.4(32.5)41
CAMBRIDGE 73.85(75.35)284
CCHHL 14.15(13.9)11930
CCL PRODUCTS 281.25(281.8)3032
CELESTIAL 17.9(18.05)3234
CIL SECURITS 29.85(30.9)433
COROM INTER 508.2(511.25)3674
CUBEX TUBING 23.35(22.25)2200
CYBERMATE 3.25(3.1)34492
CYIENT 630.15(612.95)9866
DANLAW TECH. 65.35(67.05)21358
DECAN CEMENT 564.35(565.9)782
DECCAN POLYP 3(3)40
DHAN ROTO SP 53.55(51)9220
DIAMONPOWER 13.65(14.1)37540
DIVI'S LAB. 1008.5(1013.1)43349
DIVYA.GRANIT 100.4(99)845
DQ ENT 14.7(14.7)26055
DR.REDDY'S 2168.8(2162.15)35276
EMPEE SUGARS 4.13(4.21)7480
EVEREST ORG. 140.65(137.75)2569
FACOR ALLOYS 3.17(3.28)165040
FIRSTOBJ 13.85(13.85)51
GATI LTD. 113.3(112.65)69420
GAYATRI BIO 9(9.95)800
GAYATRI PROJ 214.6(215.95)8075
GENNEX LAB 4.26(4.44)240697
GMR INFRASTR 17.35(17.7)1634203
GODAVARI DRU 36.75(35)4514
GOLDST INFRA 198.55(192.3)56680
GOLDSTONE EN 13.85(13.5)9106
GRANULES (I) 114.7(116.25)98916
GVK POWERINF 16.75(17.45)804585
HBL P SYS 55.65(55.65)49056
HERITGFOOD 679.25(684.9)1118
HIND.FLUROCA 14(14.73)500
I.C.S.A. IND 3.51(3.69)5951
IKF TECHNO .72(.75)123727
INCAP LTD. 92(93.95)1483
IPAPPM 312.25(314.9)6633
IVRCL LTD 4.59(4.49)114782
KAKATIYA CEM 290.1(293.4)15978
KALLAM SPG. 30.8(29.55)150468
KAVERI SEED 468.35(473.6)16606
KCP LTD 127.3(127.35)7252
KERNEX MICRO 42.1(43)1023
KNR CONST 297.75(307.8)9867
KREBS BIOCHM 153.65(155.05)3331
LANCO INFRA 1.2(1.15)1217808
LOKESH MACH 65.05(65.25)3627
LOTUS CHOC 50.95(50)735
MADHUCON PRJ 27.6(27.85)9251
MOLD-TEK TEC 61.65(60.85)4710
MOSCHIP SEMI 33.15(33.65)58781
MSR INDIA 45.7(43.6)7437
N C L IND. 232.15(233.9)3441
NACLIND 43.1(43.75)8476
NATCO PHARM 776.9(784.95)28425
NCC 123.4(123.75)313226
NEHA INTER. 7.7(7.75)4953
NETTLINX LTD 82.8(86.05)30894
NEULAND LAB. 703.25(717)992
NIHAR INFO 14.8(14.5)550
NILE LTD. 822.95(832.1)2866
NTL 3.99(3.9)7681
OIL COUNTRY 43.35(42.55)2166
PADMALAYA TE 4.95(5)14178
PALRED 95.05(93.2)2406
PANYAM CEMEN 48.15(48.35)7187
PENNAR STEEL 59.25(61.75)46057
PFL INFOTECH 9.72(10.23)5903
PHYTOCHEM I. 65.6(64.95)3399
PITTI LAMIN. 91.1(92.55)8473
POKARNA LTD 210.7(211.95)3059
PRAJAY ENGS. 12.9(12.3)34489
PREMIER EXPL 390.55(392.6)182
PRISM CEMENT 124.65(122.95)126548
RAIN 383.6(376.65)554776
RAJ PACKAGIN 38.2(37.75)120
REG.CERAMIC 5.92(5.69)425
RESTILE CER. 7(7)1286
SAGAR CEM. 961.15(972.5)202
SAMKRG PIST. 300(298.1)6216
SAMPRE NUTRI 53.3(56)1729
SANGHI IND. 112.4(113.55)17033
SATVAH.ISPAT 21.15(19.25)12406
SAVEN TECHNO 19.9(19.6)51
SMPL 1.37(1.43)12502
SMS PHARMACE 89.75(90.3)2628
SREE RAYALA 170.65(170.75)2113
STEEL EXCH 29.6(31.1)29745
SUJANA INDUS .94(.94)67786
SURANATP 5.17(5.43)13513
SURYACHAKRA 1.2(1.26)44083
SURYAMBA SP 74.05(76.85)650
SURYAVA SPIN 6.1(6.39)2010
SURYLAK.COTT 80.5(81.05)4933
SUVEN LIFE S 190.45(191.1)28687
TAJ GVK HOTL 164(163.5)3200
TANLA 30.6(30.7)17855
TRANSCORP IN 34.7(33.1)22609
TRANSGENE BI 2.28(2.23)20191
TRANSPORT CO 286.55(280.3)2294
USHER AGRO 6.42(6.54)1972
VICEROY HOTE 15.6(15.85)40376
VIJAY TEXTIL 53(51.25)576
VIMTA LABS 205.9(204.55)2065
VIRAT CRANE 50(52.5)3066
VIRINCHI 117.45(117.2)35038
VISAKA IND. 677.15(670.55)10446
VISTA PHARMA 41.5(42.3)41283
VIVIMED LABS 78.05(79.6)63967
VST INDUS. 3199.6(3300)692
WATERBASE 310.5(313.8)143698
XLENERGY 3(3.05)2050
YBRANTDIGI 5.43(5.41)150280
ZEN TECH 118.05(118.35)21694
ZENOTECH 44.3(45.45)8676

‘సారస్’ పరీక్షలు సక్సెస్

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):దేశంలోనే అత్యాధునిక రవాణా విమానం సారస్ రెండో పరీక్షా విన్యాసాలు బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయంలో బుధవారం విజయవంతంగా జరిగాయి. హెచ్ఏఎల్ ఉన్నతాధికారులు, సైనిక అధికారులు ఈ విన్యాసాలను తిలకించారు. బెంగళూరులోని నేషనల్ ఏరోస్పేస్ ల్యాబరేటరీ శాస్త్రవేత్తలు ఈ విమానాన్ని అభివృద్ధి చేశారు. ఉత్పాదనా మోడల్ డిజైన్ జూలై నాటికి సిద్ధం కావచ్చునని భావిస్తున్నారు. తొలివిడతగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కోసం 15 సారస్ విమానాలను రూపొందించనున్నారు.

పీఎంఎల్ఎన్ అధినేతగా షరీఫ్ కొనసాగలేరు: పాక్ సుప్రీం కోర్టు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 21: పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాక్ సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో ఆయన ఇక ఏమాత్రం పీఎంఎల్-ఎన్ పార్టీకి అధ్యక్షత వహించలేరు. దీంతో ఇక ఆయన రాజకీయ జీవితం క్లిష్ట పరిస్థితుల్లో పడినట్లయింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 62, 63 నిబంధనల ప్రకారం అనర్హతకు గురైన వ్యక్తి ఒక రాజకీయ పార్టీకి నాయకత్వం వహించలేడని పాక్ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత ఏడాది పనామా పేపర్ల కేసు నేపథ్యంలో షరీఫ్ తన జీతాన్ని ప్రకటించడంలో విఫలమైనందుకు ఆర్టికల్ 62 కింద షరీఫ్ అర్హత కోల్పోయారని కోర్టు తెలిపింది.

ప్రియా ప్రకాశ్‌పై కేసులొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కన్నుకొట్టే వీడియోతో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన నటి ప్రియా ప్రకాశ్ వారియర్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మలయాళ సినిమా ‘ఒరు అదార్ లవ్’లో ఆమె నటించిన ఓ పాట ముస్లింల మత విశ్వాసాలను కించపరిచేలా ఉందంటూ వివిధ రాష్ట్రాల్లో నమోదైన కేసుల విచారణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా దర్శకుడికి కూడా ఇవే ఉత్తర్వులు వర్తిస్తాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం నమోదైన కేసుల్లో విచారణను నిలిపివేయడమేగాక ప్రచార వీడియోపై ఇకమీదట ప్రియపై, సినిమా దర్శకుడిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయొద్దని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.

మానస సరోవర యాత్రకు దరఖాస్తులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కైలాస మానస సరోవర యాత్ర కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. సిక్కింలోని నాథులా పాస్, ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ మార్గాల గుండా సాగే ఈ యాత్రకు https://kmy.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 23వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విదేశీ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. జూన్ 8న ప్రారంభమయ్యే ఈ యాత్రకు లిపులేఖ్ పాస్ మార్గంలో రూ.1.6 లక్షలు, నాథులా పాస్ మార్గంలో 2 లక్షలు ఖర్చవుతుందని పేర్కొన్నది.





వేదికపై కేజ్రీవాల్, కమల్.. బహిరంగ సభకు తరలివచ్చిన జనం

దక్షిణాదే ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. పార్టీ జెండాలో ఉన్న ఆరు చేతులు దక్షిణాదిలోని ఆరు రాష్ట్రాలకు గుర్తు అని, నడుమనున్న నక్షత్రమే ప్రజలని వివరించారు. ఈ కార్యక్రమానికి ‘ఆప్’ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా హాజరై, కమల్‌కు సంఘీభావం ప్రకటించారు. “ఓటును అమ్ముకుని ఏళ్ల తరబడి కష్టాలపాలవుతున్న ప్రజలను గట్టెక్కించేందుకే రాజకీయ పార్టీని ప్రారంభించాను” అని కమల్ ఉద్వేగభరిత ప్రకటన చేశారు. 37 సంవత్సరాలపాటు తన అభిమాన సంఘాలు ప్రజలకు సేవ చేసి రాటు దేలాయని, తన వెంట నడిచేందుకు లక్షలాదిమంది అభిమానులు,కార్యకర్తలున్నారని తెలిపారు.వారి అండతోనే ధైర్యం గా పార్టీని ప్రారంభించానన్నారు. “రాష్ట్రంలో అవినీతి, అక్రమాలను చూసి లోలోపల రగిలిపోయినా... అవన్నీ మనకెందుకులే అనుకుంటూ అభిమాన సంఘాలతో ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగించాను. అయినా అభిమాన సంఘాల సేవలకు పాలకులు అడ్డంకులు సృష్టించారు. అవన్నీ గత గతః అని మరచిపోయినా, వాటి వల్ల కలిగిన బాధను గుర్తు పెట్టుకోవాల్సిందే. అవినీతిపరుల బండారం బయటపడే రోజు దగ్గరపడుతోంది. ప్రజల ఆశలను నెరవేర్చాలన్న తపనతోనే పార్టీని పెట్టాను. అవినీతిని చూస్తూ మూగవాళ్లుగా ఊరుకోకూడదనే దృఢ నిర్ణయానికి వచ్చాను” అని కమల్ ఉద్ఘాటించారు. తొలిరోజు సభలో ప్రచారం ఎందుకులే అనుకున్నానని, అయితే... కేజ్రీవాల్ తన మాటలతో కొత్త పార్టీ వేగం పెంచారని కమల్ తెలిపారు. ‘పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎనిమిది గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తాం. ఆ తర్వాత మన సత్తా ఏమిటో తెలుస్తుంది’ అని తెలిపారు. కావేరీ జలాల వివాదాన్ని కూడా కమల్ హాసన్ ప్రస్తావించారు. “ఇప్పటిదాకా నీటి కోసం పగలు, కక్షలు పెంచుకున్నారు. ఇరుపక్షాలు చర్చలు జరుపుకొంటే కావేరీ జలాలే కాదు... కర్ణాటక నుంచి రక్తాన్ని కూడా తెప్పించగలం” అంటూ, రక్తమంటే రక్తదానం అని వివరణ ఇచ్చారు.

కమల్ కొత్త చరిత్ర: కేజ్రీవాల్

విశ్వనటుడు కమల్ హాసన్‌కు తమిళ ప్రజల అండ పుష్కలంగా ఉందని, అశేషంగా తరలివచ్చిన ప్రజానీకాన్ని చూస్తుంటే ఈ విషయం అవగతమవుతోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. “మేం పార్టీ పెట్టిన ఏడాదిలోపే ఢిల్లీ ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను కాదని మాకు అధికారం అప్పగించారు. ఇప్పుడు తమిళనాడు ప్రజల స్పందన చూస్తుంటే ఢిల్లీ ప్రజల రికార్డును బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. నేను కమల్‌హాసన్‌కు వీరాభిమానిని.” అని కొనియాడారు. కార్యక్రమానికి స్వయంగా హాజరుకాలేకపోయిన కేరళ సీఎం పినరయి విజయన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశమిచ్చారు.

ప్రజల ప్రశ్నలకు సమాధానాలు

ప్రసంగం అనంతరం కమల్.. ప్రజల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ‘ఈ కలాం ఏంటి? రామేశ్వరం ఏంటి?’ అన్న ప్రశ్నకు.. ‘రామేశ్వరంలో కలాం! అందుకే వచ్చాను. మంచి ఎక్కడ ఉంటుందో అదే తనకు దైవం’ అని పేర్కొన్నారు. ‘అంబేద్కర్, గాంధీజీ, అన్నాదురై, కామరాజర్.. వీరిలో ఎవరంటే మీకిష్టం?’ అన్న ప్రశ్నకు.. “నేను నాస్తికుణ్ని. మీరు దేవుళ్లను ఎలా పూజిస్తారో, నేను కూడా అంబేద్కర్, గాంధీజీ వంటి వారందరినీ ప్రేమిస్తా. చంద్రబాబు, కేజ్రీవాల్, విజయన్ కూడా నాకిష్టమే” అని తనదైన శైలిలో సమాధానమిచ్చారు. సభ ముగిసిన అనంతరం ప్రజలు కరతాళ ధ్వనులు చేయడానికి భిన్నంగా.. వేదికపై ఉన్న నేతలే చప్పట్లు కొడుతూ ప్రజల్ని అభినందించారు. కమల్ పార్టీ ప్రారంభోత్సవానికి సుమారు 10వేల మంది హాజరయ్యారు. వేదికపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఢిల్లీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి, రైతు సంఘం నిర్వాహకుడు పీఆర్ పాండ్యన్ తదితరులు ఆసీనులయ్యారు.

చంద్రబాబు నా హీరో: కమల్

ఏపీ సీఎం చంద్రబాబు తన హీరో అని కమల్ హాసన్ పేర్కొన్నారు. ఆయన దేశంలోనే ఆదర్శ పాలకుడని.. అనుకున్నది సాధించే పట్టుదల ఉన్న నాయకుడని కొనియాడారు. రామేశ్వరంలో కమల్ మాట్లాడుతూ చంద్రబాబు మంగళవారం రాత్రి తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారని వెల్లడించారు. తాను కమల్ అభిమానినని, మదురై సభకు రాలేకపోతున్నానని చెప్పారని అన్నారు. ‘మీ కార్యాచరణను ప్రారంభించండని ఆయన నన్ను ప్రోత్సహించారు. మీ సిద్ధాంతాలు, నా సిద్ధాంతాలు వేర్వేరు. అయినా నేను మీ వీరాభిమానినని ఆయనకు చెప్పాను. ప్రజలకు ఏది అవసరమో అదే చేయండి.. సంక్షేమ పథకాల జాబితా సిద్ధం చేసుకోండని సూచించారు. ఆయన అలా చెప్పడం నాకెంతో మనోధైర్యాన్నిచ్చింది. నాలో పట్టుదల రేపింది. ఆయన దేశంలోనే ఆదర్శ పాలకుడు. అనుకున్నది సాధించే పట్టుదల ఉన్న వ్యక్తి. మంచి సిద్ధాంతాలున్న మహనీయుడు. చంద్రబాబు మాటలు శిరసావహిస్తాను’ అని కమల్ పేర్కొన్నారు.

రియల్ ‘నాయకన్’ కావాలి: కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రజ్యోతి: ‘నాయకన్’ సినిమాలో అద్భుతంగా నటించిన కమల్ హాసన్.. నిజజీవితంలోనూ ‘నాయకన్’గా రాణించాలని ఆశిస్తున్నానని తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. కొత్త పార్టీని ప్రకటించిన సందర్భంగా కమల్‌కు శుభాకాంక్షలు చెబుతూ బుధవారం ట్వీట్ చేశారు. ‘మధురైలో జరిగే మీ పార్టీ ప్రారంభోత్సవానికి నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు. అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవానికి రాలేకపోతున్నాను. కొత్త ఇన్నింగ్స్‌లోను మీరు రాణించాలి. రీల్ నాయకన్ గానే కాదు... రియల్ నాయకన్ గాను మీరు రాణిస్తారని ఆశిస్తున్నాను’ అని కేటీఆర్ పేర్కొన్నారు. దీనిపై కమల్ స్పందించారు. ‘థాంక్యూ కేటీఆర్‌జీ. ఈ రోజు మిమ్మల్ని మిస్ అయ్యాను. భవిష్యత్‌లో మా పార్టీ కార్యక్రమాలకు హాజరవుతారని ఆశిస్తున్నాను. మీ బిజీ షెడ్యూల్ మధ్య మాకు కొంత సమయం కేటాయించండి’ అని జవాబిచ్చారు.

బాబుపై 'ఓటుకు నోటు' కేసు లేదు: సోమిరెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఓటుకు నోటు కేసు ఉందని వైసీపీ చేస్తున్న ఆరోపణ అబద్ధమని ఆ రాష్ట్ర వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయనపై ఏ కేసూ లేదని బుధవారం సచివాలయంలో విలేకరులకు చెప్పారు. దీనిపై వైసీపీ నేతలు వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిందని, ఫోను సంభాషణలో చంద్రబాబు మాట్లాడినట్లుగా చెబుతున్న దాంట్లో ఏ తప్పూ లేదని హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించారని ఆయన తెలిపారు. ఏ కేసూ లేనప్పుడు తాము ఎవరికైనా ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. 14 చార్జిషీట్లు నమోదై ఉన్న జగన్ భయపడాలి తప్ప తాము ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 'ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేమన్నారు.. హోదాతో సమానమైన ప్రయోజనాలన్నారు.. కానీ ఏమీ ఇవ్వలేదు. అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని ఏపీ ప్రజలు క్షమించరు' అని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని టీడీపీ ఎంపీలు పార్లమెంటులో ప్రధాన మంత్రి సాక్షిగా మాట్లాడితే.. జగన్ సొంత మీడియా కేంద్ర బడ్జెట్‌ను భగవద్గీతతో పోల్చిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంలోని బీజేపీ నాయకుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉందని వ్యాఖ్యానించారు. వారు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నారని, ఢిల్లీ వెళ్లి పోరాటమూ చేయలేకపోతున్నారని అన్నారు.

కేంద్ర సాయంపై ఢిల్లీలో భేటీ లేదట!

అమరావతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సాయంపై జరగాల్సిన చర్చల విషయం మళ్లీ మొదటికి వచ్చింది. 'శుక్రవారం మాట్లాడుకుందాం రండి' అని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ గతంలో పిలుపు పంపింది. విభజన చట్టంలోని 9, 10, 13 షెడ్యూళ్లలోని సంస్థలకు సంబంధించిన వివాదాల పరిష్కారంపై చర్చించడమే ఈ భేటీ ఉద్దేశం. అయితే... ఏపీకి సంబంధించిన సహాయంపైనా ప్రత్యేకంగా చర్చించేందుకు వీలుగా అన్ని వివరాలు తీసుకురావాలని కేంద్రం సూచించింది. ఆయా శాఖల కార్యదర్శులందరూ సమావేశానికి హాజరుకావాలని స్పష్టం చేసింది. దీనిపై రాష్ట్ర అధికారులు పూర్తిస్థాయి కసరత్తు చేశారు. సీఎస్, కార్యదర్శులతో మంగళవారం సీఎం ప్రత్యేకంగా సమీక్ష కూడా జరిపారు. అయితే... శుక్రవారం తాను ఢిల్లీకి రాలేనని, మరోరోజున భేటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ సీఎస్ కేంద్రాన్ని కోరారు. దీంతో ఈ సమావేశాన్ని కేంద్రం వాయిదా వేసింది. ఈ పరిణామాలు ఏపీ ప్రభుత్వ వర్గాలను కొంత నిరాశ పరిచాయి.

ఆ జాబితాలను నమ్మొద్దు : ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలను నమ్మొద్దని, తాము అధికారికంగా ఎలాంటి జాబితా విడుదల చేయలేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను గందరగోళపరిచేందుకు ఎవరో కావాలని ఇదంతా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ఎలాంటి కసరత్తు జరగలేదని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. కాగా, ఖమ్మం పార్లమెంట్ స్థానం మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని పోటీ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై భట్టి స్పందిస్తూ ఈ వార్తలో నిజం లేదనీ, తాము ఆ స్థానం కోసం కాంగ్రెస్ తరపున కష్టపడి పని చేస్తున్న సీనియర్లకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నామని వివరించారు. టీఎస్ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త వేతన సవరణను ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రకటనతో టీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి నగేష్ ముదిరాజ్ గాంధీభవన్‌లో అన్నారు.

పార్టీ మారిన వారి డిపాజిట్లు గల్లంతు : జానా



అడవిదేవులపల్లి(దామరచర్ల), ఫిబ్రవరి 21 : స్వార్థం కోసం పార్టీ మారిన ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్న ఎన్నికల్లో పోటీచేస్తే డిపాజిట్లు గల్లంతు చేయాలని సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలకేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వ పనితనం మాటల్లో తప్ప.. చేతల్లో కనిపించడం లేదన్నారు.

కాంగ్రెస్.. ఓ ముసలి నక్క: కర్నె

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ పార్టీ ఒక ముసలి నక్క' అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఎద్దేవా చేశారు. బస్సు, లారీ, ట్రాక్టర్ ఇలా ఏ యాత్ర చేపట్టినా ఆ పార్టీని ప్రజలు నమ్మరని, చివరికి మోకాళ్లపై యాత్రలు చేసినా జనం పట్టించుకోరని పేర్కొన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్ అయిపోయాయని, ఇక మిగిలింది ఫైనలేనని, దాంట్లోనూ టీఆర్ఎస్సే గెలుస్తుందన్నారు.

'కొత్వాల్‌గూడ'పై విచారణ చేపట్టండి : చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొత్వాల్‌గూడ, బాచుపల్లిలో భూ మాఫియాపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బాచుపల్లిలో టీఆర్ఎస్ నేతలే దొంగ రికార్డులు సృష్టించి రూ.100 కోట్ల విలువైన భూములు తెగనమ్ముకున్నారని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు.

సీఎం గారూ.. అపాయింట్‌మెంటివ్వండి: మందకృష్ణ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంపై సీఎం కేసీఆర్‌ను కలవాలనుకుంటున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చెప్పారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు ఈటల రాజేందర్, టి.హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని మంద కృష్ణ బృందం బుధవారం కలిసింది. అనంతరం మీడియా పాయింట్ వద్ద మంద కృష్ణ మాట్లాడుతూ సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని మంత్రులను కోరామని తెలిపారు.



అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడితో తల్లిదండ్రులు

మా బిడ్డను కాపాడండి

» ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొడుకు పుట్టాడన్న సంతోషం ఆ తల్లిదండ్రులకు ఎక్కువకాలం నిలబడలేదు. పుట్టిన 6నెలలకే తమ బిడ్డకు లక్షల్లో ఒకరికి వచ్చే జీరో డర్మా, పిగ్మంటోసా అనే వింత వ్యాధి సోకడంతో వారి గుండె పగిలింది. కన్న కొడుకును ఎలాగైనా కాపాడుకోవాలని భావించిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ షఫీ దంపతులు అందినకాడల్లా అప్పులుచేసి, దాతలనుంచి సాయం పొంది రూ.5 లక్షలతో వైద్యం చేయించారు. అయినా వ్యాధి తగ్గకపోగా బాలుడు షేక్ జానీకి ఏడేళ్లు వచ్చేసరికి కేన్సర్ సోకింది. అరుదైన వ్యాధి కారణంగా షేక్ జానీ ఒళ్లంతా పుల్లుగా మారిపోయింది. ఒక కన్ను కొంతమేర పాడైపోయింది. బాలుడి పరిస్థితి తెలిసిన తమిళనాడులోని వేలూరుకు చెందిన సీఎంసీ.. వ్యాధికి చికిత్స చేసేందుకు ముందుకొచ్చింది. రూ.5 లక్షల విలువైన ఆపరేషన్‌ను రూ.లక్షన్నరకే చేస్తానని తెలిపింది. కానీ ఇప్పటికే స్తోమతకు మించి అప్పులు చేయడంతో.. చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. తమ పరిస్థితిని ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీకి విన్నవించారు. కేన్సర్ వ్యాధికి హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులు ఉచితంగా వైద్యం చేసేందుకు ముందుకొచ్చారని, సీఎంసీలో చికిత్సకు చేయూత అందించాలని వేడుకుంటున్నారు. షేక్ మునీషా, అకౌంట్ నంబరు 1787101 00058785, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఎఎన్‌డీబీ0001787 ఆంధ్రాబ్యాంక్, మిర్యాలగూడలో ఆర్థికసాయాన్ని జమ చేసి ఆదుకోవాలని దాతలను ఆయన కోరారు.

ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా మరో 4 పారిశ్రామిక పార్కులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నాలుగు ఇండస్ట్రియల్ పార్కులను ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా మార్చుచేస్తూ మునిసిపల్ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం నగర శివారుల్లోని మాదాపూర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, వరంగల్ ఇండస్ట్రియల్ పార్కులను ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా పరిగణిస్తారు. ఇప్పటికే నానక్‌రాంగూడ, గచ్చిబౌలిల్లోని ఐటీ సెజ్‌ల్లో గల ఐటీ పార్కులను ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లుగా నోటిఫై చేశారు. రాయ్‌దుర్గ్ నాలెడ్జ్‌సిటీ, మియాపూర్ ప్రాంతాలను మాదాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోకల్ అథారిటీగాను.. గాజులరామారం ఇండస్ట్రియల్ పార్కు, ఇబ్రహీంపట్నం పార్కులను కుత్బుల్లాపూర్ అథారిటీగాను.. కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం కాంపోజిట్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, వరంగల్ ఐటీ పార్కు, మడికొండ టెక్స్‌టైల్ పార్కు, కాకతీయ టెక్స్‌టైల్ పార్కులను ప్రత్యేక అథారిటీగా పరిగణించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్, నగర పంచాయితీలు, మునిసిపల్ పరిధిలోని పారిశ్రామికవాడలను ప్రత్యేక టౌన్‌షిప్‌గా పరిగణించి ఆయా ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ వీధిదీపాలు తదితర మౌలిక వసతుల కోసం ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల నుంచి ఆస్తిపన్నులు, ఇతర చార్జీల రూపంలో వచ్చే ఆదాయంలో 65 శాతం ఖర్చుపెట్టుకునేందుకు అనుమతించారు. మిగిలిన 35శాతం స్థానిక సంస్థకు చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

వనపర్తి జిల్లాలో పారిశ్రామికవాడ అభివృద్ధికి 150 ఎకరాలు

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెలుగొండ ప్రాంతంలో పారిశ్రామికవాడ అభివృద్ధి కోసం సుమారు 150 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. నూతన జిల్లాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వనపర్తి జిల్లా నుంచి అందిన ప్రతిపాదనలను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ కమిషనర్ రాజేశ్వర్ తివారీ ఆధ్వర్యంలోని కమిటీ.. వెలుగొండ పరిధిలోని సర్వే నెంబర్ 449లో గల స్థలాన్ని టీఎస్ఐఐసీకి కేటాయించింది.

కోదండతో రహస్య మైత్రి!

» అసంతృప్త టీఆర్ఎస్ నేతల డబుల్ గేమ్!

» టీజేఏసీ పెట్టబోయే పార్టీకి అండదండలు

» క్షేత్ర స్థాయిలోనూ సహాయ సహకారాలు

» ఉద్యమం నాటి సంబంధాల కొనసాగింపు

» భవిష్యత్తు రాజకీయ అవసరాలే లక్ష్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీజేఏసీ కొత్తగా ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీకి కేంద్ర బిందువుగా ఉన్న ప్రొఫెసర్ కోదండరాంతో టీఆర్ఎస్ నేతలు పలువురు రహస్య మైత్రి కొనసాగిస్తున్నారా? టీజేఏసీకి, టీజేఏసీ పెట్టబోయే పార్టీకి సహాయ సహకారాలు అందిస్తున్నారా? ఇందుకు టీజేఏసీతోపాటు టీఆర్ఎస్‌లోని విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానాలు వస్తున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టమైన మిలియన్ మార్చ్‌ను నిర్వహించిన మార్చి 10వ తేదీన టీజేఏసీ నుంచి రాజకీయ పార్టీ ప్రకటన రావచ్చనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టీజేఏసీ స్టీరింగ్ కమిటీ నిర్ణయం ప్రకారం నూతన పార్టీ ఆవిర్భావ ఏర్పాట్లు చక్కబెట్టడానికి 200 మందితో కమిటీ ఏర్పాటైంది. ఈ పరిణామాలపై అధికార టీఆర్ఎస్ నేతలు చాలా మంది ఆసక్తిగా ఆరా తీస్తున్నారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును స్వాగతిస్తూనే.. ఆ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుంది? ఇప్పటివరకు కోదండరాం మినహా ప్రజలందరికీ తెలిసిన నేతలు ఎవరూ లేకుండా ఏర్పాటయ్యే కొత్త పార్టీకి ఆదరణ ఉంటుందా? అనే వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి టీఆర్ఎస్, టీజేఏసీ మధ్య గత కొంతకాలంగా ఉప్పు, నిప్పు వాతావరణం కొనసాగుతోంది. కోదండరాం పనిగట్టుకొని తమ ప్రభుత్వ చర్యలను తప్పుబడుతున్నారనే ఆగ్రహం టీఆర్ఎస్ అధిష్ఠానం ముఖ్యుల్లో ఉంది. ఈ పరిస్థితుల్లో టీఆర్ఎస్‌లో కొనసాగుతూ వేర్వేరు కారణాలతో అసంతృప్తిగా ఉన్న నేతలు కొందరు కోదండరాంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు కోదండతో ఏదో ఒక రకంగా టచ్‌లో ఉంటున్నారన్న విషయం 'గులాబీ' అధినాయకత్వానికి కూడా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనకుండా ఇప్పుడు ప్రభుత్వం, పార్టీలో కొందరు నేతలు ప్రాబల్యాన్ని చాటుతుండటం ఇష్టం లేని నేతలు కూడా పలువురు కోదండరాంతో సంబంధాలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ టీఆర్ఎస్‌ను కాదనుకునే పరిస్థితి వస్తే.. కాంగ్రెస్, బీజేపీలతో పోల్చుకుంటే, టీజేఏసీ కొత్తగా ఏర్పాటు చేసే పార్టీని ఎంచుకోవటం మంచిదనే ఉద్దేశంతోనే అసంతృప్తి 'గులాబీ' నేతలు ఈ డబుల్ గేమ్ ఆడుతున్నట్లు సమాచారం. దీనిపై టీఆర్ఎస్ కీలక నేత ఒకరు స్పందిస్తూ, 'వచ్చేసారి కూడా టీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుంది. అయినప్పటికీ ఓపిక లేనివారు, టిక్కెట్లు ఆశించి భంగపడినవారు కోదండరాం పార్టీ అనే కాకుండా ఇతర పార్టీల్లోకి కూడా వెళ్లవచ్చు' అని వ్యాఖ్యానించారు.





నిరుద్యోగ సమస్యపై కేసీఆర్‌కు పోస్టుకార్డులు

» నమూనా విడుదల చేసిన టీజేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం సత్వరమే కార్యాచరణ ప్రకటించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపాలని టీజేఏసీ పిలుపునిచ్చింది. తాము చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరింది. అందుకు సంబంధించిన పోస్టుకార్డు నమూనాను బుధవారం విడుదల చేసింది. టీజేఏసీ లేవనెత్తుతున్న అంశాలతోపాటు ప్రగతి భవన్ చిరునామాను అందులో పొందుపర్చింది.




ఎన్‌సీఎల్ శాస్త్రవేత్తకు ప్రతిష్ఠాత్మక అవార్డు

» ఫార్మా రంగంలో విశేష పరిశోధనలకు గుర్తింపు

ఫార్మా రంగంలో అత్యుత్తమ పరిశోధనలు చేసినందుకు పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీకి(ఎన్‌సీఎల్‌కు) చెందిన డాక్టర్ శ్రీనివాసరెడ్డికి ప్రతిష్ఠాత్మక సన్ ఫార్మా అవార్డు లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం సమీపంలోని శోభనాద్రిపురానికి చెందిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీలోనే చదువుకున్నారు. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పదార్థాల ద్వారా ఫార్మా ఉత్పత్తులను రూపొందించేందుకు పరిశోధనలు చేస్తున్నారు. ఈ అంశంపై ఆయన రాసిన పరిశోధన పత్రాలు అనేక అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఇందులోభాగంగా ఇటీవల ఆయన రూపొందించిన మూడు ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మంచి పేరొచ్చింది. వీటిలో మొదటిది కలుషిత ఆహారం తినటం వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించే యాంటీబయాటిక్ కాంపౌండ్, రెండోది మధుమేహం కోసం రూపొందించిన మాలిక్యూల్, మూడోది టీబీని నివారణకు ఉపయోగించే కాంపౌండ్. ప్రకృతిలో లభించే పదార్థాలతో కాంపౌండ్‌లను అభివృద్ధి చేయడంలో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు సన్ ఫార్మాస్యూటికల్స్ ఎండీ దిలీప్ సంఘ్వీ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. "ఇంత ప్రతిష్ఠాత్మక అవార్డు రావటం ఆనందంగా ఉంది. పట్టుదలతో ముందుకు నడిస్తే చేయలేనిది ఏదీ ఉండదు. మూడు పరిశోధనలకుగాను నాకు అవార్డు దక్కింది. ఈ మూడింటిలోనూ అంతఃసూత్రం సమాజ హితం" అని శ్రీనివాసరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. అలాగే, సీసీఎంబీకి చెందిన రాజన్ శంకరనారాయణన్(మౌలిక పరిశోధనలు), వెల్లూరులోని సీఎంసీ ఆస్పత్రికి చెందిన విక్రమ్ మేథ్యు(వైద్య పరిశోధనలు), ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన ఆయిష్ సూరి(క్లినికల్ రీసెర్చ్)లకు కూడా అవార్డులు లభించాయి. - స్పెషల్‌డెస్క్

టీడీపీకి వంటేరు గుడ్‌బై?

» వచ్చేనెల్లో కాంగ్రెస్‌లో చేరిక?



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-టీఎస్ నుంచి మరో ఇద్దరు సీనియర్ నాయకులు సైకిల్ దిగబోతున్నారా? ఈ నేతలపై కాంగ్రెస్ నుంచి ఒత్తిడి వస్తోందా? అంటే.. అవుననే పార్టీ వర్గాల నుంచి సమాధానం వస్తోంది. పాత కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేతతో పాటు, గజ్వేల్‌కు చెందిన టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి వచ్చేనెలలో కాంగ్రెస్‌లో చేరేందుకు భూమిక సిద్ధమైంది. గత ఎన్నికల్లో ఆయన గజ్వేల్ నుంచి సీఎం కేసీఆర్‌కు గట్టిపోటీ ఇచ్చారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నర్సారెడ్డి టీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఆయనకు రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. దీంతో, గజ్వేల్‌లో గట్టి నాయకుడి కోసం అన్వేషించిన కాంగ్రెస్ పార్టీ వంటేరుపై దృష్టి సారించింది. ఒక దశలో ఆయన టీఆర్ఎస్‌లో చేరుతారన్న ప్రచారం జరిగింది. కొద్దిరోజులుగా సమీకరణాలు మారడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నద్ధం అవుతున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై గట్టిగా పోరాడిన వంటేరు... టీడీపీ నాయకత్వం పట్ల అసంతృప్తిగా ఉన్నారు. కొద్దిరోజుల నుంచి ఆయన ఎన్టీఆర్ భవన్‌కూ దూరంగా ఉంటున్నారు. ఓయూ ఘటనకు సంబంధించిన కేసులో తాను చంచల్‌గూడ జైలులో ఉన్నప్పుడు పార్టీ పట్టించుకోలేదని ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఒత్తిడి వస్తున్నా చంద్రబాబుతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ఆయన యోచిస్తున్నారు. వివిధ అంశాలపై ఆయన గ్రామాల వారీగా కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటున్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోకి నాగం!

» ఉగాది తర్వాత చేరేందుకు సిద్ధం

» ఉత్తమ్‌తో రహస్యంగా ఢిల్లీ పయనం



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి చేరేందుకు రంగం సిద్ధమవుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి ఆయన సోమవారం ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీ యాత్రను ఉత్తమ్, నాగంలు ఖండిస్తున్నా ఇతర ముఖ్య నేతలు ధ్రువీకరిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో వర్గపోరాటం కారణంగా రహస్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. నాగం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగి ఉంటే నాగం ఈ పాటికి కాంగ్రెస్ కండువా కప్పుకొని ఉండేవారే. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలో కొందరు నేతలు ఆయన చేరిక పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎలాంటి శషబిషలు లేకుండా నాగం రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఎలాంటి నిర్ణయానికైనా సిద్ధపడతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నాగర్ కర్నూల్ ఎంపీ నంది ఎల్లయ్య, దామోదర్ రెడ్డి, డీకే అరుణ ఢిల్లీ వెళ్లి, రాహుల్ గాంధీని కలుసుకొని నాగం చేరిక పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. నాగం విషయంలో రాష్ట్ర నాయకత్వం చొరవ పట్ల వారిద్దరూ తీవ్ర మనస్తాపానికి లోనవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఉత్తమ్, నాగం ఢిల్లీలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.ఖుంటియా, ఏఐసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ కె.రాజుతో విడివిడిగా భేటీ అయినట్లు సమాచారం. రాహుల్‌గాంధీని కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు పడలేదని సమాచారం. నాగం బస్సు యాత్రకు ముందు కండువా కప్పుకుంటారా, ఉగాది తర్వాత కప్పుకుంటారా అన్నది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. యాత్రకు ముందే చేరితే గ్రూపు రాజకీయాలు బయటపడతాయేమోనని రాష్ట్రనాయకత్వం భయపడుతోంది. అయితే.. ఉగాది తర్వాత నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమై నిర్ణయం తీసుకుంటానని నాగం ఆంధ్రజ్యోతికి స్పష్టం చేశారు.

రూ. 200కే 10 పరీక్షలు!

పదినిమిషాల్లో రిపోర్టులు.. ఇన్‌స్టాంట్ ల్యాబ్‌గా చికిత్సక్

» పిల్లలు ఆడుకునేందుకు రోబో

» దివ్యాంగులకు ప్రత్యేకంగా 'ఐ వేర్'

» ఆరోగ్యం.. ఆహ్లాదం.. అన్నింటికీ ఐటీ

» వినూత్న సేవలు, సౌకర్యాలు

» సరికొత్త ప్రయోగ కేంద్రాలుగా స్టార్టప్‌లు

» ప్రపంచ ఐటీ సదస్సులో ఆకట్టుకున్న స్టాళ్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఇకపై ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మరింత కీలకం కానుంది. ఆరోగ్యం, ఆహ్లాదం, నిత్యావసరం.. ఇలా అన్నింటికీ ఐటీనే! రూ.200 ఖర్చుతో పది నిమిషాల్లో పది ఆరోగ్య పరీక్షలు! చిన్న పిల్లలకు తోడుగా ఉంటూ కథలు చెప్పే కంపానియన్ రోబో! దివ్యాంగులకు ఉపయోగపడే ఆధునిక ఐ వేర్..! ఇలా సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త సేవలందించే ఆవిష్కరణలకు ప్రపంచ ఐటీ సదస్సు వేదికైంది. ఈ సదస్సులో ఏర్పాటుచేసిన స్టాళ్లు నగరానికి నయా పరికరాలు, సేవలను పరిచయం చేశాయి. రక్తపోటు, మధుమేహం నుంచి కేన్సర్ వరకు అనేక జబ్బులను గుర్తించే ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. బెంగళూరు కేంద్రంగా ఆయా సేవలను ఆవిష్కరించిన సాఫ్ట్‌వేర్ సంస్థలు.. త్వరలో నగరంలోనూ ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

రూ.200లకు పది పరీక్షలు



బీపీ, షుగర్, ఈసీజీ, హెచ్‌జీబీ, ఆర్‌బీఎస్.. ఇలా పది రకాల పరీక్షలు చేయించుకోవాలంటే కనీసం రూ.1000- 1500 వరకు ఖర్చవుతుంది. రెండు, మూడు గంటల సమయం పడుతుంది. కానీ, రెండు గంటల్లో కేవలం రూ.200లకే ఆయా పరీక్షలు నిర్వహించి పదినిమిషాల్లోనే రిపోర్టులు అందజేసే ఇన్‌స్టాంట్ ల్యాబ్ వచ్చేసింది. అదే చికిత్సక్. బెంగళూరుకు చెందిన విక్రమ్‌రాజ్, అతని ఇద్దరి భాగస్వాములు ఆధునిక పరీక్షా పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. బ్యాగులో పట్టే పరికరాలతో పరీక్షలు చేసి పది నిమిషాల్లో రిపోర్టులు ఇచ్చేస్తారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో వైద్యపరీక్షలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని చికిత్సక్ కో డైరెక్టర్ విక్రమ్‌రాజ్ తెలిపారు. ఇతర వివరాలకు 91-9845501929 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

దివ్యాంగులకు ఐవేర్..



సరికొత్త టెక్నాలజీతో దివ్యాంగులకు ఉపయోగపడేలా ఐవేర్ కళ్లజోళ్లు రాబోతున్నాయి. కళ్లజోళ్ల మధ్యలో సీసీ కెమెరా, కళ్లద్దాల్లో చిప్స్ ఏర్పాటుచేసి దివ్యాంగులు బయటకు వెళ్లేలా ఐవేర్ కళ్లద్దాలు అందుబాటులోకి తీసుకొచ్చేలా పలు కంపెనీలు సాఫ్ట్‌వేర్లను అభివృద్ధి చేస్తున్నాయి. టార్చ్ ఐటీ పరికరంతో దివ్యాంగులు రోడ్లపై నడిచేటప్పుడు అడ్డుగా ఎవరైనా వస్తే వైబ్రేషన్ వచ్చేలా టార్చ్ ఐటీ పరికరాన్ని రూపొందించారు. గుజరాత్‌లో 2500 మందికి టార్చ్‌ఐటీ సత్ఫలితాలనిస్తోందని టార్చ్‌ఐటీ ప్రతినిధి రాజ్ తెలిపారు.

థర్మల్ డివైజ్‌తో రొమ్ము కేన్సర్ గుర్తింపు



మహిళల్లో పెరుగుతున్న రొమ్ము కేన్సర్‌ను గుర్తించే థర్మల్ డివైజ్ పరికరం అందుబాటులోకి రానుంది. దీన్ని బెంగళూరుకు చెందిన నిరమయి స్టాల్‌లో ప్రదర్శించారు. ఆధునిక టెక్నాలజీతో లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రారెడ్ (ఎల్‌డబ్ల్యూఐఆర్)తో ఇమేజ్ ఆధారంగా కృత్రిమ మేధతో థర్మల్ డివైజ్ మహిళల్లో రొమ్ము కేన్సర్‌ను గుర్తిస్తుంది. ఇప్పటికే బెంగళూరులోని కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈ డివైజ్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిరమయి స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు శివతేజ్ అన్నారు.

కరెంటు కేక


(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా 11 వేల మెగావాట్ల డిమాండ్ ఉంటుందని లెక్కించారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అధికారులు కరెంట్‌ను సమకూర్చుకుంటున్నారు. రాత్రి పూట చలిగా అనిపిస్తుండగా... ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతూ వస్తోంది. మధ్యాహ్నం 3 గంటల దాకా ఎండలు తీవ్రంగా ఉండటంతో కరెంట్ వాడకం పెరుగుతోంది. మార్చిలో రాత్రిపూట, పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగడంతో పంటలకు నీళ్ల అవసరం పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

గ్రేటర్ టాప్: తెలంగాణలో 31 జిల్లాలు ఉండగా... గ్రేటర్ హైదరాబాద్‌లో వినియోగం అత్యధికంగా ఉంది. మంగళవారం 2168 మెగావాట్లుగా డిమాండ్ ఉండగా... బుధవారం 2290 మెగావాట్లుగా డిమాండ్ ఉంది. రాష్ట్ర వినియోగంలో 20 శాతానికి పైగా గ్రేటర్ హైదరాబాద్‌దే. జిల్లాల్లోనూ వినియోగం క్రమంగా పెరుగుతుంది. నల్గొండ జిల్లాలో మంగళవారం 716 మెగావాట్లు, బుధవారం 1133 మెగావాట్లు డిమాండ్ నమోదైంది. మహబూబ్‌నగర్‌లో గతేడాది 832 మెగావాట్లుగా ఉండగా... బుధవారం 1026 మెగావాట్లుగా, ఇక వికారాబాద్‌లో గతేడాది 100 మెగావాట్లుగా ఉండగా... రెండింతలై 201 మెగావాట్లకు చేరింది. ఇక మెదక్‌లో 742 మెగావాట్లుగా గతేడాది ఉండగా... ప్రస్తుతం 1072 మెగావాట్లుగా ఉంది. ఇక ఆదిలాబాద్‌లో గతేడాది 294 మెగావాట్లుగా ఉండగా... బుధవారం 221 మెగావాట్లకు, కరీంనగర్‌లో 742 మెగావాట్లుగా ఉండగా... 655 మెగావాట్లకు తగ్గింది. ఇక వరంగల్‌లో గత ఏడాది 560 మెగావాట్లు ఉండగా... ఈ ఏడాది 602కు చేరింది. కాగా, జనవరిలో రాత్రిళ్లు డిమాండ్ కన్నా ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో గ్రిడ్‌ను కాపాడుకోవడం అధికారులకు తలనొప్పిగా మారింది. రాత్రిళ్లు ఉత్పత్తి తగ్గించుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం రాత్రిపూట వినియోగం కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో గ్రిడ్‌కు ఇబ్బందులు రావడం లేదు. ప్రస్తుతం తెలంగాణలో విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం పగటిపూట 12,530 మెగావాట్లుగా ఉండగా... డిమాండ్ 9894గా ఉంది. రాత్రిపూట 3200 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోవడంతో 9330 మెగావాట్లకు ఉత్పాదక సామర్థ్యం చేరుతుంది. వినియోగం కూడా అంతే ఉండటంతో గ్రిడ్‌కు ఇబ్బందుల్లేవు. బుధవారం ఉదయం 10:03 గంటల సమయంలో ఎస్పీడీసీఎల్(హైదరాబాద్) పరిధిలో 6517 రికార్డు వినియోగం నమోదు కాగా... ఎన్పీడీసీఎల్(వరంగల్) పరిధిలో ఉదయం 7:57 గంటలకు 3218 మెగావాట్ల డిమాండ్ రికార్డయింది. మొత్తం 203 మిలియన్ యూనిట్లుగా వినియోగం ఉంది. జెన్‌కో కేంద్రాల నుంచి 58.906 మిలియన్ యూనిట్లు, సింగరేణి నుంచి 27.492 మిలియన్ యూనిట్లు, కేంద్ర విద్యుత్ సంస్థలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఇతర కొనుగోళ్ల నుంచి 70.374 మిలియన్ యూనిట్లు, ఎన్‌సీఈ, ఇతర మార్గాల నుంచి 44.117 మిలియన్ యూనిట్లు కరెంట్‌ను తీసుకున్నారు. నెలరోజుల్లో పాల్వంచలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ అందుబాటులో రానుంది. మార్చి నెలలో 11 వేల మెగావాట్లకు డిమాండ్ చేరే అవకాశాలు ఉండటంతో ఉత్పత్తి పెరిగినా కరెంట్ సరఫరాకు ఇబ్బందులేమీ ఉండవని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇక తెలుగులో ఈ-మెయిల్ అడ్రస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఇప్పటివరకు ఇంగ్లీష్‌కే పరిమితమైన ఈ-మెయిల్ అడ్రస్.. ఇప్పుడు తెలుగులోనూ అందుబాటులోకి వచ్చింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మైక్రోసాఫ్ట్ సంస్థ బుధవారం ఈ నిర్ణయం తీసుకుంది.



తెలుగుతోపాటు హిందీ, తమిళం, ఉర్దూ, మరాఠీ, బెంగాలీ, పంజాబీ, గుజరాతీ, సింధీ, బోడో, డోగ్రి, కొంకణి, మైథిలి, మణిపురీ, నేపాలీ భాషల్లోనూ ఈ-మెయిల్ అడ్రస్‌లను మైక్రోసాఫ్ట్ అందుబాటులోకి తెచ్చింది. భవిష్యత్తులో యాప్‌లు, ఇతర సర్వీసుల్లోనూ ఈ భాషలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో మాతృభాష అవరోధం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా సీవోవో మిథుల్ పటేల్ తెలిపారు. కాగా, డొమైన్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య 33.24కోట్లకు చేరిందని ఇంటర్నెట్ సెక్యూరిటీ సంస్థ వెరిసైన్ ప్రకటించింది. 2017 చివరి మూడు నెలల్లో 17లక్షల డొమైన్లు రిజిస్టర్ అయినట్లు పేర్కొంది.

తెలుగులోనూ ఈ-నామ్ వెబ్‌సైట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) వెబ్‌సైట్ తెలుగులోనూ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మాత్రమే ఉన్న ఈ వెబ్‌సైట్‌ను తెలుగుతోపాటు గుజరాతీ, మరాఠీ, తమిళ్, బెంగాళీ, ఒడియా వంటి ఆరు ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీన్ని బుధవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధా మోహన్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ-నామ్ మొబైల్ యాప్‌లోనూ పలు కొత్త ఫీచర్లను రూపొందించారు. బీమ్, ఇతర యాప్‌ల ద్వారా మార్కెటింగ్ లావాదేవీలు కొనసాగించే సౌకర్యాన్ని రైతులకు కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ-నామ్ ద్వారా రైతులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు పెరిగాయని, ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం 479 మార్కెట్లు ఈ-నామ్ పరిధిలో ఉన్నాయని, వచ్చే నెల నాటికి ఆ సంఖ్య 585కు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వడ్డీరేటును 8.55 శాతానికి తగ్గించిన ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 : ఉద్యోగుల పీఎఫ్ వడ్డీరేటును 2017-18 సంవత్సరానికి ఈపీఎఫ్‌వో బుధవారం 8.55 శాతానికి తగ్గించింది. వడ్డీరేటును తగ్గించడం వరుసగా ఇది మూడోసారి. 2015-16లో ఈ వడ్డీరేటు 8.80 శాతం, 2016-17లో 8.65 శాతంగా ఉండింది. ఈ ఆర్థిక సంవత్సరం 8.65 శాతం వడ్డీరేటు కొనసాగించడానికి ఈపీఎఫ్‌వో తన పెట్టుబడుల్లో కొంత భాగం (రూ.2,886 కోట్ల విలువ చేసే) ఈ నెలలో ఎక్స్‌చేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) లో విక్రయించింది. ఫలితంగా సంస్థ రూ.1,054 కోట్ల రిటర్నులు ఆర్జించింది. 2015 ఆగస్టు నుంచి ఈపీఎఫ్‌వో.. ఈటీఎఫ్‌లో పెట్టుబడులు పెడుతోంది. ఇప్పటి వరకు రూ.44,000 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గాంగ్వర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో భవిష్యత్తు గురించి అంచనా వేయడం కష్టమన్నారు. గత ఆర్థిక ఏడాది ఉద్యోగులకు 8.65 శాతం వడ్డీ చెల్లించామని, ఫలితంగా రూ.695 కోట్లు మిగిలాయి అని మంత్రి తెలిపారు. ఈ ఏడాది 8.55 శాతం వడ్డీ చెల్లించాలని నిర్ణయించామని ఈపీఎఫ్‌వో ట్రస్టీల సమావేశం అనంతరం మంత్రి చెప్పారు.



13 కాదు.. పదే

మొబైల్ నంబర్ అంకెల్లో ఎలాంటి మార్పు లేదు

టెలికం ఆపరేటింగ్ సంస్థల స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: "మీ మొబైల్ నంబర్ ఇక నుంచి 13 అంకెల్లో ఉండబోతోంది. ఈ ఏడాది చివరి వరకు అన్ని నంబర్లు మారిపోతాయి.." అంటూ బుధవారం సాయంత్రం వరకు మీడియాలో, సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయ్యో.. ప్రస్తుతం ఉన్న 10 అంకెలనే గుర్తుంచుకోలేకపోతున్నాం.. ఇక 13 అయితే ఎలా అని బాధపడుతున్నారా?! బాధపడకండి! మీ నంబర్ 13 అంకెల్లోకి మారే ప్రసక్తే లేదు! మారేది కేవలం మిషన్ టు మిషన్ సిమ్ నంబర్లు మాత్రమే. ఈ విషయాన్ని ఎయిర్‌టెల్, రిలయెన్స్ జియో వంటి టెలికం ఆపరేటింగ్ సంస్థలతోపాటు సెల్యూలార్ ఆపరేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధ్రువీకరించాయి. సాధారణ మొబైల్ నంబర్లు ఎప్పటిలాగే 10 అంకెలతో కొనసాగుతాయని, కొత్తగా వచ్చే మొబైల్ సిమ్‌ల విషయంలోనూ ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశాయి. అన్ని టెలికం ఆపరేటర్లకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ ఇటీవల జారీ చేసిన ఆదేశాలు తప్పుగా ప్రచారమయ్యాయని, దీంతో కోట్లాది మంది వినియోగదారులు ఆందోళనకు గురయ్యారని తెలిపాయి. మిషన్ టు మిషన్ సిమ్ నంబర్లను 13 అంకెలుగా అభివృద్ధి చేయాలని డీఓటీ ఆదేశించిందని వెల్లడించాయి. మిషన్ టు మిషన్ సిమ్‌లను స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు, వాహనాల ట్రాకింగ్, ట్రాఫిక్ నియంత్రణ, టెలిమెడిసిన్, విమానాల నిర్వహణ వంటి వ్యవస్థల్లో ఉపయోగిస్తారు. సిమ్ కార్డుల నంబర్లు ప్రస్తుతం 10 అంకెలుగా ఉండగా భద్రతా కారణాల దృష్ట్యా 13 అంకెలుగా అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు అభివృద్ధి చేయాలని డీఓటీ స్పష్టం చేసింది. వీటిని జూలై 1 నుంచి 13 అంకెల నంబర్లతో అందుబాటులోకి తేవాలని ఆదేశించింది.



నరిసెట్టి రాజుకు అవార్డు అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య

పారదర్శకతతోనే పత్రికలకు విశ్వసనీయత

- ఉపరాష్ట్రపతి వెంకయ్య
- ప్రముఖ జర్నలిస్టు నరిసెట్టి రాజుకు చందూర్ పురస్కార ప్రదానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తే పత్రికల ప్రమాణాలు, విశ్వసనీయత పెరుగుతాయని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. మీడియా సత్యానికి దగ్గరగా, సంచలనానికి దూరంగా ఉండాలని.. జర్నలిస్టులంటే సమాజాన్ని అద్దంలో చూపేవారని అన్నారు. ప్రముఖ అంతర్జాతీయ జర్నలిస్టు నరిసెట్టి రాజుకు బుధవారం ప్రతిష్ఠాత్మక ఎన్.ఆర్.చందూర్ అవార్డును ప్రదానం చేసిన అనంతరం వెంకయ్య మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలే పత్రికలు నడిపితే నిష్పాక్షికత ఉండదన్నారు. కొందరు వ్యక్తుల కోసం పత్రికలు నడపడం వల్ల మీడియా విలువ పడిపోతుందని చెప్పారు. మీడియాకు స్వీయనియంత్రణ అవసరమన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ఇప్పటివరకూ తెలుగు జర్నలిస్టులు సత్తా చాటుతూనే ఉన్నారన్నారు. సీనియర్ జర్నలిస్టు నరిసెట్టి ఇన్నయ్య కుమారుడైన నరిసెట్టి రాజును చిన్నప్పుడు చూశానని.. ఇప్పుడాయన వాల్‌స్ట్రీట్ జర్నల్, వాషింగ్టన్ పోస్ట్ వంటి అంతర్జాతీయ పత్రికలకు మేనేజింగ్ ఎడిటర్ స్థాయికి ఎదగడం మనందరికీ గర్వకారణమన్నారు. రాజు భారత్‌లో మింట్ లాంటి బిజినెస్ పత్రికను స్థాపించి అత్యధిక సర్క్యులేషన్ ఉన్న పత్రికగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శనాత్మకంగా విశ్లేషించే బాధ్యత పత్రికలకున్నదని చెప్పారు. పత్రికలపై నియంత్రణ విధించేందుకు కోర్టులు కూడా వ్యతిరేకమని, పత్రికలే స్వీయ నియంత్రణ విధించుకోవాలని స్పష్టం చేశారు.

దేశంలో పత్రికా స్వేచ్ఛకు సవాళ్లు: నరిసెట్టి

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని పురస్కార గ్రహీత నరిసెట్టి రాజు అన్నారు. పత్రికా స్వేచ్ఛ విషయంలో మనదేశం 136వ స్థానంలో ఉన్నదని, గౌరీ లంకేష్ లాంటి జర్నలిస్టులు హత్యకు గురవుతున్నారని విమర్శించారు. ఫిలిప్పీన్స్, మెక్సికో వంటి దేశాల్లో జర్నలిస్టులను జైళ్లలో పెడుతున్నారని, హత్యలు చేస్తున్నారని చెప్పారు. అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా జర్నలిజం సోషల్ మీడియా నుంచి, ఫేక్ న్యూస్ నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నదని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, సీఎన్ఎన్ వార్తలను ఫేక్ న్యూస్ అంటున్నారని.. వార్తలు విమర్శనాత్మకంగా ఉన్నంత మాత్రాన దేశ వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ యూరోప్‌కు ఎడిటర్, వాషింగ్టన్‌పోస్ట్‌కు మేనేజింగ్ ఎడిటర్, వాల్‌స్ట్రీట్ జర్నల్ డిజిటల్‌కు మేనేజింగ్ ఎడిటర్ అయిన తొలి భారతీయుడు, తొలి తెలుగు వాడిని తానేనని వివరించారు. ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలి

- అప్పటివరకు సీఎం, మంత్రుల భేటీకి వెళ్లం
- ఐఏఎస్ అధికారుల సంఘం స్పష్టీకరణ
- సీఎస్‌పై దాడి కేసులో మరో ఎమ్మెల్యే అరెస్టు
- సీఎం సలహాదారును విచారించిన పోలీసులు
- ఎమ్మెల్యేల కస్టడీకి కోర్టు నిరాకరణ
- సీఎస్-ఎమ్మెల్యేల గొడవలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు



అమానతుల్లా



ప్రకాశ్ జార్వాల్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 21: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడి నేపథ్యంలో సీఎం కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలని ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. క్షమాపణ చెప్పేవరకు సీఎం, మంత్రుల భేటీకి హాజరుకాబోమని అధికారులు స్పష్టం చేశారు. సీఎస్‌పై దాడిని ఖండిస్తూ అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. మరోవైపు ఈ కేసులో ఆప్ ఎమ్మెల్యే అమానుతుల్లా ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సలహాదారుడు వీకే జైన్‌ను 3 గంటల పాటు విచారించారు. అన్షు ప్రకాశ్ ఫిర్యాదు మేరకే జైన్‌ను విచారించినట్లు ఢిల్లీ డీసీపీ మధుర్ వర్మ తెలిపారు. మరోసారి ఆయనను విచారించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు సీఎస్- ఆప్ ఎమ్మెల్యేల గొడవలో తక్షణమే జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య గొడవల వల్ల ప్రజలు ఇబ్బంది పడతారని, తక్షణమే జోక్యం చేసుకోవాలని న్యాయవాది కేఎస్ వాహి హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. పోలీసులు ఈ కేసుకు సంబంధించి విచారణ జరుపుతున్నారని, నివేదిక వచ్చే వరకు ఆగాలని పిటిషనర్‌కు సూచించింది. మరోవైపు మంగళవారం అరెస్టయిన ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జార్వాల్‌తో పాటు అమానతుల్లా ఖాన్‌లను విచారించేందుకు అనుమతివ్వాలని కోర్టును కోరారు. దీనికి కోర్టు నిరాకరించింది. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలను తిహార్ జైలుకు తరలించారు. గురువారం వీరి బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణ జరపనుంది.

నిందితులపై కేసులు పెట్టాలి: తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం

ఢిల్లీ సీఎస్‌పై జరిగిన దాడిని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో పాల్గొన్న వారిని, ప్రేరేపించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం గౌరవ కార్యదర్శి నవీన్‌మిట్టల్ డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ ఢిల్లీలో అధికారులు చేస్తున్న నిరసనకు మద్దతు పలికారు. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్న వారిపై దాడులు చేయడం సరికాదన్నారు.

తాజ్‌మహల్ సమాధే.. శివాలయం కాదు

- పురావస్తు శాఖ స్పష్టీకరణ



ఆగ్రా, ఫిబ్రవరి 21: ప్రపంచ సుందర కట్టడం- తాజ్ మహల్ - మొఘల్ చక్రవర్తి షాజహాన్, ఆయన భార్య ముంతాజ్‌ల సమాధే తప్ప శివాలయం కాదని పురావస్తు శాఖ (ఏఎస్ఐ) తేల్చిచెప్పింది. ఈ మేరకు ఆగ్రా కోర్టులో ఓ అఫిడవిట్ దాఖలు చేసింది. ముంతాజ్ స్మృతి చిహ్నంగా షాజహాన్ ఈ ప్రేమమందిరాన్ని నిర్మించాడని ఏఎస్ఐ తరఫు న్యాయవాది అంజనీ శర్మ అఫిడవిట్‌లో తెలిపారు. అది సమాధి కాదని, 'తేజోమహాలయ్' పేరుతో ఉన్న శివాలయమని చేస్తున్న వాదనలు ఊహాజనితమని పేర్కొన్నారు. తాజ్ దేశ సంస్కృతీ చిహ్నమని, ఒక ఘన చరిత్రకు సాక్షి అని, దీన్ని పేరు మార్చడం వారసత్వ సాంస్కృతిక చరిత్రను కాలరాయడమే అవుతుందని ఏఎస్ఐ పేర్కొంది.

వృద్ధాశ్రమంలో శవ దందా!

- మృతదేహాలను కుళ్లబెట్టి ఎముకలు విదేశాలకు..
- కాంచీపురం ఆశ్రమంలో మరణాలపై సందేహాలు
- నెలకు 40మంది మృతిపై స్థానికుల్లో భయాందోళన



సెల్వరాజ్‌ను తీసుకెళుతున్న గ్రామస్తులు



శవం పక్కనే వృద్ధుడు సెల్వరాజ్

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టెడన్నం పెడతారని వెడితే, కనీసం పాడెకు కూడా కాకుండా చేస్తున్న దుర్మార్గమిది! వృద్ధాశ్రమం ముసుగులో వారి శవాలతో దందా చేస్తున్న దారుణ ఉదంతమిది. వృద్ధాశ్రమంలో చనిపోయిన వారి మృతదేహాలను కుళ్లబెట్టి, బాగా ఎండిన తరువాత ఎముకలను విదేశాలకు అమ్ముకొంటున్న ఓ సంస్థ తీరు నివ్వెరపరుస్తోంది. చనిపోయిన తరువాత కాదు, వృద్ధులను ఎంచుకొని చంపి మరీ ఈ సంస్థ 'శవ' వ్యాపారం చేస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుధవారం కూరగాయల వ్యాన్‌లో ఈ వృద్ధాశ్రమ నిర్వాహకులు మృతదేహంతోపాటు తరలిస్తున్న ఇద్దరు వృద్ధులను చెన్నై తాంబరం ప్రాంతంలో వీరు కాపాడారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం, కాంచీపురంలోని పాలేశ్వరం గ్రామంలో 19 ఎకరాల విస్తీర్ణంలో విదేశీ నిధులతో 'సెయింట్ జోసెఫ్ కరుణైఇల్లమ్' పేరిట వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వృద్ధాశ్రమంలో నిరాశ్రయులైన వృద్ధులు, మహిళలు, మతిస్థిమితం కోల్పోయినవారు సుమారు 300 మందికిపైగా ఉన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వృద్ధులు కూడా ఉన్నారు. ఏడేళ్లుగా ఆ వృద్ధాశ్రమం పనితీరుపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాశ్రమం వెనుక భాగంలో విపరీతంగా దుర్వాసన వస్తున్నదని అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో చెన్నైలోని తాంబరంలోని ఇరుంబులియూరులోని వృద్ధాశ్రమానికి చెందిన విజయకుమార్ (75).. ఇక్కడి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండురోజుల క్రితం మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం విజయకుమార్ మృతదేహాన్ని, సెల్వరాజ్ (72), అన్నమ్మాళ్ (74) అనే ఇద్దరు వృద్ధులను ఈ వృద్ధాశ్రమం నుండి కాయగూరల వ్యాన్‌లో పాలేశ్వరం ఆశ్రమానికి కొందరు తరలించడానికి ప్రయత్నించారు. తిరుముక్కూడల్ రహదారి వద్ద ఆ వ్యాన్‌లో ఉన్న అన్నమ్మాళ్ 'కాపాడండి కాపాడండి' అంటూ బిగ్గరగా కేకలు పెట్టడంతో స్థానికులు ఆ వాహనాన్ని చుట్టుముట్టి నిలిపివేశారు. వ్యాన్ తలుపులు తెరచి చూడగా, కూరగాయల బస్తాలు, గుడ్డతో చుట్టి ఉన్న విజయకుమార్ మృతదేహం కనిపించాయి. సెల్వరాజ్, అన్నమ్మాళ్‌లను వారు కాపాడారు. "మా ఇరువురినీ పాలేశ్వరం వృద్ధాశ్రమానికి అక్రమంగా తరలిస్తున్నారు. ఆ ఆశ్రమానికి వెళితే మా ప్రాణాలు పోతాయి" అని అన్నమ్మాళ్ వాపోయింది. దీంతో స్థానికులు ఆ వ్యాన్‌ను నిర్బంధించి డ్రైవర్ రాజేశ్‌ను పోలీసులకు అప్పగించారు. పాలేశ్వరం వృద్ధాశ్రమం నిర్వాహకులను అరెస్టు చేయాలంటూ రాస్తారోకో నిర్వహించారు. కాగా, తాంబరం ఆశ్రమం నుండి తనను కిడ్నాప్ చేసి చేసుకెళుతున్నట్లు అన్నమ్మాళ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నెలకు 40 శవాలు

కరుణై ఇల్లంలో నెలకు కనీసం 40 మంది చనిపోతున్నట్లు అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. బుధవారం ఉదయం ఆర్డీవో రాజు, తహసిల్దార్ అఖిలాదేవి సహ 60 మంది అధికారులు పాలేశ్వరం ఆశ్రమంలో తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా వారికి దిగ్భ్రాంతికర విషయాలు తెలిశాయి. ఆ ఆశ్రమానికి చేరిన వారి సంఖ్యకు, అందులో ప్రస్తుతం వున్న సంఖ్యకు పొంతనే లేదు. ఆశ్రమంలో మృతి చెందిన వృద్ధుల మృతదేహాలను శ్మశానాలకు తరలించకుండా ఆ ఆశ్రమం వెనుక 20 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు కలిగిన తొట్టెలాంటి గదిలో పేర్చిపెడుతున్నారు. ఆ శవాలు బాగా కుళ్లిపోయిన తరువాత మాంసపు భాగాలు ఆ గది దిగువనున్న గోతిలో పడిపోతాయి. ఆ తర్వాత ఎముకల గూళ్లను ఆశ్రమ నిర్వాహకులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని కూడా అధికారులకు ఫిర్యాదు అందింది. ఇప్పటిదాకా వృద్ధాశ్రమంలో ఉండి చనిపోయినవారందరివీ అనుమానాస్పద మరణాలేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గత జనవరిలోనే 40 మందికి పైగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు విచారణలో వెల్లడైంది. కాగా, సెయింట్ జోసెఫ్ హోస్పీస్ సంస్థ ఆధ్వర్యంలో దిండుగల్, వేలూరు, దిండుగల్ ప్రాంతాల్లో నడుపుతున్న వృద్ధాశ్రమాలలోనూ అధికారులు విచారణ జరుపుతున్నారు.

భర్త జననేంద్రియాలు కోసేసిన భార్య

జలంధర్, ఫిబ్రవరి 21: తన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్నందుకు భార్య విశ్వరూపం ప్రదర్శించింది. అతని జననేంద్రియాలు కోసి టాయిలెట్‌లో పడేసిందని పోలీసులు తెలిపారు. బాధితుడు జోగిందర్‌సింగ్ తీవ్రంగా గాయపడి స్థానిక ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య పోరాడుతున్నాడు. రాత్రి జోగిందర్ నిద్రపోతుండగా ఆయన భార్య సుఖ్‌వంత్ కౌర్ ఈ దారుణానికి ఒడిగట్టిందని జలంధర్ ఏసీపీ సతీందర్ కుమార్ తెలిపారు. తన భర్త ఇంకో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఆమె అనుమానం పెంచుకుందని ఏసీపీ చెప్పారు. భర్త నిద్రిస్తుండగా ఆమె ఆయన తలపై రాడ్డుతో కొట్టడంతో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అనంతరం ఆమె అతని జననేంద్రియాలను కోసేసి ఇంట్లోని టాయిలెట్‌లో పడేసిందని ఏసీపీ వివరించారు. తీవ్రంగా రక్తస్రావం కారడంతో బాధితుడి పరిస్థితి విషమంగా ఉంది.

టీచర్.. నిన్ను రేప్ చేస్తా

గుర్గావ్ విద్యార్థి దుడుకు చేష్ట

టీచర్‌తో సెక్స్ కు మరో స్టూడెంట్ మెయిల్

గుర్గావ్, ఫిబ్రవరి 21: ఢిల్లీ శివార్లలోని గుర్గావ్ లోని ర్యాన్ పబ్లిక్ స్కూలు విద్యార్థి హత్యోదంతం ఇంకా మరువకముందే మరో కార్పొరేట్ స్కూలు విద్యార్థులు శ్రుతి మించి ప్రవర్తిస్తున్న వైనం తాజాగా బయటపడింది. చదువు చెబుతున్న టీచర్‌ను, ఆమె కూతుర్ని రేప్ చేస్తానంటూ ఓ పదమూడేళ్ల విద్యార్థి ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టడం సంచలనం రేపింది. ఆమె వెంటనే దీనిపై స్కూలు యాజమాన్యానికి, జిల్లా శిశు సంక్షేమ అధికారిణికి ఫిర్యాదు చేసింది. ఈ పోస్ట్ పెట్టిన విద్యార్థికి, టీచర్ కూతురు క్లాస్‌మేట్. దీనిని చూసిన దగ్గర నుంచి ఆ విద్యార్థిని స్కూలుకు వెళ్లడం మానేసింది.. ఇంట్లో భయంతో ఓ గదిలో తలుపేసుక్కూచుంది. ఇక మరో విద్యార్థి ఇంకో అడుగు ముందుకేసి- 'మీతో సెక్స్‌కు, కేండిల్‌లైట్ డేటింగ్‌కు, జాయ్‌రైడ్‌కు నేను రెడీ.." అని ఏకంగా మరో టీచర్‌కు ఈమెయిల్ పంపాడు. ఇది మరింత వివాదాస్పదంగా మారింది.

ఢిల్లీలో కొఠారీని ప్రశ్నిస్తున్న సీబీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: రోటొమాక్ కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీపై సీబీఐ విచారణ కొనసాగుతోంది. బుధవారం ఆయన్ను ఢిల్లీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రశ్నించారు. ఏడు ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.3,695 కోట్ల రుణాన్ని ఎగవేసిన కేసులో అధికారులు కొఠారీని విచారిస్తున్నారు. ఇప్పటివరకు ఆయన్ను కాన్పూర్‌లోని నివాసం, రోటొమాక్ కార్యాలయాల్లో విచారించారు. తాజాగా ఢిల్లీకి రప్పించి ప్రశ్నిస్తున్నారు. రోటొమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో డైరెక్టర్లుగా ఉన్న కొఠారీ, ఆయన భార్య సాధన, కుమారుడు రాహుల్‌లు బ్యాంకు రుణాలను ఇతర కార్యకలాపాలకు మళ్లించారని అధికారులు తెలిపారు.

పీఎన్‌బీపై సిట్ అక్కర్లేదు

- సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరిపించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇప్పటికే కేసు నమోదైందని, దర్యాప్తు కూడా జరుగుతోందని వివరించింది. పీఎన్‌బీ కుంభకోణంపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని, విదేశాలకు పారిపోయిన నీరవ్‌ను ఇక్కడికి రప్పించాలని కోరుతూ న్యాయవాది వినీత్ ధండా సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ.. ఈ పిల్‌ను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రస్తుతానికి ఈ అంశంపై తామేమీ మాట్లాడబోమని చెప్పింది. తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది.

పీఎన్‌బీ జీఎం జిందాల్ అరెస్టు

నీరవ్‌కు ఎల్‌వోయూలు ఆయన హయాంలోనే మొదలు..

- విచారిస్తున్న సీబీఐ అధికారులు
- నీరవ్ ఫాంహౌస్‌కు సీలు
- ఏడోరోజూ కొనసాగిన ఈడీ సోదాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పీఎన్‌బీ కుంభకోణంలో సీబీఐ, ఈడీ దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది. సీబీఐ అధికారులు బుధవారం పంజాబ్ నేషనల్ బ్యాంకు జనరల్ మేనేజర్ రాజేశ్ జిందాల్‌ను అరెస్టు చేశారు. రూ.11,400 కోట్ల కుంభకోణం జరిగిన ముంబైలోని బ్రాడీ రోడ్డు పీఎన్‌బీ శాఖ అధిపతిగా 2009-11 వరకు పనిచేసిన జిందాల్‌ను అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నీరవ్ మోదీ కంపెనీలకు అడ్డగోలుగా ఎల్‌వోయూలు జారీచేయడం ఈయన పనిచేసిన కాలంలోనే ప్రారంభమైందని తెలిపారు. జిందాల్ ప్రస్తుతం ఢిల్లీలోని పీఎన్‌బీ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సీబీఐ అధికారులు ముంబైకి 100 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్ర తీరంలో ఉన్న నీరవ్ ఫాంహౌస్‌కు సీలు వేశారు. 1.5 ఎకరాల్లో ఉన్న ఈ విలాసవంతమైన ఫాంహౌస్‌ను నీరవ్ 2004లో రూ.32 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ కేసులో అరెస్టు చేసిన ఆరుగురు వ్యక్తులను సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి మార్చి 3 వరకు రిమాండ్ విధించారు. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు ఏడో రోజూ దాడులు కొనసాగించారు. పీఎన్‌బీ కుంభకోణం ప్రధాన సూత్రధారులైన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు చెందిన సంస్థల్లో విస్తృత తనిఖీలు చేస్తున్నారు. బుధవారం ముంబైలోని నాలుగు డొల్ల కంపెనీలు సహా దేశ వ్యాప్తంగా 17 చోట్ల సోదాలు చేశారు. నీరవ్ మనీలాండరింగ్‌కు ఉపయోగించిన డొల్ల కంపెనీలపై ఆదాయ పన్ను(ఐటీ) శాఖ కూడా చర్యలు తీసుకుంటోంది. రాబోయే రోజుల్లో మరిన్ని డొల్ల కంపెనీలు బయటపడతాయని ఓ అధికారి చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే రూ.5,726 కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఇతర రాళ్లను సీజ్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద మరిన్ని ఆస్తులను సీజ్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఐటీ శాఖ బుధవారం నీరవ్‌కు చెందిన రూ.145.74 కోట్లను అటాచ్ చేసింది. ఇప్పటివరకు 141 బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను అటాచ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

లాల్ బహదూర్ బాకీ పడ్డపుడు!



ఒకరికి కోట్లకు బలిసిన అవినీతి. మరొకరిది ప్రధాని తనయుడైనా అప్పు తీర్చాలని ఆశయం. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వేలకోట్లు బకాయి పడిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ వాటిని చెల్లించే ప్రసక్తే లేదని బల్లగుద్ది నిస్సిగ్గుగా చెప్పారు. మరోపక్క ఇదే బ్యాంకుకు మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి తనయుడు అనిల్ శాస్త్రి తన తండ్రి చేసిన కారు రుణం అప్పు తాలూఖా పైసాతో సహా చెల్లించేశారు. 1964లో ప్రధాని హోదాలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి రూ.12000కు పాత ఫియట్ కారును చూశారు. తన దగ్గర రూ.7 వేలు మాత్రమే ఉన్నాయి. చివరకు పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.5 వేలు రుణం ఇచ్చింది. వాటితో కారును కొన్నారు. 1966లో ఆయన చనిపోగానే తల్లి ఆదేశంపై శాస్త్రి తనయులు ఐదు వేల అప్పు తీర్చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



శ్రీ శక్తి

"సోషల్ మీడియా ద్వారా బాల్య మిత్రులం కలిశాం. నలుగురికీ ఉపయోగపడే పనేదైనా చేద్దాం అనుకున్నాం. సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నాం. 'ప్యూర్' అనే సంస్థను స్థాపించి పిల్లలు చదువుకోవడానికి ఉన్న ఆటంకాలను తొలగిస్తున్నాం. చదువుకోసమే కాకుండా అమ్మాయిల శానిటరీ హైజీన్ గురించి కూడా పని చేస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, అమెరికాలో కూడా మా సంస్థ ద్వారా ఈ పనులు చేస్తున్నాం" అంటున్నారు సోషల్ ఎంట్రప్రెన్యూర్ శైల తాళ్లూరి. 'ప్యూర్' ఫౌండర్, డైరెక్టర్ అయిన ఆమె అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్నప్పటికీ ఇక్కడ సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

ప్యూర్లీ విద్యార్థుల సేవ!

'ప్యూర్'(పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్) ఏర్పాటు విచిత్రంగా జరిగింది. నాలుగైదేళ్ల క్రితం నుంచి వాట్సాప్‌లో స్కూల్, కాలేజి గ్రూపులు ఏర్పాటుచేసుకునే ట్రెండ్ బాగా మొదలైంది కదా. అలా మా చిన్ననాటి స్నేహితులంతా కలిసి 2015లో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పుడు 'ప్యూర్'కి చైర్మన్‌గా ఉన్న విజయరామిరెడ్డి మా ముందు ఒక ప్రపోజల్ పెట్టాడు. 'మనమందరం బాగానే స్థిరపడ్డాం. కానీ మన స్నేహితుల్లో కొందరు సెటిలవ్వలేదు. ఓ ఆర్గనైజేషన్‌లా ఏర్పాటై వాళ్లకు ఏదైనా సాయం చేస్తే బాగుంటుందేమో' అన్నాడు. ఆ ప్రతిపాదనకు 'నో' చెప్పిన వాళ్లలో నేనే మొదటి దాన్ని. ఎందుకంటే మేమంతా అటుఇటుగా ఒకే ఏజ్ గ్రూప్‌లో ఉన్నాం. అందరికీ ఓపిక ఉంది. ఫ్రీగా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. వాళ్ల అవసరాలను గుర్తించి నైపుణ్యాలను పెంచే సాయం కావాలంటే చేద్దాం, 'అవకాశాలు కల్పిద్దాం' అన్నాను. దానికి అందరూ ఓకే అన్నారు.

> నాకు దైవభక్తి ఎక్కువ. తిరుపతికి మెట్లుఎక్కి వచ్చి, డబ్బులిచ్చి మొక్కు తీర్చుకుంటా అనుకున్నాను. కానీ కర్నూలు వరదలు నాలో మార్పు తెచ్చాయి. అన్నీ ఉన్న దేవుడికి నేను ఇచ్చే డబ్బులతో అవసరం ఉందా! ఆ వరదల ప్రభావం మహబూబ్‌నగర్ మీద కూడా పడింది. రెండు లక్షల రూపాయల విలువ చేసే వస్తువులను హైదరాబాద్‌లో ప్యాక్ చేయించి పంపించాను.

పొగరుగా మాట్లాడా అనిపించింది

గ్రూప్ ఏర్పాటు చేసుకున్న ఏడాది తరువాత ఒక రోజు రాత్రి పది గంటల ప్రాంతంలో మా అమ్మ నుంచి నాకో మెసేజ్ వచ్చింది. దాని సారాంశం - 'ఒక స్కూల్‌లో 210 మంది పిల్లలున్నారు. వాళ్లకి నోట్‌బుక్స్ ఇస్తావా' అని. మా స్నేహితుల వాట్సాప్ గ్రూప్‌లో అమ్మ పంపిన మెసేజ్ పెట్టాను. సాయం చేసేందుకు ఐదుగురు ముందుకు వచ్చారు. అంతలోనే అమ్మ నుంచి ఇంకో మెసేజ్. - 'వాళ్లకి స్టీల్ ప్లేట్స్ కూడా కావాలట' అని.

> నేను పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నాన్న బ్యాంకులో పనిచేసేవారు. అందుకని ఏ ఊళ్లో ఐదేళ్లకి మించి ఉండేవాళ్లం కాదు. అలా నెల్లూరులోని విశ్వభారతి స్కూల్లో నాలుగో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదివాను. ఆ స్కూల్ స్నేహితులతో కలిసే 'ప్యూర్' ప్రారంభించాను. ఏడో తరగతి తరువాత హైదరాబాద్‌కి వచ్చేశాం. నాన్న ఢిల్లీ, కడప తిరిగినా మేము హైదరాబాద్‌లోనే ఉండిపోయాం. ఈవ్ టీజింగ్‌ను తొమ్మిదో తరగతి నుంచే ఎదుర్కోవాల్సి వచ్చింది. నన్ను ట్యూషన్‌కి తీసుకెళ్లేందుకు అమ్మ బొడ్లో కత్తి పెట్టుకుని వచ్చేవారు. నా చదువు డిస్టర్బ్ కావడానికి అది కూడా ఒక కారణం. డిగ్రీ పూర్తవ్వగానే పెళ్లి చేశారు. 1998లో యుఎస్‌కి వచ్చేశాను. అప్పటి నుంచి ఇక్కడ పనిచేస్తున్నా. సొంతంగా రెండు స్టార్టప్ కంపెనీలున్నాయి. నాకు ఇద్దరు పిల్లలు. మా ఆయన కూడా ఐటి మేనేజర్. వాళ్లది వరంగల్ జిల్లా ఖాజీపేట్.



అప్పుడు నేనే మూడ్‌లో ఉన్నానో తెలియదు. 'ఎన్ని అడుగుతారు. ఏదో ఒకటి అడగమను' అనేసి నిద్రపోయా. నా మాటలను వాళ్లకు చెప్పారు అమ్మ. ఆ స్కూల్ వాళ్లు ఎనిమిదో తరగతి పిల్లల్ని "మనకు ఏదో ఒకటి మాత్రమే సాయం చేయగలరట. పుస్తకాలా? ప్లేట్లా? ఏవి అడుగుదాం" అని అడిగారట. దానికి పిల్లలు 'ప్లేట్లు ఉన్నవి వాడుకుందాం. పుస్తకాలు ఇవ్వమ'నండి అన్నారట. నేను పొద్దున్నే లేచి అమ్మకి ఫోన్ చేసి రాత్రి ఏదో చిరాకులో అలా మాట్లాడానని చెప్పబోతుంటే... అమ్మ 'ఆ 210 మంది పిల్లలు స్కూల్‌కి వచ్చి చదువుకుంటున్న మొదటి తరం గిరిజన విద్యార్థులు. ఆ పిల్లలు మధ్యాహ్నం స్కూల్లో తిన్నదే భోజనం. అంతమంది పిల్లలకు 40 ప్లేట్స్ మాత్రమే ఉన్నాయి. ఆకలి తట్టుకోలేక ఒకరిద్దరు పిల్లలు కలిసి ఒకేసారి, ఒకటే ప్లేట్లో తింటున్నారట' అని చెప్పారు. అది విన్నాక ఆ ముందు రోజు ఎంత పొగరుగా మాట్లాడానో అర్థమైంది. తరువాత వాట్సాప్ గ్రూపులో అదే విషయం పెట్టాను. వాళ్లడిగిన పుస్తకాలు, ప్లేట్స్ ఇవ్వడమే కాకుండా ఆ స్కూల్‌కి పెయింట్స్ వేయించాం. బెంచీలు, ఎలక్ట్రిసిటీ ఏర్పాటుచేయించాం. ఈ మధ్య డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేసి రూమ్స్ కట్టించి, గ్రిల్స్ పెట్టించాం. ఇంతకీ ఆ స్కూల్ పేరు, అదెక్కడ ఉందో చెప్పనే లేదు కదూ! ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో బాసిత్‌గనర్ స్కూల్. కొన్నాళ్లకు ఆ స్కూల్ సమీపాన ఉన్న రింగిరెడ్డిపాలెం స్కూల్ నుంచి రిక్వెస్ట్ వచ్చింది. అప్పుడు నేను మిత్రులను "సంస్థ ఏర్పాటుచేద్దాం అన్నారు కదా. ఇప్పుడు మొదలుపెడదామ"ని అడిగాను. ఆరుగురు ముందుకొచ్చారు. మేము ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసుకున్నాం.

ప్యూర్‌తో అక్కడా... ఇక్కడా...

ఆలోచన అయితే వచ్చింది కానీ ఎలా ఏర్పాటుచేయాలో తెలియలేదు. నేను యుఎస్ సిటిజన్ కావడం వల్ల అధికారికంగా ఇండియాలో ఏమీ చేయలేను. చెప్తే నాటకీయంగా అనిపించొచ్చు కానీ.. రాత్రింబవళ్లు ఎలా ఏర్పాటుచేయాలని నెట్‌లో జల్లెడ పట్టాను. దాని గురించి చర్చల మీద చర్చలు చేసేవాళ్లం. ఆ చర్చల్లో కొందరు సమయం కేటాయించలేమని విరమించుకున్నారు. మిగిలిన వాళ్లం మొదలుపెట్టాం. వాళ్లంతా భారతీయ పౌరసత్వం ఉన్న వాళ్లే. అక్కడ ఉంటున్న వాళ్లే. కేవలం రవాణా ఖర్చులు మాత్రమే తీసుకుని పనిచేయాలని నిర్ణయించుకున్నాం. 'ద్రోణ' అనే పేరు అనుకున్నారు. ఎందుకో ఆ పేరుతో అంతగా కనెక్ట్ అవ్వలేకపోయాను. ట్రైబల్ పిల్లలకోసం చేస్తున్న పనికి ఆ పేరు బాగోదు అనిపించింది. అంతర్జాతీయంగా కూడా కనెక్ట్ అయ్యేలా ఉండాలనిపించింది. అప్పుడు పుట్టిందే 'ప్యూర్ - పీపుల్ ఫర్ రూరల్ అండ్ అర్బన్ ఎడ్యుకేషన్. సంస్థ అయితే ఏర్పాటు చేశాం. కానీ అందరికీ ఎవరి ఉద్యోగాలు వాళ్లకి ఉన్నాయి. అందుకని నిర్వహణ బాధ్యతలు చూడమని మా అమ్మని అడిగాం. మేం నెల్లూరులో ఉన్నప్పుడు 'విశ్వభారతి'లో టీచర్‌గా పనిచేసింది అమ్మ. వాట్సాప్ గ్రూప్ ఏర్పడింది కూడా అక్కడి బాల్య స్నేహితులతోనే. అందుకని ఆవిడని అందరం కలసి 'రెండేళ్లు ప్యూర్ సంస్థకి పనిచేయమ'ని అడిగాం. అలా ఆమెను మేనేజింగ్ డైరెక్టర్‌గా పెట్టాం.

యుఎస్‌లో నలుగురు డైరెక్టర్లతో జూన్‌లో రిజిస్టర్ చేశాం. మేము పెట్టుకున్న మొదటి నియమం ఎవరినీ నేరుగా ఫండ్స్ అడగకూడదు. చేయాలనుకుంటున్నది మంచి పని. ఎంతోమందికి సాయం చేయాలని ఉంటుంది. కానీ ఎలా? ఎక్కడ? చేయాలో తెలియక ఆగిపోయి ఉండొచ్చు. వాళ్లందరినీ కలిపేందుకు సోషల్ మీడియాను ఉపయోగించాలనుకున్నా. అవసరం గురించిన వివరాలతో ఫోటోలు పోస్ట్ చేస్తున్నా. దానికి ఎవరు కనెక్ట్ అయితే వాళ్లు ముందుకొచ్చి సాయం చేస్తారనే కాన్సెప్ట్. నా ఫేస్‌బుక్ నెట్‌వర్క్ పెంచుకున్నా. ప్యూర్‌కి నిధులు నా ఫేస్‌బుక్ వాల్ మీద నుంచే 95 శాతం వరకు సేకరిస్తున్నా.

మా వంతు ప్రయత్నం

డబ్బులు రావడం ఆలస్యం అదే వారంలో పని మొదలవుతుంది. అందుకే రెండేళ్లలో పాతికవేల మంది పిల్లల్ని, 150 స్కూల్స్‌ని చేరుకోగలిగాం. ప్యూర్ సక్సెస్‌లో నాకెంత క్రెడిట్ ఉందో... అమ్మ సంధ్యా గోళ్లమూడిది కూడా అంతే ఉంది. మొదట్లో తెలంగాణలోనే ఎక్కువ ఫోకస్ పెట్టాం. ఇప్పుడు ఆంధ్రాలో కూడా చేస్తున్నాం. మా లక్ష్యం ఒకటే... పిల్లలు స్కూల్‌కెళ్లి చదువుకునేందుకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించడమే. అదెలాగో ఒక ఉదాహరణ చెప్తా - మహబూబ్‌నగర్ జిల్లా తాడిపర్తి గ్రామంలోని స్కూల్‌లో 40 మంది పిల్లలు పక్క ఊళ్ల నుంచి రోజుకి ఐదు కిలోమీటర్లు నడిచి వస్తారు. వాళ్లకి సైకిళ్లు ఇప్పించాం. అలానే మొగిలిచర్లలో కూడా సైకిళ్లు ఇప్పించాం. ఆ సైకిళ్లను పదో తరగతి పూర్తయ్యాక స్కూల్‌లోనే ఉంచితే తరువాత వచ్చే పిల్లలకు ఉపయోగపడతాయని అనుకున్నారట వాళ్లంతా. ఆ నిర్ణయం ఎంత గొప్పదో కదా! సర్కిల్ ఆఫ్ గివింగ్. అలాగే కాలేజీలో చదువుకోవాలనుకునే అనాథ పిల్లలకి, ఒంటరి తల్లుల పిల్లలకి నెలవారీ ఖర్చులు ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పుడు 71 మంది పిల్లలు 'ప్యూర్' స్పాన్సర్‌షిప్‌లో ఉన్నారు. వాళ్లలో ఒక అబ్బాయి ఎంబిబిఎస్ చదువుతున్నాడు. ఇద్దరు ఇంజనీరింగ్, మిగతా వాళ్లు డిగ్రీ చదువుతున్నారు. ఐదుగురు దివ్యాంగులకి ఇంపోర్టెడ్ బయో ప్రొస్తటిక్ లింబ్స్ పెట్టించాం.

అవగాహన ముఖ్యం

పిల్లల చదువుతో పాటు అమ్మాయిల మెనుస్ట్రువల్ హైజీన్ కోసం 'ప్యూర్ ఫెమ్మె' కార్యక్రమాన్ని చేపట్టాం. మా సంస్థ మొదలుపెట్టిన రోజుల్లో "ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లల సంఖ్య ఎక్కువగానే ఉంది కదా. ఎందుకని మన దేశంలో అమ్మాయిలు తగ్గిపోతున్నారు" అంటున్నారని అడిగాను. అప్పుడు నా మనసుపై చెరిగిపోని సమాధానం చెప్పారు. ఎంత పేదరికంలో ఉన్నా అబ్బాయిని ప్రైవేటు స్కూల్‌కి పంపిస్తారు. అదే అమ్మాయిల్ని అయితే ఉచిత విద్య కాబట్టి ప్రభుత్వ పాఠశాలలకి పంపిస్తారని చెప్పారు. వీళ్లకేం చేయగలం? అని ఆలోచించా. స్కూల్స్‌లో బాత్రూమ్‌లను ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల మెనుస్ట్రువల్ క్లాత్స్ అందిస్తున్నాం. కొన్ని హైస్కూల్స్‌లో ఆడపిల్లలు యుక్త వయసుకు వచ్చాక బడికి రావడం మానేస్తున్నారు. నెలకి మూడు నుంచి ఐదు రోజులు గైర్హాజరు అవుతున్నారు. ఇందుకు కారణాలనేకం... శానిటరీ ప్యాడ్స్, క్లాత్స్ అందుబాటులో లేకపోవడం. పోషకాహారం సరిగా అందక అధిక రక్తస్రావం కావడం వంటివి ఉన్నాయి. ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టి, వాట్సాప్‌లో మాట్లాడితే 20 మంది ఒక గ్రూపుగా ఏర్పడ్డాం. మేమంతా కలిసి మెనుస్ట్రుపిడియా బుక్స్ అందిస్తున్నాం. వెండింగ్ మెషిన్లు, నాప్‌కిన్స్ డిస్ట్రాయ్ చేసే ఇన్సినరేటర్లు ఏర్పాటుచేస్తున్నాం. చౌకగా శానిటరీ నాప్‌కిన్లు అందించడం... అవి కూడా ఎకో ఫ్రెండ్లీగా ఉండేలా చూడడం వంటివి 'ప్యూర్ ఫెమ్' ద్వారా చేస్తున్నాం. శానిటరీ హైజీన్ గురించి టీచర్లలో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నాం. పిల్లల కోసం ఇంటరాక్టివ్ వర్క్‌షాప్స్ ఏర్పాటుచేస్తున్నాం. ఫెమ్ అండ్ హైజీన్ తరపున 2020 లోపు రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండున్నర లక్షల మంది అమ్మాయిలను చేరుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం."

• కిరణ్మయి

నగధగ



ఓణీలవేడుక వెలుగులు

ఆడపిల్లలను ముచ్చటగా అలంకరించి మురిసిపోయే వేడుక 'ఓణీల ఫంక్షన్'! మొదటిసారి వేసే ఓణీలు ఆడంబరంగా ఉండేలా చూసుకున్నట్టే, ఆభరణాల ఎంపిక, అలంకరణ కూడా అంతే ఘనంగా ఉండేలా చూసుకోవాలి. ఓణీల ఫంక్షన్‌లో సాంప్రదాయ నగలదే పెద్ద పీట అయినా, వాటికి కొంత ఆధునికత జోడించగలిగితే నేటితరం అమ్మాయిలకు ఆ వేడుక జీవితాంతం గుర్తుండిపోతుంది.

* **ఈ ఆభరణాలు తప్పనిసరి:** మెడలో పొడవాటి హారం, దానికంటే పొడవు తక్కువ ఉండే మరో హారం, వడ్డాణం, జూకాలు, గాజులు... వీలైతే జడ పూలు. ఇవీ... ఓణీల వేడుకలో వాడుకలో ఉన్న ఆభరణాలు. ఒకవేళ మెడలో రెండు హారాలకు బదులు ఒకే హారాన్ని ఎంచుకునేపనైతే, కాస్త భారీగా ఉండే మిడిల్ లెంగ్త్ హారాన్ని వేయవచ్చు. వెచ్చించే డబ్బును బట్టి ప్లెయిన్ గోల్డ్ లేదా వజ్రాల నగలను ఎంచుకోవచ్చు. అలాగే వేడుక





చేసే సమయాన్ని బట్టి కూడా నగల ఎంపికలో కొన్ని నియమాలు పాటించాలి. వేడుక ఉదయం అయితే పూర్తి బంగారంతో తయారైన నగలు బాగుంటాయి. అలాకాకుండా రాత్రి వేళ అయితే మెరిసే జాతి రాళ్లు, మరీ ముఖ్యంగా పోల్కి, కుందన్, మోజనైట్స్ లేదా వజ్రాల నగలైతే మిరుమిట్లు గొలుపుతూ ఆడపిల్లల అందాన్ని రెట్టింపు చేస్తాయి.

* **కాసుల పేరు, వరాల మాల:** ఓణీల వేడుకలో ఆడపిల్లలకు పోల్కి నెక్లెస్, కాసుల హారం కూడా వేసుకోవచ్చు. ఇవి సంప్రదాయ నగలు కాబట్టి కాసుల హారం పాత ఫ్యాషన్ అనుకోనవసరం లేదు. కాసుల హారం సుమారు 5 తులాల్లో తయారు చేయించుకోవచ్చు. వీటిలో తరుగు 12% వరకూ ఉంటుంది. కాసుల పేరు వద్దనుకునే వారికి, 'రాంపరి వరాల మాల' వేసుకోవచ్చు. ఇది ప్రస్తుత ట్రెండ్. మరీ భారీ నగలు ఎంచుకుంటే పిల్లలు పెద్దయ్యాక వేసుకోలేకపోవచ్చు. కాబట్టి 40 గ్రాముల మాలనే ఎంచుకోవటం మేలు. వీటిని తర్వాత అయినా మార్చుకోవచ్చు.
* **తక్కువ బరువులో:** మరీ భారీ ఆభరణాలు వద్దనుకుంటే, కాసుల పేరు 50 గ్రాముల్లో, నెక్లెస్ 40 గ్రాముల్లో, వడ్డాణం 100 గ్రాముల్లో ఎంచుకోవచ్చు. వడ్డాణం కొనలేకపోతే, బంగారు మెరుగు వేసిన వెండి నగలూ, గిల్టువీ దొరుకుతాయి. మాంగ్ టీకా (పాపడి బిళ్ల), చంపస్వరాలు, ముక్కు పుడక అలంకరించటం కూడా తాజా ఫ్యాషన్. ఇవి తక్కువ బరువులోనే దొరుకుతాయి. కాబట్టి తక్కువ బంగారంతో ఆడంబరంగా అలంకరించాలనుకుంటే వీటిని ఎంచుకోవాలి. వీటితో పాటు జడ బిళ్లలూ అలంకరించుకోవచ్చు.



మంజులా రావు,
మంజుల జ్యువెల్స్,
హైదరాబాద్.

హెయిర్ కేర్

స్టయిల్‌తో పాటు...

అమ్మాయిలు రకరకాల హెయిర్‌స్టైల్స్‌ను అనుసరిస్తూ ఉంటారు. కొత్త కొత్త హెయిర్‌స్టైల్స్ ట్రై చేస్తున్నప్పుడు తరచుగా చేసే కొన్ని పొరపాట్లు కురులను దెబ్బతీస్తాయి. వాటిని ఎలా నివారించవచ్చంటే...

- జుట్టు ఉంగరాలు తిరిగినట్టు కనిపించటానికి తడిగా ఉండగానే దువ్వి కొప్పు పెడతారు... జడ వేసుకుంటారు. ఇది దీర్ఘకాలంలో జుట్టుకు చెరుపు చేస్తుంది. జుట్టులో తేమ ఉంటే దువ్వేటప్పుడు చిక్కుపడి తెగిపోతుంది.
- జుత్తును బాగా వెనక్కి దువ్వటం చాలా మందికి అలవాటు. అలాచేస్తే జుత్తు పలచబడుతుంది. కొన్నాళ్లు వెనక్కి దువ్విన తరువాత గతంలోలా పాపిట తీస్తే జుత్తురాలుతుంది.
- నడినెత్తిన సెలబ్రిటీ స్టైల్‌లో ఉండే కొప్పు అందంగా ఉంటుంది నిజమే. కానీ కొప్పుపెట్టేందుకు జుట్టునంతా పైకి లాగికట్టటం వల్ల మాడు నొప్పి పుడుతుంది. కుదుళ్లు దెబ్బతిని జుట్టు పలచబడుతుంది.
- పోనీటెయిల్స్ కోసం తలముందు వెనుక భాగంలో జుత్తును బలంగా లాగి కడతారు. దీని ప్రభావం జుత్తు కుదుళ్ల మీద ఉంటుంది.
- జుత్తును కుదుళ్ల వరకూ పట్టి మాడు కనిపించేలా పాయలు పాయలుగా జడలు అల్లటం ఈ రోజుల్లో ఫ్యాషన్. ఇలా చేస్తే కాలక్రమేణా జుట్టు దెబ్బతిని రాలిపోతుంది.
- కాన్వెంట్‌కు వెళ్లే పిల్లలకు బిగుతుగా ఉండే జడలు వేస్తుంటారు. అలా జుత్తును పదే పదే పట్టిలాగటం వల్ల దెబ్బతింటుంది. కాస్త వదులుగానే జడలు వేయడం మంచిది.



ఔరా!

దారాసింగ్ థాలీ!



సాధారణంగా హోటల్‌కెళ్లి ప్లేట్‌మీల్స్... భోజనప్రియులైతే ఫుల్‌మీల్స్ ఆర్డరిస్తుంటారు. అయితే ముంబయిలోని పోవయ్ సరస్సును ఆనుకుని ఉన్న 'మినీ పంజాబ్స్' హోటల్లో 'దారాసింగ్ థాలీ' చూస్తే చాలు కడుపు నిండిపోతుంది. ఈ థాలీ ఆర్డర్ ఇవ్వాలంటే టేబుల్‌కు ఒక్కరే కూర్చోవాల్సి ఉంటుంది. ఎందుకంటే 33 పదార్థాలతో ఉన్న భారీ ప్లేట్ టేబుల్ మీదికి వస్తుంది. థాలీ ఆర్డర్ ఇవ్వగానే ముందుగా పానీపూరీ సర్వ్ చేస్తారు. ఆ తర్వాత పది నిమిషాలకు నోరూరించే రుచులతో 'దారాసింగ్ థాలీ' టేబుల్‌పై ప్రత్యక్షం అవుతుంది. అందులో కూరలు, పచ్చళ్లు, రోటీలు... ఇలా ఒకటేమిటి మొత్తంగా 33 పదార్థాలుంటాయి. వాటిలో కొన్ని మట్టి ముంతలో చేసినవి కూడా ఉంటాయి. ఆగండాగండి... తిండి కథ ఇక్కడితోనే ఆగిపోదు... కడుపునిండా భోంచేసిన తర్వాత మరో చిన్న ప్లేట్‌లో గులాబ్‌జామ్, జిలేబీ, డబుల్ కా మీఠావంటి ఆరు రకాల స్వీట్లు సర్వ్ చేస్తారు. ఈ 'దారాసింగ్' భోజనం ఖరీదు 1,154 రూపాయలు.



ట్రై చేయండి

ఇలా క్లిక్ కొట్టండి!



స్టార్ వెకేషన్

రైళ్ళూ, బస్సులే బెటర్!



ట్రావెల్ గైడ్

విశ్వ యోగ వేదిక!



అంతర్జాతీయ యోగా ఫెస్టివల్

విహంగాల కొలువు..



విహారాల నెలవు!

కొల్లేరు సరస్సు.. అపురూపమైన వలస పక్షులకు విడిది కేంద్రంగా, ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టుగా ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. అంతే కాదు, ఆధ్యాత్మికంగా కూడా దీనికి ప్రాధాన్యత ఉంది. మనసు తీరా హాయిహాయిగా విహరించాలను కొనే వారిని తన అందాలతో ఆహ్వానించే కొల్లేరును సందర్శించాలనుకుంటున్నారా? అయితే ఈ వివరాలు మీ కోసమే...

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దుల్లో- కృష్ణా జిల్లా కైకలూరు మండలంలోని కొల్లేరు పరిసరాలకు పెలికాన్ పక్షులు ప్రతి ఏటా- నైజీరియా నుంచి లక్షల మైళ్ల దూరం ప్రయాణించి, వలస వస్తాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చే ఈ పక్షులు ఇక్కడ వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకొని ఫిబ్రవరి నెలా...





మన దగ్గరే

- వి.కృష్ణప్రసాద్, గుడివాడ

పుణ్యతీర్థం

బేత్రాయిసామి దేవుడి బ్రహ్మోత్సవం!







ఈ-జీ ట్రావెల్

లెక్క తేలుస్తుంది!



నవ్య సకల

ప్రస్తుతం తెలుగు చిత్రపరిశ్రమలో ఎక్కడ చూసినా ఒకే అంశం గురించి చర్చ జరుగుతోంది.. మార్చి ఒకటి నుంచి థియేటర్ల బంద్ ఉంటుందా అని!. మార్చిలో సినిమాలు విడుదల చేయడానికి ప్లాన్ చేసుకొన్న నిర్మాతల బీపీ పెంచుతున్న అంశమిది. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, నిర్మాతల్ని, పంపిణీదారుల్నీ నిలువునా దోచుకొంటున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ దారికి వస్తే సరి .. లేకపోతే మార్చి ఒకటి నుంచి థియేటర్లు మూసి వేయడానికి తెలుగు ఫిల్మ్ చాంబర్ కృతనిశ్చయంతో ఉంది. తమిళనాడు, కేరళ, కర్నాటక ఫిల్మ్ చాంబర్స్ కూడా ఇందుకు సై అంటూ నిరసనగళం వినిపించడంతో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌పై పోరు తీవ్రమైంది. ఇలా ఐదు రాష్ట్రాల్లో థియేటర్లు మూతపడితే, మార్చి ఒకటి నుంచి సౌతిండియన్ సినిమాలేవీ రిలీజ్ కావు:

డిజిటల్ సినిమా



థియేటర్ల మూత తప్పదా?

అమెరికాలో అలా మొదలైంది!

మనదేశంలో పరిస్థితి ఇలా...




ఈస్టిండియా కంపెనీ తరహా మోసం

తగ్గింపు ఉంటే లేదు!

ఇంకా? ఇక్కడ చెల్లు

ప్రధాన డిమాండ్లు ఇవే!

- వినాయకరావు



డి. సురేశ్‌బాబు




జెమిని కిరణ్



- ముత్యాల రామదాసు

డైలీ సుడోకు - 113



ఎలా పూరించాలి?

సుడోకు - 112 సమాధానం

మీకు మీరే డాక్టర్


పులిపిర్లకు భలే మందు



కౌన్సెలింగ్ కార్నర్

ఊపిరాడటం కష్టంగా ఉంది!

- డి. సంజీవ్, కామారెడ్డి



హోమియో చికిత్స

- డాక్టర్ బి. సోహన్ సింగ్,

దేవేరుల నడుమ శ్రీనివాసుడు


రాశీ ఖన్నా


నితిన్


నందితా శ్వేతా

శ్రీనివాసుడు... ఏడు కొండలవాడు... వెంకటేశ్వరునికి ఇద్దరు దేవేరులు. ఒకరు అలివేలు మంగమ్మ... ఇంకొకరు పద్మావతీ దేవి. నితిన్ హీరోగా 'శతమానం భవతి' ఫేమ్ సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మించనున్న చిత్రం 'శ్రీనివాస కల్యాణం'. ఇందులో ఇద్దరు హీరోయిన్లకు చోటుంది. వాళ్ళిదద్దరూ ఎవరో కాదు... రాశీ ఖన్నా, 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' ఫేమ్ నందితా శ్వేతా! ఈ చిత్రంలో హీరోయిన్లుగా పూజా హెగ్డేతో పాటు పలువురు పేర్లు వినిపించాయి. చిత్రబృందం మాత్రం నితిన్ సరసన రాశి, నందితలను ఫైనలైజ్ చేసింది. వచ్చే నెల మార్చి మొదటివారంలో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా చిత్రాన్ని ప్రారంభించనున్నారు. మార్చి రెండో వారం తర్వాత చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. హిందూ వివాహంలోని పవిత్రతను, సంప్రదాయాన్ని తెలిపే కథాంశంతో ఈ చిత్రం రూపొందనుందని సమాచారమ్. ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ స్వరకర్త.

భరత్... సూర్య... మాట్లాడుకుంటున్నారు!


లగడపాటి శ్రీధర్, నదియా, అర్జున్, అల్లు అర్జున్, వక్కంతం వంశీ, అను, విద్య, బన్ని వాసు

మహేశ్‌బాబు 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' చిత్రాలు ఏప్రిల్ 26న విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే రెండు భారీ చిత్రాలు ఒకే రోజున విడుదల కావడం మంచిది కాదని చిత్రపరిశ్రమ పెద్దలు భావిస్తున్నారు. అందుకని, నిర్మాతలు అల్లు అరవింద్, కేఎల్ నారాయణ, 'జెమిని' కిరణ్ నేతృత్వంలోని బృందం ఇరు చిత్రాల నిర్మాతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. 'భరత్ అనే నేను' నిర్మాత డీవీవీ దానయ్య, 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' నిర్మాతలు లగడపాటి శిరీషా శ్రీధర్, 'బన్నీ' వాసుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. హీరోలు కూడా ఈగోలకు పోకుండా సహకరించడానికి ముందుకొచ్చారని సమాచారం. ఈ రోజు ఏ చిత్రం ఎప్పుడు విడుదలయ్యేదీ తెలిసే అవకాశాలున్నాయి. రెండిటిలో ఏదో ఒక చిత్రం విడుదల తేదీ మారడం ఖాయమని స్పష్టమవుతోంది. సో... భరత్, సూర్యల మధ్య పోటీ లేనట్లే! ప్రస్తుతం రెండు చిత్రాల చిత్రీకరణలు చివరి దశలో ఉన్నాయట! 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' చిత్రదర్శకుడు వక్కంతం వంశీ పుట్టినరోజు వేడుకలు బుధవారం సెట్‌లో చిత్రబృందం సమక్షంలో జరిగాయి.

అహం బ్రహ్మాస్మి


క్రిష్

'గమ్యం', 'వేదం', 'కృష్ణంవందే జగద్గురుమ్', 'కంచె', 'గౌతమిపుత్ర శాతకర్ణి'... క్రిష్ దర్శకత్వం వహించిన ప్రతి చిత్రానికి తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పదనం తెలిసేలా చక్కటి టైటిల్స్ పెట్టారు. ఆయన చిత్రాలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో... టైటిల్స్ కూడా అంతే వైవిధ్యంగా ఉంటాయి. ప్రస్తుతం ఝాన్సీలక్ష్మీభాయ్ జీవితకథ ఆధారంగా హిందీలో కంగనా రనౌత్ ముఖ్యతారగా 'మణికర్ణిక' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న క్రిష్, ఆ తర్వాత తెలుగులో చేయనున్న చిత్రానికి 'అహం బ్రహ్మాస్మి' టైటిల్ ఖరారు చేశారు. భారీ నిర్మాణ వ్యయంతో, ఉన్నత సాంకేతిక విలువలతో సాయిబాబు జాగర్లమూడి, రాజీవ్‌రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రంలో స్టార్ హీరో నటించనున్నారని, ప్రస్తుతం ఆయనతో చర్చలు జరుపుతున్నామని చిత్రబృందం ప్రకటించింది. ఆగస్టులో చిత్రీకరణ ప్రారంభిస్తామన్నారు.

వెయిట్ చేస్తే... చేస్తూ ఉండాల్సిందే!


భావన

"అత్యుత్సాహంతో వేగవంతంగా సినిమాలు చేసేయాలని నాకెప్పుడూ లేదు. గంగిగోవు పాలు గరిటెడైనా చాలు అనే సిద్ధాంతం నాది. చేసేవి తక్కువ చిత్రాలే అయినా మనసుకు నచ్చిన వాటినే ఎంపిక చేసుకుంటాను. పెళ్లితో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ ఉండాలనేదే నా కల. కాకపోతే అవి మహిళా ప్రాధాన్యత గల సినిమాలు మాత్రమే అనే నిబంధనలు పెట్టుకోలేదు. ఒకవేళ అలాంటివాటి కోసం వేచి చూస్తే.. జీవితాంతం వేచి చూస్తూ ఉండాల్సిందే" అని అన్నారు భావన. పాదాల పారాణి ఆరని కొత్త పెళ్లికూతురు ఆమె. వైవాహిక జీవితం గురించి మాట్లాడుతూ "పెళ్లికి ముందూ, తర్వాత అనే తేడా నాకేం తెలియడం లేదు. నాకు నవీన్ (భావన భర్త) కుటుంబంతో ఆరేళ్ల పరిచయం ఉంది. ఇంతకుముందు కూడా వాళ్లతో ఉన్నాను. కాకపోతే అంగీకరించాల్సిన ఓ మంచి విషయం ఏంటంటే.. ఇంతకు ముందుతో పోలిస్తే ఇప్పుడు మరింత ప్రశాంతంగా సేదదీరుతున్నాను" అని తెలిపారు. కెరీర్ గురించి మాట్లాడుతూ "కెరీర్ ప్రారంభంలో ఇబ్బడిముబ్బడిగా సినిమాలు చేశాను. ఒక షూటింగ్ లొకేషన్ నుంచి మరో సినిమా సెట్‌కు పరుగులు తీసిన రోజులు కూడా ఉన్నాయి. అయితే నాకు ఆ జీవనశైలి కొన్నిసార్లు విసుగు తెప్పించేది. అందుకే 2010-11 మధ్య కావాలనే సినిమాలు తగ్గించుకున్నాను. అప్పటినుంచి ఏడాదికి రెండు సినిమాలకే పరిమితమయ్యాను. అది కూడా కొన్నాళ్లకు నచ్చలేదు. నన్ను ఎగ్జయిట్ చేసిన పాత్రలను మాత్రమే చేయసాగాను. మిగిలిన సమయాన్ని నా హితులతోనూ, సన్నిహితులతోనూ గడపగలిగాను. భవిష్యత్తులోనూ అత్యుత్తమ పాత్రలు వస్తే తప్పకుండా చేస్తా. పెళ్లితో కెరీర్‌కి ఫుల్‌స్టాప్ పెట్టాలనుకోవడం లేదు. దేని దారి దానిదే. మంచి చిత్రాల్లో తప్పకుండా నటిస్తా. కాకపోతే మరీ తొందరేమీ లేదు" అని అన్నారు.

'జువ్వ'లో పోస్టర్స్ వేస్తుంటా!

- రంజిత్



"'జువ్వ'లో నా పేరు రానా. నాకు పోస్టర్స్ వేయడమంటే చాలా ఇష్టం. ఓ సందర్భంలో హీరోయిన్‌కి పోస్టర్ వేస్తాను. అది ఎందుకు? ఏమిటి? అసలు పోస్టర్స్ వేయడం అంటే ఏంటి? తెలుసుకోవాలంటే 'జువ్వ' చూడాల్సిందే" అని అంటున్నారు రంజిత్. ఆయన హీరోగా నటించిన 'జువ్వ' ఈ శుక్రవారం విడుదల కానుంది. రంజిత్ మాట్లాడుతూ "నాకు చిన్నప్పటి నుంచి నటనంటే చాలా ఇష్టం. వైజాగ్ సత్యానంద్‌గారి దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత ఎంబీఏ చదువుతూ చాలా ఆడిషన్స్‌కి వెళ్లాను. ఎక్కడా ఏ పాత్రా సంతృప్తిగా అనిపించలేదు. ఇంతకు ముందు 'నువ్వు నేను ఒకటవుదాం' సినిమాలో నటించాను. ఆ తర్వాత మేమే సొంతంగా సినిమా చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. 'జువ్వ'ను మా బ్రదర్ డాక్టర్ భరత్ నిర్మించారు. ముందు అనుకున్నదానికన్నా బడ్జెట్ పెరిగినప్పటికీ , ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా తెరకెక్కించారు. రత్నంగారు మంచి కథనిచ్చారు. త్రికోఠి చాలా డిఫరెంట్‌గా తెరకెక్కించారు. కీరవాణి రీరికార్డింగ్ హైలైట్ అవుతుంది. ఈ చిత్రానికి 'జువ్వ' అనే టైటిల్‌ని కూడా ఆయనే సూచించారు. పాటలకు మంచి స్పందన వస్తోంది. అన్నీ వాణిజ్య విలువలున్న సినిమా ఇది" అని చెప్పారు.

అనాథలు లేని సమాజం


అక్షిత, సాత్విక్ ఈశ్వర్

సమాజంలో అనాథలుగా ఎవరూ మిగలకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి తెరకెక్కిస్తోన్న చిత్రం 'సత్య గాంగ్'. సాత్విక్ ఈశ్వర్, అక్షిత ఒక జంటగా, ప్రత్యూష్, హర్షిత మరో జంటగా నటిస్తున్నారు. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేశ్ ఖన్నా నిర్మిస్తున్నారు. పాటల సక్సెస్ వేడుకను బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాత మాట్లాడుతూ 'మా దర్శకుడు ప్రభాస్ వినసొంపైన బాణీలిచ్చారు. ఇటీవల కర్నూలులో ఘనంగా పాటల్ని విడుదల చేశాం. విన్నవారందరూ బావున్నాయని మెచ్చుకుంటున్నారు. మా హీరో సాత్విక్ ఈశ్వర్‌కి చక్కటి భవిష్యత్ ఉంది. మార్చి 15న సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు. నిర్మాత సహకారం వల్లనే సంగీతం, సినిమా బాగా వచ్చాయని దర్శకుడు ప్రభాస్ చెప్పారు. మంచి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని ఈరో సాత్విక్ ఈశ్వర్, నాయిక అక్షిత అన్నారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

లక్ష్మీకళ మల్టీప్లెక్స్ - మూసాపేట్ 2.45PM
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 4.40PM
లక్ష్మి 70 - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30

నర్తకి 70 - ఖమ్మం | బృందావన్ - ఆర్మూర్ | వెంకటేశ్వర - నిర్మల్
సాయికృష్ణ 70 ఎ/సి - కరీంనగర్ | రంగ 70 - వనపర్తి | అనురాగ్ - జహీరాబాద్
జయ డీలక్స్ - పరకాల | నవరంగ్ - గద్వాల్ | శారద 70 - పరిగి
వెంకటేశ్వర - తొర్రూర్ | దేవి 70 ఎ/సి - జడ్చర్ల | లక్ష్మి 70 - అచ్చంపేట
లక్ష్మి 70 - మరిపెడ | పార్థసారథి - కల్వకుర్తి | భవాని - కొత్తకోట
అన్నపూర్ణ - హుజూరాబాద్ | కృష్ణప్రియ - కోదాడ | వెంకటేశ్వర - చేవెళ్ళ
 | కేజేఆర్ సినిమా - భువనగిరి | గణేష్ - ఆదిలాబాద్



సంధ్య 35 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

అర్జున్ 70 - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ప్రశాంత్ - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
సత్యం 70 - అమీర్‌పేట 11.30,2.30,6.30,9.30
స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్ 2.15,9.00
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15

PRASADS 2.30,5.55,10.50 | Cinemas Ameerpet 11.00,7.40PM
PVR 10.45,4.55,10.40 | Cinemas Shamirpet 11.00,7.30PM
PVR 1.10,7.40 | Cinepolis 10.40,4.50
PVR 10.35,4.10,10.50 | Cinepolis ఎ/సి 11.00AM
PVR 10.10,1.20,7.30,10.40 | Cinepolis ఎ/సి - 4.45PM
INOX 11.00,1.50,5.00 | TIVOLI 10.45AM,10.30PM
INOX ఎ/సి - 1.35PM | Cine Planet 10.50,4.20,7.45,10.20
10.00AM,10.30PM | ASIAN దిల్‌సుఖ్‌నగర్ 6.15PM
T ఎ/సి - 2.15,9.15 | Cinetown ఎ/సి - 11.15AM
ASIAN 10.40,1.20,7.25,10.35 | MULTIPLEX ఎ/సి - 5.30PM
CINEPRIDE 11.15,2.30,6.15,9.45 | ASIAN 11.30,6.30
ASIAN 10.40,4.40,7.40 | ASIAN 1.45,7.40
ASIAN 7.40,10.40 | GEETHA ASIAN ఎ/సి - 1.40PM
ASIAN RADHIKA కాప్రా 4.40,7.30

మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 6.15,9.15PM
శ్రీకృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి 70 ఎ/సి - రామచంద్రాపురం 11.15,2.15,6.15,9.15
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
ఇంద్ర 70 - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
రుక్మిణి 70 - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
GLOBAL CINEMAS RELEASE



విజయవంతమైన 49వ రోజు
సప్న 35 - ఆబిడ్స్ 11.30AM
శివశక్తి 70 - తాండూర్

కడుపుబ్బా నవ్వించే కామెడీ ఎంటర్‌టైనర్



శ్రీమయూరి 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15

రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
సప్న సినిమా - అబిడ్స్ 2.30,6.00,9.15
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30AM
PVR ఇనార్బిట్ మాల్ మాదాపూర్ 4.15PM
PVR గల్లేరియా పంజాగుట్ట - 1.40PM
PVR ఫోరం మాల్ కూకట్‌పల్లి 4.35PM

వెంకటరామ - వరంగల్ | భువనేశ్వరి - ఐజ | మహేశ్వరి - రాయ్‌కల్
వెంకటసాయి - కరీంనగర్ | నవరంగ్ - గద్వాల్ | శ్రీదేవి 70 - చెర్ల
సాగర్ డీలక్స్ - మెదక్ | లలిత 70 - ఇల్లందు | శ్రీలక్ష్మి 70 - డోర్నకల్
సినీమ్యాక్స్ - జహీరాబాద్ | హరిహర - జమ్మికుంట | లక్ష్మి - శంకరంపేట
శ్రీనివాస - మహబూబాబాద్ | శాంతి - పాల్వంచ | కనకాచల్ - కొప్పల్
లక్ష్మి 70 ఎ/సి - సిరిసిల్ల | వెంకటేశ్వర - ఆమన్‌గల్ | తిరుమల - గజ్వేల్
కేజేఆర్ 70 - భువనగిరి | బాలాజి - దమ్మపేట | SSV గణేష్ - షాద్‌నగర్
శ్రీనివాస - తాండూర్ | నరసింహ - ఎన్కూర్ | వెంకటేశ్వర - కోదాడ
వెంకటేశ్వర - బాన్సువాడ | వెంకటేశ్వర - మరిపెడ |

SB ART CREATIONS RELEASE - 9985502122



సప్న 35 - ఆబిడ్స్ 2.30,6.00,9.00

CINEPRIDE మూసాపేట్ 11.30AM | రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 9.15PM
T ఇ.సి.ఐ.ఎల్ 11.15AM | ASIAN - 10.30AM | PVR - 4.45 PM
Cine Planet - 10.30AM | ASIAN - 10.30AM | PVR -1.15 PM
మహేశ్వరి - మహబూబ్‌నగర్ | కేజేఆర్ - భువనగిరి | భువనేశ్వరి - ఐజ | శివశక్తి - తాండూర్
గణేష్ - ఆదిలాబాద్ | బృందావన్ - వనపర్తి | నవరంగ్ - గద్వాల్ | కృష్ణ 70 - సత్తుపల్లి

SRI RANJITH MOVIES RELEASE - 9849761038




సుదర్శన్ 35 ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 11.00,2.15,5.45,9.15
Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
లక్ష్మీకళ సినీప్రైడ్ ఎ/సి - మూసాపేట 11.30AM,6.30PM

PRASADS 12.25,8.00PM | PVR ఎల్ & టి 10.40,4.40,10.40 | PVR 4.30PM | Cinepolis 1.35PM | 4.45PM
PVR -1.55PM | PVR 3.00PM | INOX 2.15PM | Cinepolis 1.10PM | MULTIPLEX ఎల్బీనగర్
PVR 7.30PM | | INOX 2.10PM | Cinepolis 2.05PM | ఎ/సి - 7.15PM

ప్రతిమ మల్టీప్లెక్స్ - కరీంనగర్ | తిరుమల 70 - ఖమ్మం | రామ్ 70 ఎ/సి - వరంగల్
శ్రీసాయికృష్ణ - కరీంనగర్ | లలిత మహల్ - నిజామాబాద్ | నటరాజ్ - జగిత్యాల | గణేష్ - షాద్‌నగర్

రేపే బ్రహ్మాండమైన విడుదల



శ్రీమయూరి 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 6.15PM
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15AM
PRASADS ప్రసాద్స్ - ఎన్టీఆర్ గార్డెన్స్ 1.10PM
Cine Planet మల్టీప్లెక్స్ ఎ/సి - కొంపల్లి 10.55AM
తాళ్లూరి - ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 9.15PM
ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్ 1.20PM
ASIAN జిపిఆర్ ఎ/సి - కూకట్‌పల్లి 4.40PM
ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్ 10.45PM
ASIAN RADHIKA రాధిక మల్టీప్లెక్స్ - కాప్రా 11.00AM
TIVOLI టివోలి ఎ/సి - సికింద్రాబాద్ 2.15PM
Cinemas AMEERPET బిగ్ సినిమాస్ - అమీర్‌పేట 7.30PM

PVR మాదాపూర్ | Cinepolis ఎ/సి - కూకట్‌పల్లి | MULTIPLEX ఎల్.బి.నగర్
PVR బంజారాహిల్స్ | Cinepolis మల్కాజ్‌గిరి | ASIAN ఎ/సి - చింతల్
PVR పంజాగుట్ట | Cinepolis ఎ/సి - అత్తాపూర్ | ASIAN హన్మకొండ
PVR కూకట్‌పల్లి | దిల్‌సుఖ్‌నగర్ | GEETHA ASIAN నిజామాబాద్
INOX బంజారాహిల్స్ | ASIAN దిల్‌సుఖ్‌నగర్ | ఎ/సి - కరీంనగర్
INOX ఎ/సి - కాచిగూడ | Cinetown మియాపూర్ | ఎ/సి - వరంగల్
Cinemas ఎ/సి - శామీర్‌పేట్ | |

లక్ష్మణ్ 70 - వరంగల్ | శ్రీరమణ - నాగర్‌కర్నూల్ | శ్రీనివాస - నర్సాపూర్
రాజా డీలక్స్ - కరీంనగర్ | మహేశ్వరి - నారాయణపేట | భువనేశ్వరి 70 - ఐజ
బాలాజి 70 ఎ/సి మహబూబ్‌నగర్ | సత్యలక్ష్మి - అచ్చంపేట | సాయికృష్ణ - కోదాడ
 | బాలాజి - సిద్దిపేట | వెంకటేశ్వర - ఆమన్‌గల్
శ్రీనివాస - తాండూర్ | తిరుమల - గజ్వేల్ | శ్రీదేవి 70 - కొత్తకోట
రాఘవేంద్ర - జడ్చర్ల | SSV గణేష్ - షాద్‌నగర్ | సత్యసాయి - కొల్లాపూర్

AMAZING ARTS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



రాజధాని కాంప్లెక్స్ - ఎ/సి దిల్‌సుఖ్‌నగర్ 6.15,9.15

అంజలి - సికింద్రాబాద్ 11.15,2.15,9.15,9.15
లక్ష్మీకళ - మూసాపేట్ 11.15AM
సంతోష్/సప్న కాంప్లెక్స్ ఎ/సి - ఆబిడ్స్ 11.30AM
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 2.15,9.15
మెట్రో 70 ఎంఎం ఎ/సి - బహదూర్‌పుర 6.00,9.00
BVK విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
తాళ్లూరి - ఇసిఐఎల్ క్రాస్‌రోడ్స్ 2.15PM
మహాలక్ష్మి కాంప్లెక్స్ ఎ/సి - కొత్తపేట
సెలెక్ట్ - మచ్చబొల్లారం 12.00,3.00,7.00,10.00
వెంకటసాయి - కీసర 11.00,2.00,6.00,9.00
ASIAN శ్రీదేవిమాల్ - హన్మకొండ 10.55AM
GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామబాద్ 10.30AM

PRASADS ఎన్.టి.ఆర్ గార్డెన్ | Cinemas ఎ/సి - శామీర్‌పేట్ | ASIAN ఎ/సి - కూకట్‌పల్లి
PVR మాదాపూర్ | Cinepolis ఎ/సి - కూకట్‌పల్లి | ASIAN ఎ/సి - అత్తాపూర్
PVR బంజారాహిల్స్ | Cinepolis మల్కాజ్‌గిరి | ASIAN RADHIKA ఎ/సి - కాప్రా
PVR పంజాగుట్ట | Cinepolis ఎ/సి - అత్తాపూర్ | ASIAN దిల్‌సుఖ్‌నగర్
PVR కూకట్‌పల్లి | TIVOLI సికింద్రాబాద్ | Cinetown మియాపూర్
INOX బంజారాహిల్స్ | Cine Planet ఎ/సి - కొంపల్లి | ASIAN ఎ/సి - చింతల్
INOX ఎ/సి - కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | ఎ/సి - కరీంనగర్
Cinemas ఎ/సి - అమీర్‌పేట్ | ASIAN ఎ/సి - ఉప్పల్ | ఎ/సి - వరంగల్

కిన్నెరసాని - ఖమ్మం | అశ్విని - తొర్రూర్ | వెంకటేశ్వర - బాన్సువాడ
శివ 70 - కరీంనగర్ | వెంకటేశ్వర - మరిపెడ | సాగర్ - మెదక్
మయూరి - మంచిర్యాల | పరమేశ్వరి - షాద్‌నగర్ | రాజశ్రీ - రాయికల్
సినీమ్యాక్స్ - జహీరాబాద్ | నటరాజ్ - జగిత్యాల | వెంకటేశ్వర - మరిపెడ
బాలాజి - సత్తుపల్లి | రామకృష్ణ 70 ఎ/సి - నాగర్‌కర్నూల్ | వెంకటేశ్వర - తిరుమలగిరి
శాంతమహల్ - తాండూర్ | | లలిత - ఇల్లందు
తేజ మ్యాక్స్ - సూర్యాపేట | శ్రీనివాస - సిద్దిపేట | తిరుమల - గజ్వేల్
అశ్విని 70 - తొర్రూర్ | |
కేజేఆర్ - భువనగిరి | |

M G M RELEASE 9296509333 9989522999

రేపే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

కోణార్క్ 70 ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

PRASADS మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్ | INOX ఎం.పి మాల్ - కాచిగూడ | మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ | Cinetown మియాపూర్ 11.15,6.15
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | Cinemas అమీర్‌పేట్ 2.00,7.40 | T ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 11.00,6.00 | MULTIPLEX 11.15,1.50,4.30,10.00
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్ | Cinemas శామీర్‌పేట్ 4.50,10.30 | ASIAN ఉప్పల్ 10.35,7.25,10.15 | ASIAN చింతల్ 11.30,2.30,6.30
PVR సెంట్రల్ మాల్ - పంజాగుట్ట | Cinepolis మంజీరా మాల్ - కూకట్‌పల్లి | CINEPRIDE మూసాపేట్ 11.15,2.30,6.15,9.15 | ASIAN హన్మకొండ 10.10,1.25,7.15
PVR ఎల్ అండ్ టి మాల్ - పంజాగుట్ట | Cinepolis CCPL ఎ/సి - మల్కాజ్‌గిరి | ASIAN కూకట్‌పల్లి 10.40,1.30,7.20 | GEETHA ASIAN నిజామాబాద్ 10.50,1.40,7.20
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి | Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్ | ASIAN అత్తాపూర్ 10.30,4.35,7.40 | ప్రతిమ ఎ/సి - కరీంనగర్
PVR ఐకాన్ మల్టీప్లెక్స్ - హైటెక్‌సిటీ | TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్ | ASIAN RADHIKA కాప్రా 10.45,4.30,7.20 | 12.50,4.00,6.50,10.10
INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్ | Cine Planet కొంపల్లి 10.30,7.45,10.40 | ASIAN దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.00,6.15 |

మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00
మంజు - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
అర్జున్ - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
శ్రీకృష్ణ - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
ఇంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
జ్యోతి - ఆర్సీపురం 11.15,2.15,6.15,9.15
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,2.15,6.00,9.00
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.15,2.15,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30
శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
లక్ష్మి కళామందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
శ్రీరామ - బహదూర్‌పుర 11.30,2.30,6.30,9.30
సాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి - ఐడిఏ బొల్లారం 11.00,2.00,6.00,9.00
రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
శివరంజిని డీలక్స్ - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
శారద 70 ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00
కళ్యాణి - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
గణేష్ - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30
కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00

జెమిని కాంప్లెక్స్ - వరంగల్ | నవ్య - సూర్యాపేట | లక్ష్మి 70 - తాండూర్ | కాకతీయ - పరకాల | లక్ష్మి 70 ఎ/సి - మాల్ | శివరామకృష్ణ - వేములవాడ
వెంకటరామా - వరంగల్ | శ్రీనివాస - గోదావరిఖని | శ్రీరామ - జగిత్యాల | భవాని - కాజిపేట | శ్రీనివాస - సత్తుపల్లి | శ్రీనివాస - చొప్పదండి
విజయ - హన్మకొండ | వెంకటేశ్వర - మంచిర్యాల | సాయికృష్ణ - మెట్‌పల్లి | వెంకటరామ - మహబూబాబాద్ | సీతారామ - ఇల్లందు | రామకృష్ణ - బెల్లంపల్లి
ఆదిత్య 70 - ఖమ్మం | ప్రియ - కామారెడ్డి | హరిహర మహల్ - జమ్మికుంట | మహేశ్వరి - సదాశివపేట | శాంతి - పాల్వంచ | తిరుమల - సిసి నర్సాపూర్
వెంకటేశ్వర - కరీంనగర్ | తిరుమల - నిర్మల్ | సాయిబాబా - షాద్‌నగర్ | సంతోష్ - రామాయంపేట | శ్రీదేవి 70 - చెర్ల | లక్ష్మి - ఖానాపూర్
శ్రీదేవి - నిజామాబాద్ | వెంకటేశ్వర - సిద్దిపేట | వెంకటరామ - జడ్చర్ల | సాయి డీలక్స్ - నర్సాపూర్ | సత్యభాస్కర్ - మణుగూరు | లక్ష్మి 70 - సిరిసిల్ల
నటరాజ్ - ఆదిలాబాద్ | సితార - సంగారెడ్డి | వెంకటేశ్వర - వనపర్తి | మణికంఠ - చేవెళ్ళ | రామకృష్ణ - తొర్రూర్ | కిన్నెర 70 - కోరుట్ల
బాలాజి - మహబూబ్‌నగర్ | శ్రీనివాస - కోదాడ | లక్ష్మి 70 - శంకర్‌పల్లి | శ్రీనివాస - చౌటుప్పల్ | సూర్య కెఎం - నెక్కొండ | వెంకటేశ్వర - గద్వాల్
సాయిదత్త కాంప్లెక్స్ - మెదక్ | మనోజ్ - దేవరకొండ | సాయికృష్ణ - పరిగి | సుజన - చిట్యాల | శాంతి - మరిపెడ | వెంకటేశ్వర - నకిరేకల్
తిరుమల - నల్గొండ | పరమేశ్వరి - కొత్తగూడెం | మోహన్ - జహీరాబాద్ | వెంకటేశ్వర - వలిగొండ | అరవింద్ కెఎం - నర్సంపేట | వెంకటేశ్వర - నారాయణఖేడ్
శ్రీనివాస - మిర్యాలగూడ | విజయభాస్కర్ - భద్రాచలం | యాదగిరి - గజ్వేల్ | లక్ష్మి - యాదగిరిగుట్ట | ఆనంద్ - భూపాలపల్లి | పద్మనాభ - రాయచూర్
 | | స్వర్ణ కెఎం - జనగాం | మల్లేశ్వరి - తిరుమలగిరి | వెంకటేశ్వర - కమాన్‌పూర్ | సందీప్ - గంగావతి

జార్జ్‌తో పెళ్లి...సమ్మతమే!



జార్జ్‌తో అమీ జాక్సన్

‘అమీ అనే నేను జార్జ్‌ని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంటున్నాను. ఈ వివాహం నాకు సమ్మతమే’- బ్రిటన్ బేబీ అమీ జాక్సన్ నిజ జీవితంలో దేవుని ముందు ఈ విధంగా ప్రమాణం చేసే రోజు ఈ ఏడాదే వస్తుందని ఆమె సన్నిహితులు స్పష్టం చేశారు. కాకపోతే... తెలుగులో కాకుండా ఇంగ్లీషులో ఎక్కడో విదేశాల్లో ప్రమాణం చేస్తారు. తెలుగులో రామ్‌చరణ్ ‘ఎవడు’, తమిళంలో విక్రమ్ ‘ఐ’, విజయ్ ‘తెరి’, ధనుష్ ‘నవ మన్మధుడు’, ఆర్య ‘మదరాసుపట్టణం’ చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ లండన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి, మల్టీ మిలీనియర్ జార్జ్ పనయివోటుతో ప్రేమలో ఉన్నారని ఆదివారమే చిత్రజ్యోతి తెలిపింది. తాజా సమాచారం ఏంటంటే... ఈ ఏడాదే వీరిద్దరూ చర్చిలో రింగులు మార్చుకోనున్నారు. “జార్జ్‌తో ఉన్నప్పుడు అమీ సంతోషంగా ఉంటోంది. చాలా రోజుల నుంచి ఇద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. ఎక్కువ రోజులు అమీ ప్రేమలో ఉండడం కూడా ఇదే తొలిసారి. త్వరలో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు” అని అమీ జాక్సన్ సన్నిహితులు తెలిపారు. ప్రస్తుతం అమెరికన్ టీవీ సిరీస్ ‘సూపర్‌గాళ్’లో నటిస్తున్న అమీ, రజనీకాంత్ ‘2.0’ విడుదల కోసం ఎదురు చూస్తున్నారు.



అమీ జాక్సన్